
శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180




నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం — 03
భూపాలపల్లిలో అమానవీయ సంఘటన

'సర్' ప్రక్రియకు అడ్డంకులు రానివ్వం — 05
అవసరమైతే ఆదేశాలు జారీ చేస్తాం: సుప్రీం



సంపుటి 28, సంచిక: 229 | మంగళవారం | 10-02-2026 | హైదరాబాద్ — Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar — పేజీలు: 12 | వెల రూ. 5.00


# రాహుల్‌గాంధీని మాట్లాడనీయాల్సిందే



## లోక్‌సభలో పట్టుబట్టిన కాంగ్రెస్ ఎంపీలు

- అధికార, విపక్ష సభ్యుల మధ్య ప్రతిష్టంభన
- సభ మంగళవారానికి వాయిదా

**న్యూఢిల్లీ :** కేంద్ర బడ్జెట్‌పై చర్చ ప్రారంభం కావడానికి ముందు తాను మాట్లాడేందుకు అనుమతించాలని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. దీంతో ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్టంభన నెలకొంది. ఈ నేపథ్యంలో స్పీకర్ సభను మంగళవారానికి వాయిదా వేశారు. సోమవారం ఉదయం సభ రెండుసార్లు వాయిదా పడి న తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు సభ తిరిగి సమావేశమైంది. అధ్యక్ష స్థానంలో ఉన్న సంధ్యా రాయ్, బడ్జెట్‌పై చర్చను ప్రారంభించాల్సిందిగా కాంగ్రెస్ సభ్యుడు శశి థరూర్‌ను కోరారు. తాను ప్రసంగం ప్రారంభించడానికి ముందు కొన్ని అంశాలను లేవనెత్తడానికి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న రాహుల్‌గాంధీని అనుమతించాలని థరూర్ అధ్యక్ష స్థానంలో ఉన్నవారికి తెలిపారు. బడ్జెట్‌పై రాహుల్‌గాంధీ మాట్లాడాలనుకుంటే తనకు ఎలాంటి అభ్యంత రం లేదని రాయ్ చెప్పి, ఆయనను మాట్లాడమని కోరారు. స్పీకర్ ఓం బిర్లా, కొంత మంది ప్రతిపక్ష ఎంపిల మధ్య జరిగిన సమావేశంలో బడ్జెట్ చర్చకు ముందు తాను కొన్ని అంశాలను లేవనెత్తడానికి అనుమతిస్తారని ఒక ఒప్పందం కుదిరిందని, అయితే ఇప్పుడు స్పీకర్ తన మాటను నిలబెట్టుకోవడం లేదని రాహుల్ పేర్కొన్నారు. అలాంటి ఒప్పందం గురించి తనకు తెలియదని, ముంద స్తు నోటీసు లేకుండా ఎవరినీ ఏ విషయంపైనా మాట్లాడటానికి అనుమతించలేనని రాయ్ అన్నారు. ఈ సమయం లో, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు జోక్యం చేసుకుని, అలాంటి ఒప్పందం ఏదీ జరగలేదని, ప్రతిపక్ష నాయకుడు స్పీకర్ గురించి ఏదైనా చెప్పాలనుకుంటే, దానికి సమాధానం ఇవ్వడానికి బిర్లా కూడా సభ లో ఉండాలని అన్నారు. ఈ విషయంపై సభలోని ఇతర సభ్యులు కూడా మాట్లాడతారని, దీనిపై విస్తృత చర్చ జరుగుతుందని రిజిజు అన్నారు. ఇరుపక్షాలు తమ తమ వైఖరి నుంచి వెనక్కి తగ్గకపోవడంతో రాయ్ సభను మంగళవారానికి వాయిదా వేశారు. అంతకుముందు లోక్‌సభ కార్యకలాపాలు రెండుసార్లు వాయిదా పడ్డాయి ఒకసారి ఉదయం 11 గంటలకు రోజువారీ కార్యకలాపాలు ప్రారంభమైనప్పుడు, కొన్ని నిమిషాల చర్చ తర్వాత. ల్లీ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా పడ్డాయి. ఉదయం 11 గంటలకు, తరువాయి 2లో

## ఓమ్ బిర్లాపై అవిశ్వాస తీర్మానం?



రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నాయకులను సభలో మాట్లాడకుండా అడ్డుకున్నందుకు, అలాగే ఎనిమిది మంది ఎంపిలను సస్పెండ్ చేసినందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని ప్రతిపక్షం యోచిస్తోంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 94సి కింద ఈ తీర్మానానికి నోటీసు ఇచ్చే అవకాశం ఉందని, ఇప్పటికే 100 మందికి పైగా ప్రతిపక్ష ఎంపిలు దానిపై సంతకాలు చేశారని వర్గాలు తెలిపాయి. అయితే, టిఎంసి ఎస్ఐఆర్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ రిపోర్ట్) సమస్యను మరింత తీవ్రంగా లేవనెత్తాలని చూస్తుండగా, సమాజ్‌వాదీ పార్టీ మాల్వా రాణి అహల్యాబాయి హోల్కర్‌కు జరిగిన అవమానాన్ని హైలైట్ చేయాలని కోరుకుంటోంది. ధన్యవాద తీర్మానంపై ప్రతిపక్ష నాయకుడిని సభలో మాట్లాడకుండా తరువాయి 2లో

# మున్సిపల్ ఎన్నికలతో మోదీకేం సంబంధం?



## ఢిల్లీలో ఉండే ప్రధాని ఇక్కడి మున్సిపాలిటీల్లో మురికిని తీస్తారా?

- ఫామ్ హౌస్‌లో ఉన్న మాజీ సిఎం కెసిఆర్ కూడా మున్సిపాలిటీలకు నీళ్లు ఇవ్వడు
- ఇంకా మూడేళ్లు మేమే.. మరో ఐదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే
- మురికి కాలువల నుంచి ఇందిరమ్మ ఇళ్ల వరకు అన్ని పనులు చేయిస్తా'
- పురపోరులో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి మధ్య త్రిముఖ పోటీ
- అభివృద్ధిని బేరీజు వేసుకొని, భవిష్యత్తును ఆలోచించుకుని తీర్పు ఇవ్వండి
- ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపు
- పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా ఇస్తామన్న మోదీ మాటలు నీటి మూటలయ్యాయని విమర్శ
- సమస్యలకు ప్రధాన కారణమైన కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌లు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని మండిపాటు

ప్రజాపక్షం/హైదరాబాద్

'అసలు తెలంగాణ మున్సిపల్ ఎన్నికలకు, ప్రధాని మోదీకి ఏమి సంబంధం? ఢిల్లీలో ఉండే మోదీ వచ్చి ఇక్కడి మున్సిపాలిటీల్లో మురికిని తీస్తారా. ఫాస్ హౌజ్‌లోని మాజీ సిఎం కెసిఆర్ వచ్చి మున్సిపాలిటీలకు నీళ్లు ఇవ్వడు. ఇంకా మూడేళ్లు నేనే ఉంటా, ఆ తరువాత ఐదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది. ఇప్పుడు మున్సిపల్ శాఖ మంత్రిగా నేనే ఉన్నా. 'మున్సిపాలిటీల అభివృద్ధిని బాధ్యతను నేను తీ సుకుంటా. మున్సిపాలిటీలకు సమగ్ర ప్రణాళికలను రూపొందిస్తా. సంక్షేమ చర్యలను అమలు చేస్తా. మురికి కాలువల నుంచి ఇందిరమ్మ ఇళ్ల వరకు అన్ని పనులు చేయిస్తా' తెలంగాణ సమాజానికి ఏది మేలు చేస్తుందో ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోండి'' అని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసిన నేపథ్యంలో సోమవారం సాయంత్రం సిఎం తరువాయి 2లో

## దక్షిణాదికి తీవ్ర అన్యాయం

తెలంగాణకు లక్షల కోట్ల రూపాయలను ఇచ్చామని బిజెపి నేతలు చెబుతున్నారని, దీనిపై ప్రభుత్వ సిఎస్‌ను వివరణ అడిగితే తెలంగాణ రాష్ట్రం పన్నుల రూపంలో రూపాయి చెల్లిస్తే కేంద్ర ప్రభుత్వం 42 పైసలు ఇస్తోందని చెప్పారని సిఎం వెల్లడించారు. 'దక్షిణాది రాష్ట్రాలకు బిజెపి ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోంది. బిహార్ ఒక్క రూపాయి పన్ను చెల్లిస్తే రూ.6.16 కేంద్రం ఇస్తోంది. తెలంగాణకు అన్యాయం జరుగుతున్నప్పుడు ఏ రోజైనా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ మాట్లాడారా? మనకు అదనంగా ఇవ్వాల్సిన అవసరం లేదు. మనం చెల్లించిన నిధులు తిరిగిస్తే చాలు. కేంద్రానికి వచ్చే పన్నుల్లో దక్షిణాది రాష్ట్రాలే 40 శాతానికి పైగా చెల్లిస్తున్నాయి' అని సిఎం అన్నారు.



# ముమ్మాటికీ 'పచ్చి దోపిడీ'

- దేశంలో డిజిటల్ మోసాల ద్వారా రూ.54వేల కోట్లు కొల్లగొట్టడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం
- బ్యాంకులు, టెలికాం శాఖలతో చర్చించి ఎస్ఒపి రూపొందించాలని కేంద్రానికి ఆదేశం

**న్యూఢిల్లీ :** దేశంలో డిజిటల్ మోసాల ద్వారా రూ.54వేల కోట్లకు పైగా సొమ్ము దోపిడీకి గురికావడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది ముమ్మాటికీ 'పచ్చి దోపిడీ, డెకాయిటీ' అని వ్యాఖ్యానించింది. ఇలాంటి కేసులను ఎదుర్కోవడానికి ఆర్‌బిఐ, బ్యాంకులు, టెలికాం శాఖలతో సంప్రదించి, ఒక పక్కా 'స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్' (ఎస్ఒపి) రూపొందించాలని తరువాయి 12లో




# 'మున్సిపల్' ప్రచారం బంద్

## హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారానికి తెర

- రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి 48 గంటల సైలెంట్ పీరియడ్
- జోరందుకున్న నగదు, మద్యం, తాయిలాల పంపిణీ
- అప్రమత్తమైన ఎన్నికల యంత్రాంగం
- 11న పోలింగ్

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది. హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచార పర్వానికి తెరపడింది. సోమవారం సాయంత్రం 5 గంటలతో ప్రచారానికి ఫుల్ స్టాప్ పడగా, రాష్ట్రవ్యాప్తంగా 48 గంటల సైలెంట్ పీరియడ్ అమల్లోకి వచ్చింది. దీంతో మైకులు మూగబోయాయి. ర్యాలీలు, సభలు నిలిచిపోయాయి. ప్రచారం ముగియడంతో తాయిలాల పంపిణీ జోరందుకుంది. అయితే ఓటర్లను ప్రభావితం చేసే ఎలాంటి ప్రచారం జరగకుండా రాష్ట్ర ఎన్నికల సంఘం కఠిన చర్యలు చేపట్టింది. ఈ నెల 11వ తేదీ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుండగా, 13వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 నగరపాలక సంస్థలు, 2,996 వార్డులకు పోలింగ్ జరగనుంది. ఎన్నికల ప్రచార పర్వం ముగియడంతో రాష్ట్రవ్యాప్తంగా పోలింగ్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ఎన్నికల సంఘం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలను మూసివేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అన్ని రాజకీయ పార్టీల నేతలు, అగ్రనేతలు ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా జోరుగా ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమంలో అధికార, ప్రతిపక్ష నేతల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు, విమర్శలు, ప్రతి విమర్శలతో హోరెత్తించారు. అగ్రనేతలతో పాటు కేడర్ అంతా ఇంటి బాటపడుతోంది. ఆఖరి రోజు ప్రచారంలో పాల్గొన్న నేతలు ఓటర్లను ఆకట్టుకునేందుకు తుది ప్రయత్నాలు చేశారు. ఈ నెల 11వ తేదీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర తరువాయి 2లో

### పార్టీల వారీగా చూస్తే..

| | |
|---|---|
| కాంగ్రెస్ | : 2,948 వార్డులు |
| బిఆర్ఎస్ | : 2,634 వార్డులు |
| సిపిఐ | : 168 వార్డులు |
| బిజెపి | : 2,634 వార్డులు |
| ఇండిపెండెంట్లు | : 2,786 మంది |
| ఆమ్ ఆద్మీ పార్టీ | : 38 వార్డులు |
| బిఎస్‌పి | : 213 వార్డులు |
| సిపిఐ(ఎం) | : 128 వార్డులు |
| ఎంఐఎం | : 282 వార్డులు |
| ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ | : 288 వార్డులు |
| జనసేన | : 332 |

### ఓటర్ల వివరాలు

ఈ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 52.43 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

| | |
|---|---|
| మహిళా ఓటర్లు | : 26.80 లక్షలు |
| పురుష ఓటర్లు | : 25.62 లక్షలు |
| థర్డ్ జెండర్ ఓటర్లు | : 640 మంది |

మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.



# ఆత్మ గౌరవం నిలుపుకుందాం

- కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను గెలిపించుకుందాం
- ఎర్రజెండా ఎక్కడుందన్న వాళ్లు ఎందుకు హైరానా పడుతున్నారు ?
- ప్రచార కార్యక్రమాల్లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

ఇది అహంకారానికి ఆత్మీయకు మధ్య జరుగుతున్న పోటీ అని, ఈ కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుని ఆత్మగౌరవాన్ని నిలుపుకుందామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లో భాగంగా సోమవారం రామవరంలోని ఆరు డివిజన్లు, బర్మా క్యాంపు, ఫ్యూన్స్ బస్తీ, ఏపవర్ హౌస్ బస్తీ, గంగాబిషన్ బస్తీలో రోడ్ షోలు,కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఎర్రజెండాది ఏముందిలే, కమ్యూనిస్టుల అయిపోయింది అంటూ అవాకులు చెవాకులు పేలుతున్నవాళ్లు సిపిఐకి అందుతున్న ఆదరణను చూసి ఎందుకు హైరానా పడుతున్నారని అన్నారు. పాల్వంచ మొదలుకుని కొత్తగూడెం, సుజాతనగర్ వరకు ఉన్న కార్పొరేషన్ 60 డివిజన్లు ఎరుపు, పసుపు రంగుల జెండాలతో రెపరెపలాడుతున్నాయని చెప్పారు. కార్పొరేషన్ కాకుండా చాలా మంది కుట్రలు పన్నారని, కానీ వారి ప్రయత్నాలు పటాపంచలు చేస్తూ ప్రభుత్వంతో కొట్లాడి కార్పొరేషన్ ఏర్పాటు చేసుకున్నామని, తద్వారా ఈప్రాంతం తరువాయి 2లో

## ఎలైట్ లిక్కర్ మార్ట్ లైసెన్స్...

# రూ.1.26 కోట్లు మోసం

హైదరాబాద్‌లో వెలుగుచూసిన ఘటన



ప్రజాపక్షం/హైదరాబాద్

ఎలైట్ లిక్కర్ మార్ట్ లైసెన్స్ ఇప్పిస్తామని నమ్మించి ఓ వ్యక్తిని రూ.1.26 కోట్ల రూపాయల మేరకు మోసం చేసిన ఘటన హైదరాబాద్‌లో వెలుగుచూసింది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా మారం సురేష్ రెడ్డి, ఆయన భార్య మారం మమతతో పాటు వారి అనుచరులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా చంద్రుబట్లకు చెందిన మాధవ రెడ్డి కొండకిండి (60) ఫిర్యాదు మేరకు హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. 2019లో తరువాయి 12లో

# బ్రిటన్ ప్రధాని కీవ్ స్టార్మర్ వచ్చేవారం రాజీనామా?

## ఎప్‌స్టీన్ కేసు : లేబర్‌పార్టీ పరువు తీసిన మాండెల్సన్



**లండన్:** ప్రపంచ ప్రముఖులను అవినీతి–లైంగిక సంబంధాల రొచ్చులోకి లాగి జైలులో మరణించిన అమెరికా ఫైనాన్సియర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ వివాదం బ్రిటన్ ప్రధానమంత్రి కీవ్ స్టార్మర్ మెడకు చుట్టుకుంది. సొంత పార్టీ ఎంపీల నుండే ఆయనపై రాజీనామా ఒత్తిడి వస్తోంది. ఒపీనియన్ పోల్స్‌లో కూడా ఆయనకు ఆదరణ దక్కలేదు. చివరకు ఆయన రాజీనామా చేసే పరిస్థితులు వచ్చాయి. అన్నీ తెలిసే మాండెల్సన్‌ను అమెరికాలో బ్రిటన్ దౌత్యవేత్తగా నియమించారని, తప్పుచేసిన తర్వాత కూడా స్టార్మర్ ఎలా పదవిలో కొనసాగుతున్నరని పలువురు లేబర్‌పార్టీ ఎంపీలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారని టాస్‌వార్తాసంస్థ వ్యాఖ్యానించింది. ఈ పరిస్థితుల్లో స్టార్మర్ వచ్చేవారం తన పదవికి రాజీనామా చేసే అవకాశాలు ఉన్నాయని బ్లూంబెర్గ్ నివేదిక వెల్లడించింది. స్టార్మర్ రాజీనామా చేసేవిధంగా ఆయనపై ఒత్తిడి తీసుకురావాలని లేదా బెదిరింపులన్నా చేయాలని టెన్‌డౌనింగ్ స్ట్రీట్‌లో పనిచేసే సిబ్బంది ప్రైవేటు సంభాషణల్లో గవర్నమెంట్ మెంబర్స్‌ను అభ్యర్థిస్తున్నారని బ్లూంబెర్గ్ పేర్కొంది. మంత్రివర్గంలో ఒకరి సలహాదారు చెప్పిన సమాచారం ప్రకారం స్టార్మర్ వచ్చేవారం రాజీనామా చేసేందుకు యాభై శాతం అవకాశాలు తరువాయి 12లో

# సంక్లిష్టదశలో కార్మికవర్గం

- అందుకే సార్వత్రిక సమ్మె
- 12న సమ్మెపై కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక స్పష్టీకరణ




**న్యూఢిల్లీ:** దేశంలో కార్మికవర్గం నియంత్రణలకు, అణచివేతలకు గురవుతున్న సంక్లిష్ట తరుణంలో ఫిబ్రవరి 12వ తేదీన దేశంలో కర్షకులు, సామాన్య ప్రజాబాహుళ్యం మద్దతుతో కార్మికులు దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె చేపట్టారని కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర రంగాల సమాఖ్యలు,సంస్థల ఐక్యవేదిక స్పష్టం చేసింది. మరో 48 గంటల తర్వాత దేశంలో సార్వత్రిక సమ్మె ప్రారంభం కానున్న తరుణంలో ఐక్యవేదికలోని పది కార్మిక సంఘాల నాయకులు న్యూఢిల్లీ నుండి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, హెచ్‌ఎంఎస్, సిఐటియు, ఎఐయుటియుసి, టియుసిసి, ఎస్ఇడబ్ల్యుఎ, ఎఐసిసిటియు, ఎల్‌పిఎఫ్, యుటియుసి నాయకులు ఈ సంయుక్త ప్రకటనపై సంతకాలు చేశారు. ఆర్థిక వ్యవస్థ ఆందోళన కలిగించేస్థాయిలో క్షీణించిపోతూ, దేశంలో నిరుద్యోగం భయంపుట్టించేస్థాయిలో పెరిగిపోయి, 65 లక్షల ఉద్యోగ ఖాళీలను ఇంకా భర్తీ చేయకుండా వాటిస్థానంలో పద వీ విరమణ చేసినతరువాయి 12లో

## సార్వత్రిక సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు

కర్షక సంఘాల మద్దతుతో దేశంలో కార్మికులు నిర్వహించే ఫిబ్రవరి 12 తేదీ నాటికి సమ్మెకు భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) జాతీయ కార్యదర్శివర్గం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కార్మికులు, భూమిలేని కూలీలు, రైతులు నిర్వహిస్తున్న సమైక్య సమ్మెపట్ల పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. దేశంలో కార్మిక,రైతుకూలీ వ్యతిరేక వైఖరిని ప్రభుత్వం మానుకోవాలని, నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలని, కార్మికులు,కర్షకుల ప్రయోజనాలను తరువాయి 12లో

## థాయ్‌లాండ్‌లో మళ్ళీ అనుతిన్ కూటమి ప్రభుత్వం



**బ్యాంకాక్:** ఆగ్నేయ ఆసియా దేశం థాయ్‌లాండ్ ఎన్నికల్లో ప్రధానమంత్రి భూమిజైతయ్ పార్టీ నాయకుడు అనుతిన్ ఛర్న్‌విరాకుల్ (60) విజయం సాధించారు. తామే గెలిచామని, కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ఆయన సోమవారం ప్రకటించారు. 500 స్థానాలున్న దిగువసభకు ఆదివారం ఎన్నికలు జరిగాయి. 251 సీట్లు గెలుచుకున్న వారికే అధికారం దక్కుతుంది. 94 శాతం ఓట్ల లెక్కింపు పూర్తయ్యేనాటికి భూమి జైతై పార్టీ 194 సీట్లు, ప్రతిపక్ష పీపుల్స్‌పార్టీ 118 సీట్లు, ఫూ థాయ్ పార్టీ 74 సీట్లు గెలుచుకున్నాయి. దేశంలో రాజ్యాంగ సంస్కరణలు కొనసాగించడానికి కూడా కొత్త పార్లమెంటుకు అధికారాన్ని ఇస్తూ రిఫరెండంలో ప్రజలు అనుమతి ఇచ్చారు. ప్రతిపక్ష పీపుల్స్‌పార్టీ నాయకుడు నత్తాఫాంగ్ రుయెంగ్ పన్యావుట్ (39) ఓటమిని అంగీకరించారు. గత ఏడాది సెప్టెంబరులో పీపుల్స్‌పార్టీ నాయకుడు పన్యావుట్ ప్రధానమంత్రి అనుతిన్‌కు మద్దకతు ఇచ్చేందుకు అంగీకరించారు. ఆ రెండు పార్టీలు అధికార,ప్రతిపక్షాలుగా కొనసాగుతాయి. కానీ ఫూ థాయ్ పార్టీ మాత్రం ఈ ఎన్నికల ఫలితాలను తిరస్కరించింది. ఇక కొత్త ప్రభుత్వంలో కీలకపదవులన్నీ ప్రధానమంత్రి అనుతిన్ తన చేతుల్లోనే కేంద్రీకరించుకునేందుకు సిద్ధం అవుతున్నారు. సైనిక పాలననాటి రాజ్యాంగాన్ని సంస్కరించేందుకు మార్పులు చేసేందుకు రెఫరెండంలో ప్రజలు పార్లమెంటుకు పూర్తి అధికారాలు కట్టబెట్టారు.

# జపాన్ ప్రధాని తకైచీ చరిత్రాత్మక విజయం

## ఇక అందరికళ్ళూ బడ్జెట్ సవాలుపైనే



టోక్యో: ఎగ్జిట్ పోల్స్‌లో పేర్కొన్నవిధంగానే జపాన్‌లో కన్జర్వేటివ్‌లు విజయం సాధించారు. దిగువసభకు జరిగిన ఎన్నికల్లో లిబరల్ డెమొక్రటిక్‌పార్టీ (ఎల్‌డిపి) కూటమి విజయభేరీ మోగించింది. ప్రధానమంత్రి సనే తకైచీ (65) సారథ్యంలో ఎల్‌డిపి కూటమి 352 స్థానాలు దక్కించుకుని తిరుగులేని విజయం సాధించింది. ఒక్క లిబరల్ డెమొక్రటిక్‌పార్టీ మాత్రమే కావాల్సిన మెజారిటీకంటే ఎక్కువగా మొత్తం 316 స్థానాలు సొంతం చేసుకుంది. ఇప్పటివరకూ లిబరల్ పార్టీకి దిగువసభలో మెజారిటీకంటే తక్కువగా 198 స్థానాలు మాత్రమే ఉండేవి. ఎల్‌డిపి భాగస్వామి జపాన్ ఇన్నొవేషన్ పార్టీ (జెఐపి) 36 స్థానాలు గెలుచుకుంది. జెఐపికి ఇంతకుముందు దిగువసభలో 34స్థానాలు మాత్రమే ఉండేవి. జపాన్‌ను ఇప్పటివరకూ 66 మంది ప్రధానమంత్రులు పాలించారు. ఇప్పుడు తకైచీ రెండోసారి మహిళా ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. డెమొక్రటిక్‌పార్టీ ఆఫ్ జపాన్ నుండి 2012లో షింజో అబే నాయకత్వంలో తిరిగి అధికారం తీసుకున్న తర్వాత ఎన్నికల్లో లిబరల్ డెమొక్రటిక్‌పార్టీ ఘన విజయం సాధించడం మళ్ళీ ఇదే. స్థిరంగా దీర్ఘకాలం దేశాన్ని పాలించాలంటే చెక్కుచెదరని మెజారిటీ ఉండాలని బలంగా విశ్వసించిన తకైచీ అనుకున్న ఫలితాలు సాధించారు. ఇంతమాత్రంచేత దేశం తిరిగి మితవాదులచేతుల్లోకి వెళ్ళినట్లు కాదని కొందరు విశ్లేషకులు వ్యాఖ్యానించారు.

ఇక ఇప్పుడు దేశం యావత్తూ బడ్జెట్ పైనే దృష్టి సారించనున్నది. దేశంలో ఆర్థిక సవాళ్ళను తకైచీ సమర్థవంతంగా ఎదుర్కోవలసి ఉంది. ఇన్వెస్టర్లు తకైచీ ప్రకటించే ఆర్థిక ప్యాకేజీల కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవలికాలంలో జపాన్‌లో ధరలు పెరుగుతున్నాయి. చైనాతో యుద్ధ భయం కూడా పెరిగింది. గతంకంటే భిన్నమైన పరిస్థితులమధ్య ప్రశాంత జీవనం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

అధికారం చేపట్టిన మూడు నెలల స్వల్ప వ్యవధిలోనే మళ్ళీ ఎన్నికలకు వెళ్ళాలని, దిగువసభలో ఎవ్వరిపైనా ఆధారపడకుండా అనుకున్న నిర్ణయాలను తిరుగులేకుండా అమలు చేసేందుకు మెజారిటీ సంపాదించాలని తకైచీ తీసుకున్న నిర్ణయం సరైనదేనని ప్రజలు నిర్ధారించారు. జపాన్‌లో ఎల్‌డిపి–జపాన్ ఇన్నొవేషన్‌పార్టీలు కలిసి కూటమి ప్రభుత్వం నడుపుతున్నాయి. దిగువసభలో 233 స్థానాలు ఉంటే పాలనకు మెజారిటీ సంపాదించినట్లే. కానీ ఈ రెండుపార్టీలూ కలిసి అంతకంటే 132 స్థానాలు ఎక్కువ సంపాదించుకున్నాయి. దేశంలో 30 ఏళ్ళు లోపు వయసుగల 90 శాతం యువకులు తకైచీ పాలనకు మద్దతు తెలియజేశారని ఎన్నికలకు ముందు వెల్లడైన సర్వేను ఈ ఫలితాలు మరోసారి నిర్ధారించాయి.

**నరేంద్రమోదీ అభినందన**

జపాన్ ప్రధానమంత్రి సనే తకైచీకి భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అభినందనలు తెలియజేశారు. 'దిగువసభకు జరిగిన ఎన్నికల్లో చరిత్రాత్మకమైన ఘన విజయం సాధించినందుకు మీకు అభినందనలు' అని మోదీ ఎక్స్ వేదికగా సందేశం పంపించారు. భారత్–జపాన్ మధ్య ప్రత్యేకమైన, వ్యూహాత్మక–ప్రపంచవ్యాప్త భాగస్వామ్యం ఉందని, ప్రపంచ శాంతి, స్థిరత్వం, ప్రగతి సాధించడంలో ఇరు దేశాలభాగస్వామ్యం కీలకపాత్ర వహిస్తోందని పేర్కొన్నారు. 'మీ సమర్థవంతమైన నాయకత్వంలో భారత్–జపాన్ రెండు దేశాల మైత్రీ ఉన్నతస్థాయిల్లోకి చేరుకుంటుందని మాకు ఎంతో విశ్వాసం ఉంది' అని పేర్కొన్నారు.

## ముగింపు దశలో బంగ్లాదేశ్ ఎన్నికల ప్రచారం

### అధికారవర్గానికి యూనస్ కృతజ్ఞతలు



**ఢాకా:** బంగ్లాదేశ్‌లో ప్రతిష్ఠాత్మకమైన సార్వత్రిక ఎన్నికలకు ప్రచార పర్వం ముగింపుదశలో ఉంది. ఒకవైపు బిఎన్‌పి (బంగ్లాదేశ్ నేషలిస్ట్‌పార్టీ), మరోవైపు జమాతే ఇస్లామ్, ఇతర కొత్తపార్టీలు అధికారంకోసం ఉవ్విళ్ళూరుతున్నాయి. ఈనెల 12వ తేదీన ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. బంగ్లాదేశ్‌లో 2024లో హసీనా ప్రభుత్వంపై తిరుగుబాటు, విద్యార్థుల హింసాత్మక ఉద్యమం తర్వాత మహ్మద్ యూనుస్ నాయకత్వాన తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఈ ప్రభుత్వ హయాంలో బంగ్లాదేశ్‌లో అతి స్వల్పకాలంలో అనూహ్యమైన మార్పులు సంభవించాయి. మతవాదం వేళ్ళూనుకుంది. మైనారిటీలు రక్షణలు కోల్పోయారు. వారంతా హత్యలకు గురవుతున్నారు. ఆర్థిక పరిస్థితి తలక్రిందులైంది. కొత్త ప్రభుత్వంలో ఎవరు అధికారం చేపట్టినప్పటికీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం, ప్రాధాన్యతలు నిర్దేశించడం, కేటాయింపులు చేయడం, అన్ని వర్గాలను సంతృప్తి పరచడం అతిపెద్ద సవాలుగామారుతుంది. మరోవైపు జమాతే ఇస్లామీ మాత్రం ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తామూ కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా చేరతామని ప్రకటనలు గుప్పిస్తోంది. ఈ ప్రతిపాదనకకు బిఎన్‌పి తిరస్కరించింది.

ఇదిలా ఉండగా దేశంలో ఎన్నికల తర్వాత తాత్కాలిక ప్రభుత్వం రాజీనామా చేసి కొత్త ప్రభుత్వాన్ని ఆహ్వానించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో యూనుస్ అధికారానికి కొద్ది రోజులే సమయం మిగిలి ఉండటంతో అధికారవర్గాలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అధికారులు కూడా ఆయనకు వీడ్కోలు పలికేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇన్నాళ్ళుగా తమ ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందించినందుకు బ్యూరోక్రాట్లకు, అన్ని వర్గాల కార్యదర్శులకు, మంత్రులకు మహ్మద్ యూనుస్ కృతజ్ఞతలు చెప్పారు. సోమవారం ఉదయం ఒక గంటసేపు ఆయన కార్యదర్శులు,మంత్రులతో సమావేశం నిర్వహించి ఈ కృతజ్ఞతల ప్రక్రియ పూర్తిచేశారు. దాదాపు 70మంది ఉన్నతస్థాయి కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

**రాజకీయాలకు దూరంగా ఆర్మీ: బిఎన్‌పి**

బంగ్లాదేశ్ నేషనలిస్ట్‌పార్టీ అధికారంలోకి వస్తే సైన్యాన్ని రాజకీయ ప్రభావం నుండి దూరంగా ఉంచుతామని ఆ పార్టీ అధ్యక్షుడు తారిఖ్ రెహ్మాన్ ప్రకటించారు. సిటీహోటల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, తమ పార్టీ గెలిస్తే దేశంలో సైన్యాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోకుండా చాలా దూరంగా ఉంచుతామన్నారు.దేశంలో సైన్యం తన ప్రతిష్ఠ కోల్పోయిందని, ఈ ప్రతిష్ఠను పునరుద్ధరిస్తామని చెప్పారు. 2009లో పిల్కానాలో జరిగిన సామూహిక ఊచకోతల బాధిత కుటుంబాలు, సైనిక అధికారులతో జరిపిన సమావేశంలో మాట్లాడుతూ ఆయన పైవిధంగా భరోసా ఇచ్చారు.

## మార్చి 5న నేపాల్ ఎన్నికలకు రంగం సిద్ధం







**కాఠ్మండు :** నేపాల్‌లో మార్చి ఐదో తేదీన సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మరోవైపు రాజకీయపార్టీలు ఎన్నికల ప్రచారంలో మునిగితేలుతున్నాయి. నేపాల్ దిగువసభలో 275 స్థానాలు ఉన్నాయి. ఏపార్టీ అధికారం చేపట్టాలన్నాగానీ 138స్థానాలు గెలుచుకోవాలి. నేపాలీ కాంగ్రెస్‌పార్టీ (నాయకుడు గగన్‌కుమార్ థాపా), సిపిఎన్ యుఎంఎల్ (నాయకుడు కె.పి.శర్మ ఓలి), ఎన్‌సిపి (నాయకుడు పుష్పకమల్ దహల్) పార్టీలుప్రధానంగా ఎన్నికల బరిలో ఉన్నాయి. రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ, రాష్ట్రీయ ప్రజాతంత్ర పార్టీ, పీపుల్స్ సోషలిస్టు పార్టీ, జనమత్ పార్టీ, పీపుల్స్ సోషలిస్టుపార్టీ నే పాల్, ప్రగతిశీల్ లోక్‌తంత్రపార్టీలు కూడా ఎన్నికల బరిలో ఉన్నాయి. బ్యాలట్ పద్ధతిలో దిగువసభకు ఎన్నికలు జరుగుతాయి. దీంతో ఎన్నికల సంఘం ఇప్పటికే 12.25 మిలియన్ల బ్యాలెట్ పత్రాల ప్రింటింగ్ ప్రక్రియను పూర్తిచేసి వాటిని 11,000 బాక్సులలో భద్రపరచినట్లు ఎన్నికలసంఘం సహాయ అధికార ప్రతినిధి కుల్ బహదూర్ చెప్పారు. 44జిల్లాలో 100 నియోజకవర్గాలకు ఈ పత్రాలను పంపుతారు. మొత్తం ఎన్నికల ప్రక్రియకుగాను 20,323,000 బ్యాలెట్ పత్రాలు అవసరం అవుతాయని ఆయన చెప్పారు.

## ప్రచారం బంద్ (మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల సంఘం పర్యవేక్షిస్తోంది. మొత్తం 8,203 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ప్రతి కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ సౌకర్యం కల్పించారు. ఈ ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ల ద్వారానే ఓటింగ్ జరగనుండటంతో 16,301 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టగా, సుమారు 25 వేల మంది పోలీసు సిబ్బందిని బందోబస్తుకు నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,900 సమస్యాత్మక, 1,400 అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అన్ని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 24 గంటల భద్రతను ఏర్పాటు చేశారు.

**తాయిలాల పంపిణీపై నిఘా..**

ప్రచారం ముగియడంతో కొన్ని ప్రాంతాల్లో నగదు, మద్యం, తాయిలాల పంపిణీ జోరందుకోవడం గమనించిన ఎన్నికల యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని పోలింగ్ సిబ్బంది, పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పోలింగ్ నుంచి కౌంటింగ్ ముగిసే వరకు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.2 కోట్లకు పైగా నగదు, మద్యం, ఇతర వస్తువులు జప్తు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

**అభ్యర్థులు – పార్టీ వారీగా పోటీ**

రాష్ట్రవ్యాప్తంగా 22,519 మంది అభ్యర్థులు 29,742 నామినేషన్లు దాఖలు చేయగా, పరిశీలన, ఉపసంహరణ అనంతరం 12,944 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. వీరిలో 14 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## అవిశ్వాస తీర్మానం?

(మొదటి పేజీ తరువాయి)

అడ్డుకున్నందుకు, కాంగ్రెస్ మహిళా ఎంపిలపై బిజెపి ఎంపి నిషికాంత్ దూబే చేసిన నిరాధార ఆరోపణలపై చర్యలు తీసుకోనందుకు, ఎనిమిది మంది ప్రతిపక్ష ఎంపిలను సస్పెండ్ చేసినందుకు స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి ఈ నోటీసు ఇస్తున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. త్వరలో లోక్‌సభలో తీర్మానం ప్రవేశపెడతామని, ఎంపిల సంతకాలు సేకరిస్తున్నామని వారు చెప్పారు. ఇప్పటికే 103 మంది ఎంపిలు తీర్మానంపై సంతకాలు చేశారని, స్పీకర్‌పై ఎప్పుడు నోటీసు ఇవ్వాలనే దానిపై తుది నిర్ణయం మంగళవారం తీసుకుంటామని ఆ వర్గాలు తెలిపాయి. సోమవారం లోక్‌సభను మరుసటి రోజుకు వాయిదా వేసిన వెంటనే, రాహుల్ గాంధీ, టిఎంసికి చెందిన అభిషేక్ బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన అఖిలేష్ యాదవ్, డిఎంకెకు చెందిన టిఆర్‌బాలుతో కలిసి ఒక పరిష్కారం కనుగొని ప్రతిష్టంభనను ముగించడానికి బిర్లాను కలిశారు.

## ఐఎస్ఎస్‌కు రేపు నలుగురు వ్యోమగాములు

### ప్రయాణానికి స్పేస్‌ఎక్స్ రంగం సిద్ధం



**కేప్‌కేనెవరల్ :** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు నలుగురు వ్యోమగాములు నిర్ణీత ప్రకారం బుధవారం బయలుదేరేందుకు నాసా ఏర్పాట్లు సిద్ధం చేసింది. అమెరికాలోని నాసాకు చెందిన కేప్ కేనవరెల్ స్పేస్ ఫోర్స్ అంతరిక్ష కేంద్రం నుండి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి నలుగురు వ్యోమగాములు బుధవారం (ఫిబ్రవరి11) ఉదయం 6.01 గమంటలకు స్పేస్‌ఎక్స్ ఫాల్కన్–9 వాహకనౌకలో బయలుదేరతారు. 12వతేదీ గురువారం ఉదయం 10.30 గంటలకు డ్రాగన్ నౌక అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి అనుసంధానం అవుతుంది. తర్వాత వారు నౌకలోంచి ఐఎస్ఎస్ కేంద్రంలోకి ప్రవేశిస్తారు. కాస్మొనాట్ ఆండ్రీ ఫెడ్యయేవ్, నాసాకు చెందిన జెస్సికా మెయిర్ (కమాండర్), యూరోపియన్ స్పేస్ ఏజన్సీకి చెందిన జాక్ హథావే (పైలట్), సోఫియా అడెనోట్ (ఇద్దరూ మిషన్ స్పెషలిస్టులు) ఐఎస్ఎస్‌కు వెళ్ళేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరంతా ఈనెల ఆరోతేదీన కేప్ కేనవెరెల్ కేంద్రానికి చేరుకున్నారు. ఈ నలుగురు వ్యోమగాములూ ఎనిమిది నెలలపాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో గడుపుతారు. ఇటీవల ఫాల్కన్–9 వాహకనౌక అప్పర్ స్టేజీకి వెళ్ళిన తర్వాత ఒక సమస్య ఎదురు కావడంతో ప్రయోగంలో సమస్యలు ఎదురయ్యాయి. ఆ తర్వాత ఎఫ్ఎఎ దర్యాప్తు చేసి క్రూ–12 మిషన్ అంతరిక్ష యానం చేయడానికి పరిస్థితులు అనుకూలంగానే ఉన్నాయని, సురక్షితమైన విధానం అందుబాటులో ఉందని నిర్ధారించిన తర్వాత నలుగురు అంతర్జాతీయ వ్యోమగాలుమూ రోదసీలోకి బయలుదేరడానికి అనుమతి లభించింది. దీంతో స్పేస్ ఎక్స్ తిరిగి తాజాగా ఈ క్రూ–12 ప్రయోగానికి అన్ని ఏర్పాట్లు చేసింది. ఫాల్కన్ వాహకనౌక శిఖరాగ్రాన నలుగురు వ్యోమగాములు కూర్చున్న డ్రాగన్ నౌకను అమర్చి బుధవారం ఉదయం రాకెట్‌ను ప్రయోగిస్తారు.

**చంద్రుడిపై స్పేస్‌ఎక్స్ సొంత నగరం**

చంద్రుడిపై రాబోయే పదేళ్ళలో స్పేస్ ఎక్స్ తన సొంత నగరం నిర్మించుకుంటుందని ఆ సంస్థ అధినేత ఎలాన్‌మస్క్ ప్రకటించారు. రాబోయే పదేళ్ళలో మార్టియన్ కాలనీ నిర్మాణంపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తామని చెప్పారు. అక్కడినుండి రాబోయే తరాలు ఇతర గ్రహాలపైకి అడ్వాన్స్‌డ్ ప్రయోగాలు చేయడానికి ఎంతో వీలుగా ఉంటుందని ఆయన ప్రటించారు. చంద్రుడుపై సొంత నగరాన్ని నిర్మించుకున్న తర్వాత అక్కడి నుండి మార్స్ (అంగారకుడు లేదా కుజుడు) గ్రహంపైకి వెళ్ళేందుకు ప్రయోగాలను 20 ఏళ్ళపాటు స్పేస్ ఎక్స్ ఉద్ధృతగా కొనసాగిస్తుందని ప్రణాళిక వివరించారు.

## హాంగ్‌కాంగ్ పత్రికాధిపతి జిమ్మీకి 20ఏళ్ళు జైలు

### సమర్థించిన చైనా : ఖండించిన తైవాన్

**విక్టోరియా సిటీ:** 'యాపిల్ డైలీ' పత్రికాధిపతి, హాంకాంగ్‌లో అతిపెద్ద మీడియాసంస్థ 'నెక్ట్స్ డిజిటల్ మీడియా లిమిటెడ్' అధినేత జిమ్మీ లై (78)కు హాంగ్‌కాంగ్ న్యాయస్థానం 20 సంవత్సరాలు కారాగార శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. ఈ తీర్పును చైనా ప్రభుత్వం సమర్థించగా, తైవాన్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. కోర్టు తీర్పును ఖండించింది. పత్రికా విలువలకు,పత్రికాస్వేచ్ఛకు ఈ తీర్పు విరుద్ధమని, వాక్‌స్వాతంత్ర్యాన్ని అణచివేత, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని తైవాన్ ప్రభుత్వం విమర్శించింది. తక్షణం తీర్పును రద్దు చేయాలని కోరింది. హాంగ్‌కాంగ్ ప్రజలు తమ హక్కులు రక్షించుకోవాలని పిలుపు ఇచ్చింది. హక్కుల సంఘాలు కూడా తీర్పును వ్యతిరేకించాయి. హాంగ్‌కాంగ్‌కు విస్తారమైన స్వాతంత్ర్యం కావాలంటూ 2019లో జరిగిన ప్రదర్శనలు యావత్ ప్రపంచం దృష్టినీ ఆకర్షించాయి. ఈ ప్రదర్శనలకు మద్దతు ఇచ్చి దేశంలో అశాంతి రెచ్చగొట్టారన్న ఆరోపణలపై 'యాపిల్ డైలీ' పత్రికాధిపతి జిమ్మీలై ను పోలీసులు అరెస్టుచేసి విచారణ జరిపారు. కోర్టు ఆయనకు సోమవారం జైలు శిక్ష ఖరారు చేసింది.

## నిలుపుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

శరవేగంగా అభివృద్ధి చెందనుందన్నారు. రాబోయేరోజుల్లో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, ప్రజల ఆర్థిక స్థితి గతుల్లో మార్పులు చోటు చేసుకుంటాయని, పారిశ్రామిక, విద్యా,వైద్య రంగాలు మరింత అభివృద్ధి సాధిస్తాయని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుండి పెద్ద ఎత్తున నిధులు సమీకరించి నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధిని కొనసాగిస్తున్నామని చెప్పారు. మారుమూలు ప్రాంతాల్లో సైతం మౌళిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఎర్త్ యూనివర్సిటీ తీసుకొచ్చామని, ఈ యూనివర్సిటీలో చదువుకునేందుకు దేశ విదేశాల నుండి విద్యార్థులు శాస్త్రవేత్తలు తరలిరాబోతున్నారని అన్నారు. సింగరేణి సౌజన్యంతో బస్టాండ్ ఏరియా రోడ్ల వెడల్పుతో పాటు నూతన బస్టాండ్ నిర్మాణానికి నిధులు తీసుకొస్తున్నామని చెప్పారు. సింగరేణి కార్మికుల సంక్షేమానికి అనేక పోరాటాలు చేసి కార్మికుల శ్రేయస్సుకు ఎర్రజెండా పాటు పడుతుందని తెలిపారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల కోసం కార్మికులు, కర్షకులు చేతివృత్తిదారుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి స్వార్థం లేకుండా కేవలం అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. పేదలకు అండగా ఉండేది ఎర్రజెండానే అని, ఈవందేళ్ల కాలంలో ఇది నిరూపితమైందని తెలిపారు. ప్రజా ఆశీర్వాదమే మనకు బలమని, కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి సిపిఐ అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారా సురపరిపాలనను స్వాగతిస్తున్నట్లు అవుతుందని అన్నారు. కార్పోరేషన్ వ్యాప్తంగా చక్కటి ఫలితాలు రానున్నాయని, మేయర్ పీఠం మనదే అని చెప్పారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, కందుల భాస్కర్, ఎస్కే ఫహీమ్, వాసిరెడ్డి మురళీ, దుర్గరాశి వెంకన్న, మునిగడప వెంకటేశ్వర్లు, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, జక్కుల గట్టయ్య, క్రిష్టాఫర్, జహీర్, ఖయ్యూమ్, గోపి కృష్ణ, గుత్తుల సత్యనారాయణ, గుత్తుల శ్రీనివాస్, లావుడ్య వినాయక్, భూక్యా ధ్రస్తు, జక్కుల రాములు, కొమారి హన్మంతరావు, గెద్దాడు నగేష్, వంగ వెంకట్, రమణమూర్తి, సందెబోయిన శ్రీనివాస్, మునిగడప పద్మ, భూక్య శ్రీనివాస్, ఎర్రవెల్లి శంకర్, కనుకుంట్ల సాహితి, పి ఇందిరా ప్రియదర్శిని, పోలమూరి ధనలక్ష్మీ, బానోత్ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## మాట్లాడనీయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

సభ ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపట్టినప్పుడు, ప్రతిపక్ష సభ్యులు కొన్ని సమస్యలను లేవనెత్తడం ప్రారంభించి, వాటిని తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధ్యక్ష స్థానంలో ఉన్న బిర్లా, ఈ సమస్యలను కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా లేవనెత్తవచ్చన్నారు. ప్రతిపక్ష నాయకుడితో సహా సభ్యులందరూ చర్చ సందర్భంగా మాట్లాడటానికి స్వేచ్ఛ ఉందని ఆయన అన్నారు.

ప్రతిపక్ష సభ్యులు వెనక్కి తగ్గకపోవడంతో ప్రణాళికాబద్ధమైన అంతరాయాలకు పాల్పడుతున్నారని బిర్లా విమర్శించారు. నిబంధనల ప్రకారం సభను నడవనివ్వాలని కోరారు. వివిధ సమస్యలపై నిరసనలు కొనసాగడంతో, స్పీకర్ సభ కార్యకలాపాలను కొద్దిసేపు వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి సమావేశమైనప్పుడు, బడ్జెట్‌పై చర్చను చేపట్టడానికి ముందు గాంధీని మాట్లాడటానికి అనుమతించాలని ప్రతిపక్ష పార్టీలు పట్టుబట్టాయి. అధ్యక్ష స్థానంలో ఉన్న కృష్ణ ప్రసాద్ తెన్నేటి బడ్జెట్‌పై చర్చను ప్రారంభించాల్సిందిగా థరూర్ పేరును పిలవగా, ప్రతిపక్ష సభ్యులు తమ పట్టుదలను వీడకుండా, ముందుగా గాంధీని మాట్లాడటానికి అనుమతించాలని డిమాండ్ చేశారు. చర్చ బడ్జెట్‌పై జరుగుతోందని, కాంగ్రెస్ పార్టీ తన ప్రధాన వక్తగా థరూర్ పేరును ఇచ్చిందని తెన్నేటి నొక్కి చెప్పారు. ప్రతిపక్ష నాయకుడిని మాట్లాడటానికి అనుమతించవచ్చా లేదా అనే దానిపై తాను స్పష్టత పొందాల్సి ఉంటుందని ఆయన అన్నారు. బడ్జెట్‌పై మాట్లాడాలనుకుంటున్నారా అని ఆయన గాంధీని కూడా అడిగారు. ఇంతలో, థరూర్ తాను ప్రతిపక్ష నాయకుడికి అవకాశం ఇస్తున్నానని చెప్పారు. ఈ ప్రతిష్టంభన కొనసాగడంతో, తెన్నేటి సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు.

## మోదీకేం సంబంధం?

(మొదటి పేజీ తరువాయి)



రేవంత్ రెడ్డి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సిఎం క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

'రాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి మధ్య త్రిముఖ పోటీ జరుగుతోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న 12 ఏళ్ళ బిజెపి ప్రభుత్వ పాలనను, రాష్ట్రంలో పదేళ్ల బిఆర్ఎస్ దోపిడీని, ప్రస్తుతం అధికారంలో ఉన్న రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమాన్ని బేరీజు వేసుకుని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, భవిష్యత్‌ను ఆలోచించుకుని తీర్పు ఇవ్వాలి'' అని సిఎం రేవంత్ రెడ్డి ఓటర్లకు పిలుపునిచ్చారు. ఈ 12 ఏళ్లలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణకు ఏమైనా ప్రాజెక్టులు మంజూరు చేసిందా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పాలమూరు–రంగారెడ్డిని జాతీయ ప్రాజెక్టుగా చేస్తామని ప్రధాని మోదీయే స్వయంగా ప్రకటించారని, కానీ మోదీ మూడు సార్లు ప్రధాని అయినా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, బిజెపి జాతీయ అధ్యక్షుడు, ఆ పార్టీ నేతలు మోదీని చూసి ఓటేయాలని ఎలా అడుగుతున్నారని నిలదీశారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారానికి వచ్చిన మహారాష్ట్ర సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ సైతం తెలంగాణను అవమానించేలా మాట్లాడి ఓట్లు మాత్రం బిజెపికి వేయాలని అడుగుతున్నారని సిఎం విమర్శించారు. పన్నెండేళ్లుగా కేంద్రంలో మోదీ అధికారంలో ఉండి తెలంగాణకు చేసిందేమిటని సిఎం ప్రశ్నించారు. తెలంగాణ ప్రయోజనాల కోసం మోదీని కలిసి అడుగుతామని, అవసరమైతే కేంద్రంతో కొట్లాడుతామని రేవంత్ రెడ్డి చెప్పారు. వరదల్లో నీటమునిగిన వస్తులన్నీ తిరిగిస్తామని జిహెచ్ఎంసి ఎన్నికల్లో బిజెపి నేత బండి సంజయ్ హామీ ఇచ్చారు. బండి మునిగితే బండి, ఆటో మునిగితే ఆటో ఇస్తామని చెప్పారు. కేంద్రం నుంచి నిధులు తెచ్చి వస్తువులన్నీ తిరిగిస్తామని ప్రకటించారు. బండి సంయ్ హామీలను నమ్మి జిహెచ్ఎంసిలో 50 మంది బిజెపి కార్పొరేటర్లను గెలిపిస్తే ఎన్నికలయ్యాక అడిగితే వస్తువులకు ఇన్సూరెన్స్ ఉంటుందని బండి సంజయ్ మాట మార్చారు. ఇన్సూరెన్స్ డబ్బులు వచ్చేదానికి బండి సంజయ్ రికమండేషన్ ఎందుకో'' అని సిఎం ప్రశ్నించారు. సత్రం భోజనానికి నెల్లూరు పెద్దారెడ్డి సిఫార్సు లేఖ ఇచ్చినట్లు బండి సంజయ్ వ్యవహారం ఉందని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణకు వచ్చిన ఐటిఐఆర్ ప్రాజెక్టును రద్దు చేశారని, హైదరాబాద్‌కు వచ్చిన సెమీ కండక్టర్ ప్రాజెక్టును ప్రధాని మోదీ ఒత్తిడి చేసి ఎపికి తరలించారని, ఇప్పుడు మోదీని చూసి ఓటేయాలని బిజెపి నేతలు అడుగుతుండడం విడ్డూరమని సిఎం అన్నారు.

**బిజెపి నేతల లైఫ్ లైనే ఎంఐఎం**

''బిజెపి నాయకులకు అసదుద్దీన్ ఒవైసీ దేవుడు, వీళ్లంతా పైకి రాముడి పేరు చెబుతారు. కానీ రోజు దండం పెట్టుకునేది మాత్రం ఒవైసీకి. రాముడి పేరు ఎన్ని సార్లు తలుచుకున్నారో తెలియదు. కానీ ఒవైసీ పేరు తలుచుకోకుండా వీళ్లకు రోజు గడవదన్నారు. బిజెపి నేతల 'లైఫ్ లైనే ఎంఐఎం'. అన్ని బిజెపి చేతుల్లో ఉన్నప్పుడు ఒవైసీని ఎందుకు నియంత్రించలేకపోతున్నారు. ఈ దేశంలో మిగతా రాజకీయ పార్టీల మాదిరిగానే ఎంఐఎం కూడా ఓ రాజకీయ సంస్థ. ఇంకెంత కాలం ఎంఐఎం పార్టీని భూతంగా చూపించి ఓట్లు అడుగుతారు'' అని సిఎం రేవంవ రెడ్డి అన్నారు. కేవలం మత విద్వేషాలను రెచ్చగొట్టి, కొంత మంది రాజకీయ నాయకులను భూతంగా చూపిస్తూ రాజకీయ మనుగడ సాగించడం వారి భావదారిద్ర్యానికి పరాకాష్ట అని, ఈ భావదారిద్ర్యాన్ని చూసి బిజెపికి ఓట్లు వేయాలా తెలంగాణ ప్రజలు ఆలోచించుకోవాలని సిఎం అన్నారు.

**ఏ ముఖం పెట్టుకుని బిఆర్ఎస్ మళ్లీ ఓట్లు అడుగుతున్నది?**

''తెలంగాణలో గత పదేళ్లు బిఆర్ఎస్సే అధికారంలో ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు సమస్యల పరిష్కారానికి బిఆర్ఎస్‌కు ఓటు వేయాలని అడుగుతున్నారు సర్పంచ్ నుంచి మున్సిపల్ వరకు పెత్తనం బిఆర్ఎస్‌యే మీరే చెలాయించింది. ఇవాళ సమస్యలకు ప్రధాన కారణం కెసిఆర్, కెటిఆర్, హరీష్ కాదా? ఏ ముఖం పెట్టుకుని ఇపుడు మళ్లీ ఓట్లు అడుగుతున్నారు? అహంకారం, విద్వేష ప్రసంగాలతో గంజాయి, కొకైన్ తీసుకున్న వారిలా మాట్లాడుతున్నారు. దోపిడీకి అలవాటు పడ్డ ఇలాంటి వాళ్లకి ఓటు వేస్తే పరిస్థితి ఏంటి? మూడోసారి మళ్లీ ప్రజలను మోసం చేయాలని ప్రయత్నిస్తున్నారు. బిఆఆర్ఎస్‌ను యాసిడ్ పోసి కడిగితే తప్ప రాష్ట్రానికి పట్టిన పీడ వదలదు. మళ్లీ బిఆర్ఎస్ మొక్కను మొలవనివ్వద్దు'' అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. మీడియా సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

# ఎటు చూసినా కమీషన్లు, కబ్జాలే



## ఎమ్మెల్యే మురళి నాయక్‌పై డా.కె.నారాయణ మండిపాటు

**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** మున్సిపాలిటీ పాలకవర్గం రాకముందే రూ.60 కోట్ల మున్సిపాలిటీ పనులకు శంకుస్థాపనలు చేసి ఎమ్మెల్యే మురళీనాయక్ 5శాతం కమీషన్ తీసుకున్నాడని, కబ్జాలకు తెర లేపి 3 ప్రధానమైన చోట్ల కబ్జా చేసేందుకు పైరవీలు చేస్తున్నాడని, ఇలాంటి మురళి నాయక్‌ను, కాంగ్రెస్ పార్టీని మానుకోట మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించాలని మానుకోట మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ పిలుపునిచ్చారు. సోమవారం మహబూబాబాద్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన 33, 18, 36, 22, 21 వార్డుల్లో సిపిఐ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి సిపిఐ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, ప్రశ్నించే గొంతుక ఉంటే ప్రజా సమస్యల పరిష్కారానికి మేలని అభ్యర్థించారు. మానుకోట మున్సిపాలిటీలో సిపిఐ నేతలను, ప్రశ్నించే గొంతుకలను రాకుండా మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్ కుట్రలు చేశాడన్నాడని, పొత్తులు అంటూ సిపిఐ గొంతు కోశాడని నారాయణ విమర్శించారు. మానుకోట మున్సిపాలిటీ ఎన్నికల్లో ఏడుగురు సిపిఐ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని వారిని గెలిపించి ప్రశ్నించే గొంతుకలను, ప్రజా సమస్యలపై నిత్యం పోరాడేలా మున్సిపాలిటీ పాలకవర్గంలోకి పంపించాలని అభ్యర్థించారు. 33వ వార్డు అభ్యర్థి బి.అజయ్ సారధి రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి మున్సిపాలిటీలో ప్రజాయుద్ధ నౌక, ప్రశ్నించే గొంతుక ఉండేలా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, పంజాల రమేష్, సిపిఐ మున్సిపల్ ఎన్నికల అభ్యర్థులు 33వ వార్డు అభ్యర్థి బి.అజయ్ సారధి రెడ్డి, 36వ వార్డు అభ్యర్థి పెరుగు కుమార్, 18వ వార్డు అభ్యర్థి రేషపల్లి నవీన్, 22వ వార్డు అభ్యర్థిని చింతకుంట్ల శ్రీదేవి వెంకన్న, 21వ వార్డు అభ్యర్థిని ఎండి ఫాతిమా అబ్బాస్, 25వ వార్డు అభ్యర్థిని నర్రా సంధ్యా శ్రావణ్, 23వ వార్డు అభ్యర్థిని నాగేల్లి యాకమ్మ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా గొంతుక సిపిఐకి పట్టం కట్టండి

## సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి.నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ



**ప్రజాపక్షం/అమరచింత :** మున్సిపల్ ఎన్నికల్లో చీకటి ఒప్పందాలు అవకాశావాద నీచ రాజకీయాలకు సమాధి కట్టి ప్రజల కోసం అనేక పోరాటాలు చేసి జనం పక్షాన నిలబడి పోరాడుతున్న సిపిఐ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి.నరసింహ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం ఎన్నికల ప్రచార ముగింపు కార్యక్రమంలో భాగంగా పట్టణంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సిపిఐ అభ్యర్థులుగా రెండవ వార్డు కే.భారతి, నాలుగో వార్డు అజ్జపాగు బాలేశ్వరమ్మ, ఆరోవ వార్డు ఎరకలి భీమన్న, ఎనిమిదవ వార్డు ఎం.డి.కుతూబ్‌లకు మద్దతుగా సిపిఐ శ్రేణులు అమరచింత పట్టణంలో డప్పుల దరువులతో కళాకారుల ఆటపాటలతో ఎర్రజెండాలు చేత పట్టి భారీ ర్యాలీ నిర్వహించి, వీధి సభలు నిర్వహించారు. సిపిఐ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం ఎన్నికల ప్రచార ముగింపు కార్యక్రమంలో భాగంగా పట్టణంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. భారత కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులుగా రెండవ వార్డు కే.భారతి, నాలుగో వార్డు అజ్జపాగు బాలేశ్వరమ్మ, ఆరవ వార్డు ఎరకలి భీమన్న, ఎనిమిదవ వార్డు ఎండి కుతూబ్‌లకు మద్దతుగా సిపిఐ శ్రేణులు అమరచింత పట్టణంలో డప్పుల దరువులతో కళాకారుల ఆటపాటలతో ఎర్రజెండాలు చేత పట్టి భారీ ర్యాలీ నిర్వహించి, వీధి సభలు నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ మాట్లాడుతూ ప్రజల కోసం నిర్బంధాలు ఎదుర్కొని అనునిత్యం ప్రజలలో మమేకమౌతూ ప్రజా సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేస్తున్న సిపిఐ అభ్యర్థులను ప్రజలు ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మాజీ కౌన్సిలర్ కే.విజయరాములు, మండల కార్యదర్శి ఏ.అబ్రహం, పట్టణ కార్యదర్శి రవీందర్, సిపిఐ నాయకులు పి.శ్రీహరి, కలవతమ్మ, నరసింహ శెట్టి, పి.సురేష్, ఆర్.ఎన్.శంకర్, శ్రీరాములు, రమేష్, భాస్కర్, శ్యాంసుందర్, మోష, రఘు, గీతమ్మ, కృష్ణవేణి, సత్యమ్మ, పద్మావతి, శారద, గోవిందమ్మ, కళావతి, శృతి, లక్ష్మీ నారాయణ, ఇజ్రాయేలు, సౌలు, ఎర్రన్న, క్రాంతి, కొంకోని పల్లి వెంకటేశ్, అంజి తదితరులు ఉన్నారు.

# నగర సమగ్రాభివృద్ధికి సిపిఐ అభ్యర్థులను ఆదరించండి



## సిపిఐ కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నగర సమగ్రాభివృద్ధికై సిపిఐ అభ్యర్థులను గెలిపించండని, నగర సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. సోమవారం నగరంలోని 1, 17వ డివిజన్లలో సిపిఐ పార్టీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న గొలుసుల రమేష్, బి.స్వప్నలను గెలిపించాలని రోడ్‌షో ప్రచారం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా డివిజన్లలో కార్నర్ సభలు నిర్వహించామని, ఈ సభలకు సిపిఐ నగర కార్యదర్శి ఓమయ్య అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నగరంలో ప్రజా సమస్యలు పరిష్కారం కావలంటే వార్డులు అభివృద్ధి చెందాలంటే కూడా నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడే సిపిఐ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఒకటో డివిజన్ పరిధిలో వార్డుల అభివృద్ధికి గత కార్పోరేటర్ అభ్యర్థి నిర్లక్ష్యం చేశాడని మారుమూల గ్రామాల్లో కూడా రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధి చెందాయని కానీ నగర కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ అభివృద్ధికి నోచుకోకపోవటం సిగ్గుచేటన్నారు. 17వ డివిజన్ గౌతంనగర్ అభివృద్ధికి సిపిఐ పార్టీ కట్టుబడి ఉందని ప్రజాసమస్యలతో పాటు చదువుకున్న యువకులకు అండగా పార్టీ నిలబడుతుందని హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కంజర భూమయ్య, సుధాకర్, రాజేశ్వర్, ఇమ్రాన్‌అలీ, అనిల్, తిరుపతి, భాగ్యలక్ష్మి, సాయగౌడ్, వెంకటేశ్వర్లు, స్వరూపరాణి, హన్మాండ్లు, రాధకుమార్, గోవర్ధన్, సుజాత నాయకులు పాల్గొన్నారు.

# మార్చి 15 నాటికి సర్వే పూర్తి

## సిఎస్ రామకృష్ణారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియను మార్చి 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ సలహాదారుడు, అగ్రిస్టాక్ చీఫ్ నాలెడ్జ్ ఆఫీసర్ రాజీవ్ చావ్లా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేశ్‌కుమార్, వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ స్పెషల్ సెక్రెటరి రాజీవ్‌గాంధీ హన్మంతు, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్లు, ఎన్ ఐసి అధికారుల సహకారంతో డిజిటల్ క్రాప్ సర్వేను పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రంలో 10, 877 గ్రామాల్లో డిసిఎస్ సర్వే చేపట్టడం జరిగిందని అధికారులు తెలిపారు. సీజినల్ డిజిటల్ క్రాప్ సర్వే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలకు ఉపకరిస్తుందని, అదేవిధంగా స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి(జిఎస్‌డిపి) గణాంకాలకు ఈ సర్వే ఉపయుక్తంగా ఉంటుందని సిఎస్ పేర్కొన్నారు. దేశంలోని యుపి, బీహార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్నాటక, ఒడిశా తదితర రాష్ట్రాల్లో డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ పూర్తైందని కేంద్ర ప్రభుత్వ సలహాదారుడు రాజీవ్ చావ్లా తెలిపారు. రాష్ట్రంలో డిజిటల్ క్రాప్ సర్వేకు సంబంధించి ఇప్పటి వరకు చేపట్టిన వివరాలను వ్యవసాయశాఖ సంచాలకులు గోపి ఉన్నతాధికారులకు వివరించారు.

# లేబర్ కోడ్‌లు తక్షణమే రద్దు చేయాలి

## డిహెచ్‌పిఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్న కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ నెల 12న చేపట్టనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కౌన్సిల్ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆరుట్ల రాజ్‌కుమార్, జేరుపోతుల కుమార్, వై ఉషాశ్రీలతో కలిసి హైదరాబాద్, మఖ్దూం భవన్‌లోని రాజ్‌బహదూర్ గౌర్ విజ్ఞాన కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో మారుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ కార్మిక వర్గ హక్కులను కాపాడే పోరాటంలో దళిత, బలహీన వర్గాల ప్రజలు ఐక్యంగా నిలబడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మికుల ఉద్యోగ భద్రత, వేతన, సంఘటిత హక్కులు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు డిహెచ్‌పిఎస్ కార్యకర్తలు చైతన్య కార్యక్రమాలు, ప్రచార యాత్రలు, సమావేశాలను నిర్వహించి సమ్మెను విజయవంతం చేసేందుకు కృషి చేస్తారన్నారు. కార్మిక వర్గం బలంగా ఉంటేనే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని తెలిపారు. ప్రజాస్వామ్యవాదుల, శ్రామికులు ఈ నెల 12న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొని, కార్మిక వర్గానికి సంఘీభావాన్ని ప్రకటించాలని కోరారు.

# డాక్టర్ పి.సరస్వతికి కన్నీటి వీడ్కోలు



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** డాక్టర్ సరస్వతి 21 సంవత్సరాలుగా సిఆర్ ఫౌండేషన్‌లో ఉంటూ మృతి చెందారని ఆమె పార్థివ దేహన్ని సోమవారం సిఆర్ ఫౌండేషన్ అవరణలో సందర్శనార్థం ఉంచారు. కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ ప్రధానకార్యదర్శి, మాజీ శాసనసభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కంభంపాటి అజయ్ కుమార్, కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, సిఆర్ ఫౌండేషన్ డైరెక్టర్, కోశాధికారి చెన్నకేశవరావు, సిఆర్ పాలిక్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కె.రజనిలు విచ్చేసి డాక్టర్ సరస్వతి పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సిఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ డాక్టర సరస్వతి గత 21 సంవత్సరాలుగా సిర్ ఫౌండేషన్ ఆశ్రమంలోనే ఉంటూ సిఆర్ ఫౌండేషన్ ఆరోగ్య కేంద్రంలో ఆమె కంటి వైద్యురాలిగా 11 సంవత్సరాలుగా ఉచిత సేవలందించారని, ఆశ్రమ సలహామండలి సభ్యురాలిగా ఆశ్రమ అభివృద్ధికి, సిఆర్ ఫౌండేషన్ మహిళా సమాఖ్య, పలు సామాజిక కార్యక్రమాలకు చేపడుతూ ఎన్నో విధాలుగా తోడ్పాటు అందించారని, ఆమె మృతి సిఆర్ ఫౌండేషన్‌కు తీరని లోటు అని సంతాపం వ్యక్తం చేశారు. ఏఐటియూసి మాజీ కార్యదర్శి డా.బి.వి. విజయలక్ష్మి, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోస్యభట్ల కల్పన, సభ్యులు ప్రేమ పావని, పల్లా విజయ, కె.జ్యోత్స్న, డి.కృష్ణకుమారి, డాక్టర్ పి.రాజశ్రీ, వి.లలిత, సీనియర్ జర్నలిస్ట్ ఏబికె ప్రసాద్, మల్లంపాటి వెంకటేశ్వరరావు, హోమ్ కమిటీ సభ్యులు రాజేంద్రరావు, తమ్మారెడ్డి తాన్య, హోమ్ మేనేజర్ శ్రీనివాస్, ఆశ్రమవాసులు, వారి బంధుమిత్రులు తదితరులు నివాళులర్పించారు. తదుపరి ఆమె పార్థివదేహన్ని విద్యార్థుల వైద్య విద్య అవసరాల నిమిత్తం గాంధీ మెడికల్‌కు ఆమె కుమారుడు శ్రీనివాస్‌చే గాంధీ మెడికల్ కాలేజ్ విద్యార్థులు, అనాటమి డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సంగీత, డాక్టర్ వినయ్ సమక్షంలో అప్పగించారు. దివంగత డాక్టర్ సరస్వతి నేత్రాలు ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆసుపత్రి బ్యాంకుకు దానం చేశారు. కార్యక్రమంలో అమ్మ ఐ, బాడీ డొనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ తరపున ఈశ్వర లింగం, ఆర్గనైజేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వెట్టిచాకిరి కొనసాగడం ఆందోళనకరం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బాండెడ్ లేబర్ సిస్టమ్ (రద్దు) చట్టం 1976కి 50 సంవత్సరాలు పూర్తి అయినా వెట్టిచాకిరి వివిధ రూపాల్లో కొనసాగుతుండటం ఆందోళనకరమన్నారు. వెట్టిచాకిరి దినోత్సవం సందర్భంగా తెలంగాణ పోలీస్ అకాడమీలో ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ సంయుక్తంగా వెట్టిచాకిరి అవగాహన పోస్టర్‌తో పాటు సెల్ఫ్ లెర్నింగ్ డిజిటల్ బాండెడ్ లేబర్ ట్రైనింగ్ మాడ్యూల్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్ మాట్లాడుతూ.. బాధితులను గుర్తించి రక్షించడం, చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో పోలీసుల పాత్ర కీలకమని, శిక్షణ అవసరమని పేర్కొన్నారు. ఐజెఎం ప్రతినిధి అభిషేక్ జోషెఫ్ మాట్లాడుతూ.. చట్టం ఉన్నప్పటికీ కార్మికులకు హక్కులు పూర్తిగా అందటం లేదని, వారికి అవగాహన కల్పించేందుకు ఐజెఎం పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్లు డి.మురళీధర్, కవిత, వెంకటేశ్వర్లు, కె.ఆర్.కె.ప్రసాద్, మధుకర్ స్వామి, శ్రీరామమూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్లు ఘంటా వెంకట్రావ్, నాగేశ్వరరావు, నరహరి, రమణ, వి.శ్రీనివాసరావు, డాక్టర్లు ధనజ, రవి కుమార్, వరలక్ష్మి, డిఎస్‌పిలు సతీష్ కుమార్, ఆదూరి శ్రీనివాసరావు, ఎన్. రామారావు, సందీప్ రెడ్డి పాల్గొన్నారు.

# దోపిడీ వర్గాలకు వంతపాడే కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్మికుల హక్కుల రక్షణకు ఈ నెల 12వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని, దోపిడీ వర్గాలకు వంతపాడే కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. సమాజంలోని వ్యాపారులందరూ తమ విక్రయిస్తున్న వస్తువుల ధరలు వారే నిర్ణయిస్తారని, ఇందులో కేంద్ర ప్రభుత్వ ప్రమేయం ఉండబోదని, కానీ సంపద సృష్టికర్తలైన రైతు తాను పండించిన పంటలకు తాను ధర నిర్ణయించలేరని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు తమ శ్రమకు తామే విలువను నిర్ణయించలేరని బోస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దోపిడీదారులైన పారిశ్రామిక వేత్త వారి శ్రమకు విలువను నిర్ణయిస్తారని, ఆ విలువ ప్రకారం కార్మికులు తమ బతుకుదెరువు కోసం పని చేయాల్సి వస్తుందని, దీనిని కూడా ప్రభుత్వం చూసీ చూడనట్టుగానే వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఈనెల 7వ తేదీన యాప్ ఆధారిత కార్మికులు దేశవ్యాపితంగా ఒకరోజు సమ్మె చేపట్టారని, వారిని మోసం చేయడానికి కేంద్రప్రభుత్వం అనేక రకాలుగా మోసపూరిత ప్రకటనలు చేసినప్పటికీ, వారు తమ నిర్ణయాన్ని మార్చుకోలేదన్నారు. వారు మరోసారి 12వ తేదీన జాతీయ సమ్మెలో పాల్గొంటామని ప్రకటించడం కార్మిక వర్గంలో నెలకొన్న పట్టుదల బహిర్గతమవుతుందని వి.ఎస్. బోస్ అన్నారు.

**ప్రజా వ్యతిరేక విధానాల వల్ల అన్ని వర్గాలలో అసంతృప్తి**
**ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్**

కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాల వల్ల అన్ని వర్గాలలో అసంతప్తి జ్వాలలు ఎగిసిపడి, పెట్టుబడిదారి విధానాన్ని బొందపెట్టే రోజులు దగ్గరలో ఉన్నాయని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ హెచ్చరించారు. కార్మిక సంఘాలు అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 ముఖ్యమైన కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మికులను కట్టుబానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్‌లను మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాన్ని వ్యతిరేస్తూ ఫిబ్రవరి 12న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు వామపక్ష పార్టీలు మద్దతు తెలిపినందుకు ధన్యవాదాలు తెలిపారు. దేశంలోని 10 కేంద్ర కార్మిక సంఘాలు, రైతు, సంఘాలు, రాజకీయాలకు అతీతంగా పోరాటాలకు సిద్ధం అవుతున్నారని, అన్ని వామపక్షపార్టీలు కార్మికుల సమ్మెకు ప్రత్యక్షంగా మద్దతు ఇస్తూ, పాల్గొంటున్నారని ఎస్.బాల్‌రాజ్ వెల్లడించారు.

# టిజిఐసిసిసిలో ఎస్‌పిఒల భర్తీకి నోటిఫికేషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టిజిఐసిసిసి)లో తాత్కాలిక ప్రాతిపదికన స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు (డ్రైవర్లు)గా నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 28 ఖాళీలు భర్తీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. ఈ నియామకాలు తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎక్స్ సర్వీస్‌మెన్, మాజీ పారా మిలిటరీ బలగాల సిబ్బంది నుంచి మాత్రమే చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ఆధార్, ఓటర్ ఐడి, డ్రైవింగ్ లైసెన్స్ వంటి నివాస ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలి. దరఖాస్తుదారుల వయస్సు ఈ నెల 28 నాటికి 58 సంవత్సరాలు మించకూడదు. అలాగే సేవ నుంచి గత రెండు సంవత్సరాలలో పదవీ విరమణ చేసినవారు కూడా అర్హులే. ఎంపికైన వారికి నెలకు రూ.26,000 గౌరవ వేతనం చెల్లించనున్నారు. సెలవులు హక్కుగా ఉండవు. అవసరమైతే వేతనం లేకుండా సెలవులు మంజూరు చేస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు టిజిఐసిసిసి రిసెప్షన్ సెంటర్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చు. మరిన్ని వివరాలకు ఆర్‌ఐ ఎ.గోపాల్ రెడ్డి మొబైల్: 8712674111ను సంప్రదించవచ్చు.

# భారతదేశ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసే విధంగా మోదీ ప్రభుత్వం

## సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నకు తలొగ్గి, భారతదేశ సార్వభౌమాధికారాన్ని దెబ్బతిసే విధంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవర్తిస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. అమెరికాతో జరిగిన వాణిజ్య ఒప్పంద వివరాలను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని, వాటిపైన చర్చించి, ఆమోదించిన తర్వాతనే ఆ అప్పంద పత్రాలపైన సంతకాలు చేయాలని, అప్పటి వరకు ఒప్పందాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఒప్పందం విషయంలో అమెరికాకు తలొగ్గి మోదీ ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తే పర్యవసనాలు ప్రమాదకరంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. అమెరికాకు కేంద్ర ప్రభుత్వం గుడ్డిగా లొంగిపోయిందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమెరికాతో చేసుకున్న వాణిజ్య ఒప్పందం ఫలితంగా రైతులు, కార్మికులు, ప్రజలు తీవ్రమైన నష్టానికి గురయ్యే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో పత్తి, సోయాబిన్, ఆహార ధాన్యాలు పండించిన రైతులు దెబ్బతినే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. జిరో టారీఫ్‌తో దిగుమతులు చేస్తే లక్షలాది ఎకరాలలో పంటలు పండించే రైతులు ఇబ్బందికి గురవుతారని, దేశ వ్యాప్తంగా దీనిని రైతు సంఘాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. వాణిజ్య ఒప్పందంపైన ఆర్థిక వేత్తలు చర్చిస్తున్నారని, మరోవైపు కేంద్ర ప్రభుత్వం మాత్రం గుడ్డిగా, సార్వభౌమత్వాన్ని దెబ్బతిసే పద్ధతిలో ఒప్పందం చేసుకున్నదని దుయ్యబట్టారు. గతంలో నుంచి కూడా తక్కువ ధరకే రష్యా నుంచి క్రూడ్ ఆయిల్ కొనుగోలు చేస్తున్నామని, దీనిపైన అమెరికా ఆంక్షలు విధించిందని, దీనిని ఉల్లంఘిస్తూ మరోసారి రష్యాతో కొనుగోలు చేస్తే మళ్లీ టారీఫ్‌లు పెంచుతామని, అమెరికానే మానిటరింగ్ చేస్తుందని వివరించారు. సార్వభౌమాధికారాన్ని విచ్ఛిన్నం చేసే పద్ధతిలో ఉన్న ఒప్పంద వివరాలను పార్లమెంట్ ముందు పొందుపర్చాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

# ఎనిమిదేళ్ల చిన్నారిపై అత్యాచారం

## భూపాలపల్లిలో అమానవీయ సంఘటన

**ప్రజాపక్షం/భూపాలపల్లి/రేగొండ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా, రేగొండ మండలం పొనగండ్ల గ్రామంలో అమానవీయ ఘటన వెలుగుచూసింది. తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లిన వేళ.. ఓ చిన్నారిపై కామాంధులు అత్యాచారం చేశారు. ఆదివారం కావడంతో ఇంట్లోనే ఉన్న ఎనిమిదేళ్ల బాలికను అదను చూసి అపహరించుకుపోయి, తమ పైశాచికత్వాన్ని ప్రదర్శించారు. చిలుకూరి శ్రీకాంత్ అనే యువకుడు, మరో వ్యక్తితో కలిసి మద్యం మత్తులో చిన్నారిని ఎత్తుకెళ్లి అత్యాచారానికి ఒడిగట్టారు. అఘాయిత్యం చేసిన అనంతరం, ఏమీ ఎరుగనట్టుగా చిన్నారిని తీసుకువచ్చి ఆమె ఇంట్లోనే పడేసి వెళ్లడం వారి తెగింపునకు నిదర్శనం. యువకుల దాష్టీకంతో చిన్నారి పరిస్థితి ప్రస్తుతం అత్యంత విషమంగా ఉంది. బాధితురాలిని చికిత్స నిమిత్తం భూపాలపల్లి జిల్లాలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు ఈ ఘటనపై పోక్సో (పిఓసిఐఎస్‌ఓ) చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే, నిందితుల్లో ఒకరైన శ్రీకాంత్‌తో పాటు గతంలోనూ ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, బాధితురాలి కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబం అది. తల్లిదండ్రులు పొట్టకూటి కోసం పనికి వెళ్తే, నమ్మకంగా ఉండాల్సిన ఊరిలోనే ఇలాంటి మృగాళ్లు తిరగడం భయాందోళనకు గురిచేస్తోంది. మద్యం మత్తులో పసిమొగ్గను నలిపేసిన ఈ మృగాలను వెంటనే కఠినంగా శిక్షించాలని గ్రామస్థులు కోరుకుంటున్నారు.

**బాధిత కుటుంబసభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే జీఎస్ఆర్**

చిన్నారిపై జరిగిన అత్యాచార ఘటన దిగ్భ్రాంతికి గురి చేసిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభు త్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని మరియు వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ఓదార్చారు. ఘటనపై వరంగల్ ఎంపి డా.కడియం కావ్య తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన అత్యంత దారుణమని పేర్కొన్న ఎంపి, చిన్నారిపై అమానుష ఘటనకు పాల్పడిన శ్రీకాంత్, గణేష్‌లకు చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని పోలీసు అధికారులను కోరారు. కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో విచారించి త్వరితగతిన న్యాయం చేయాలని సూచించారు. బాధిత చిన్నారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఫోన్ ద్వారా వైద్యులను అడిగి తెలుసుకున్న ఎంపి మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు.



**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు
NIT No. 07/EE-II/Cir.43/SBZ/GHMC/2025-26, తేది: 07.02.2026
**పని పేరు:** జిహెచ్ఎంసి, ఎస్‌బిజెడ్, తార్నాక, డివిజన్-43లోని అన్ని వార్డులలో, జనవరి 2026 నుండి డిసెంబర్ 2026 వరకు గల వార్షిక కాలానికి వర్షపు నీటి కాలువలు / నాలాల పూడికతీత పనులు. (2026 సంవత్సరం కోసం). **అంచనా విలువ / ఇసివి:** రూ.36.00లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 09.02.2026న మ.1.00గం.ల నుండి 12.02.2026న మ.1.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక, జిహెచ్ఎంసి, సికింద్రాబాద్ జోన్, సెల్ నెం. 9704405076. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-43, తార్నాక, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 15134-PP/CL/ADVT/1/2025-26, Date: 09-02-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: ఎల్.బి.నగర్ సర్కిల్-13**
షార్ట్ టెండర్ నోటీసు
NIT No. 36/EEC-13/LBNR/GHMC/2025-26, తేది: 09.02.2026
**పని పేరు:** నిర్వహణ పనులు - 01 నెం.లు. **అంచనా విలువ :** రూ.13.50లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 10.02.2026న మ.03.00గం.ల నుండి 13.02.2026న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ వి.కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బినగర్ సర్కిల్-13, జిహెచ్ఎంసి. సెల్ నెం. 9701365519. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్.బి.నగర్ సర్కిల్-13, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 15164-PP/CL/ADVT/1/2025-26, Date: 09-02-2026

**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ**
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.
HMDA Act. 2008లోని సెక్షన్ 15 (4) ప్రకారం బహిరంగ ప్రకటన
(G.O.Ms.No.25 MA&UD Dept., తేది: 28.01.2026)
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం, 2008 (చట్టం నెం. 8 ఆఫ్ 2008)లోని సెక్షన్ 15లోని సబ్-సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలను ఉపయోగించి, ప్రభుత్వం G.O.Ms.No.538, MA&UD తేది:29-10-2001 ద్వారా ఆమోదించబడిన, నోటిఫై చేయబడిన సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ (CDA) మాస్టర్ ప్లాన్‌లో నిర్దేశించిన భూ వినియోగానికి ఈ క్రింది మార్పును చేస్తుంది.
**G.O.Ms.No.538, MA&UD తేది:29-10-2001 ద్వారా ప్రభుత్వం ఆమోదించిన, నోటిఫై చేయబడిన సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ (CDA) మాస్టర్ ప్లాన్ ప్రకారం, గచ్చిబౌలి (గ్రామం), శేరిలింగంపల్లి (మండలం), రంగారెడ్డి (జిల్లా)లోని సర్వే నెం. 136/పి గుండా వెళ్ళే, శిల్పా లేఅవుట్‌ను గచ్చిబౌలి, మియాపూర్ రోడ్డుకు కలిపే సుమారు 1.5 కి.మీ. పొడవు గల ప్రతిపాదిత 36 మీటర్ల వెడల్పు గల మాస్టర్ ప్లాన్ రోడ్డును తొలగించడం.**
పై వివరాలు http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నాయి.
సం/-
చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (RR)
DIPR R.O. No. : 15175-PP/CL/ADVT/1/2025-26, Date: 09-02-2026

## నేటితో ముగియనున్న జిహెచ్ఎంసి పాలకమండలి గడువు




రేపటి నుంచి స్పెషల్ ఆఫీసర్ పాలన
మూడు కార్పొరేషన్లుగా
జిహెచ్ఎంసి విభజనకు రంగం సిద్ధం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) పాలకమండలి ఐదేళ్ల పదవీకాలం నేటితో ముగియనుంది. 2021 ఫిబ్రవరి 11న ప్రమాణ స్వీకారం చేసిన కార్పొరేటర్ల పదవీకాలం పూర్తి కావడంతో, బుధవారం నుంచి జిహెచ్ఎంసిలో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం కానుంది. పాలకమండలి గడువు ముగియడంతో, నగర పరిపాలనలో ఎలాంటి అంతరాయం లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలనా నిర్ణయాలు తీసుకునేందుకు ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్‌ను నియమించనుంది. ఈమేరకు మంగళవారం రాత్రి వరకు ప్రభుత్వ ఉత్తర్వులు(జిఓ) వెలువడే అవకాశముందని అధికారులు వెల్లడించారు. మూడు కార్పొరేషన్‌లకు స్పెషల్ ఆఫీసర్‌గా స్పెషల్ చీఫ్‌సెక్రటరీ జయేశ్ రంజన్‌ను ప్రభుత్వం నియమించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఇదే సమయంలో జిహెచ్ఎంసిని మూడు వేర్వేరు మున్సిపల్ కార్పొరేషన్లుగా (జిహెచ్ఎంసి, సైబరాబాద్, మల్కాజిగిరి).
విభజించే అంశంపై కూడా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు జిహెచ్ఎంసి వర్గాలు భావిస్తున్నాయి. విభజన జరిగితే పరిపాలన మరింత వికేంద్రీకృతమై, వేగవంతమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. కమిషనర్లు, ప్రత్యేకాధికారుల నియామకాలు.

**విభజనకు గ్రీన్ సిగ్నల్ లభిస్తే..**

జిహెచ్ఎంసి కమిషనర్‌గా ప్రస్తుత కమిషనర్ ఆర్.వి. కర్ణన్ కొనసాగనున్నారు.
సైబరాబాద్ కమిషనర్‌గా అడిషనల్ కమిషనర్ సృజన.
మల్కాజిగిరి కమిషనర్‌గా వినయ్ కృష్ణారెడ్డిని నియమించే అవకాశం ఉంది.

**పదేళ్ల తర్వాత ప్రత్యేకాధికారుల పాలన..**

ఈ నెల 11 నుంచి జిహెచ్ఎంసిలో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం కానుంది. దాదాపు పదేళ్ల తర్వాత మళ్లీ ఈ విధమైన పరిపాలన అమల్లోకి రానుంది. గతంలో 2009 నుంచి 2014 మార్చి వరకు పాలకమండలి ఉండగా, ఆ తర్వాత 2016 ఫిబ్రవరి 11 వరకు ప్రత్యేకాధికారుల పాలన కొనసాగింది. అనంతరం గత పదేళ్లుగా ఒక్కరోజు కూడా ప్రత్యేకాధికారి పాలన లేదు.

**ఎన్నికలపై ప్రభుత్వ నిర్ణయం..**

బుధవారం నుంచి తదుపరి మునిసిపల్ ఎన్నికలు జరిగే వరకు స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగనుంది. రాబోయే మునిసిపల్ ఎన్నికల ఫలితాలు, రాజకీయ పరిస్థితులను బట్టి జిహెచ్ఎంసి ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా

పార్టీ నేతలందరూ సమన్వయంతో పని చేయాలి
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ నేతలందరూ సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రతి ఓటరూ పోలింగ్ కేంద్రానికి వచ్చేలా చూడాలని సూచించారు. ఎన్నికల ప్రచారం ముగిసిన నేపథ్యంలో మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో బుధవారం అనుసరించే పోలింగ్ వ్యూహంపై కాంగ్రెస్ ముఖ్యనేతలు, మంత్రులతో సిఎం సోమవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్క ఓటు చాలా ముఖ్యమనీ, ఈ విషయంపై పార్టీ నేతలు ప్రత్యేక దృష్టి సారించాలని, నేడు, రేపు ఓటర్లకు నేతలు అందుబాటులో ఉండాలని దిశానిర్దేశం చేశారు. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా పార్టీ స్థితిగతులపై రేవంత్ రెడ్డి ఆరా తీశారు. బలహీనంగా ఉన్న మున్సిపాలిటీల్లో పోలింగ్ వ్యూహంపై చర్చించి పార్టీ నేతలకు కీలక ఆదేశాలు ఇచ్చారు. స్థానిక నేతల నేతృత్వంలో పోల్ మేనేజ్‌మెంట్ జరిగేలా చూడాలని మంత్రులను సూచించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, డిసిసి అధ్యక్షులు పాల్గొన్నారు.

## ఈ నెలాఖరు నుంచి ఎండల తీవ్రత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా గత నాలుగు నుంచి ఐదు రోజులుగా వాతావరణ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఉదయం, రాత్రి వేళల్లో చలి కొనసాగుతుండగా, మధ్యాహ్నం సమయానికి ఉక్కపోత మొదలవుతోంది. సాయంత్రానికి చల్లని గాలులు వీస్తున్నప్పటికీ, రాత్రి మాత్రం చలిగానే ఉంటోంది. ఇదే తరహా వాతావరణ పరిస్థితులు మరో నాలుగు నుంచి ఐదు రోజుల పాటు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. అయితే ఈ నెలాఖరు నుంచి రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరిగే అవకాశాలున్నాయని హెచ్చరించారు. ముఖ్యంగా పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగి, వేసవి ప్రభావం స్పష్టంగా కనిపించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయితో పోలిస్తే 1 నుంచి 2.5 డిగ్రీల సెల్సియస్ వరకు తక్కువగా ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలోనే ఉన్నప్పటికీ, నెలాఖరు నుంచి వేగంగా మారే అవకాశముందన్నారు. ఈ నెల చివరి వారంలో ఒకటి రెండు రోజులు ఉష్ణోగ్రతలు పెరిగి, ఆ తర్వాత రెండు రోజులు కొంత తగ్గే అవకాశం ఉందన్నారు. అనంతరం క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగుతూ, వేసవి ప్రభావం పూర్తిస్థాయిలో కనిపించే అవకాశముందని అధికారుల అంచనాగా ఉంది. గత ఏడాదితో పోలిస్తే ఈసారి కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఎక్కువ రోజుల పాటు నమోదు అవుతాయని అధికారులు వెల్లడించారు.

## మత్స్యశాఖ మరింత బలోపేతం

రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మత్స్యశాఖను మరింత బలోపేతం చేసే దిశగా పని చేయాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి సూచించారు. చేపలు, రొయ్యల పెంపకం, అమ్మకాల ద్వారా చాలా మంది ఉపాధి పొందుతున్నారన్నారు. హైదరాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో మత్స్య శాఖ అధికారులతో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సోమవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు గోపాల్ రెడ్డి, భవానీరెడ్డి, భూమి సునీల్, మత్స్య శాఖ డైరక్టర్ నిఖిల, జాయింట్ డైరెక్టర్ మురళి కృష్ణా, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్,కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా మత్స్యశాఖ పనితీరు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, భవిష్యత్ ప్రణాళిక తదితర అంశాలపైన చర్చించారు. ఈ సందర్భంగా నిఖిల మత్స్య శాఖ పనితీరును, అమలు చేస్తున్న పథకాలను కమిషన్ చైర్మన్‌కు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఫిష్ స్టాల్స్ వాహనాలను అందజేశామని, ఈ సారి చేప పిల్లలు, రొయ్యల సీడ్ చెరువుల్లో వేసే సమయంలో జాగ్రత్తలు తీసుకున్నామని వివరించారు. గతంలో అక్రమాలు జరిగిన విషయమై విజిలెన్సు విచారణ చేపట్టామని, ఈ సారి పూర్తి స్థాయి నిఘాలో చెరువులల్లో చేప పిల్లలను వేశామన్నారు. అనంతరం కోదండరెడ్డి మాట్లాడుతూ రాంనగర్‌లోని చేపల మార్కెట్‌ను అజామాబాద్‌కు తరలించాలని,తద్వారా ట్రాఫిక్ సమస్యలు ఉండబోవని, వ్యాపారం మరింత పెరిగే అవకాశం ఉంటుందని సూచించారు. గతంలో తాను ఎంఎల్‌ఏగా ఉన్న సమయంలో చేపల మార్కెట్‌ను తరలించేందుకు ప్రయత్నించిన విషయాన్ని కోదండరెడ్డి గుర్తు చేశారు గతంలో చేప పిల్లల సీడ్ ఎక్కువగా ఆంధ్ర నుండి వచ్చేదన్నారు. కల్తీ లేని ఆహారం చేపలు అని కోదండరెడ్డి తెలిపారు.



## కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై సవతి ప్రేమ

ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ నాల్గవ తరగతి ఉద్యోగులకు జిఒ నంబర్ 60 ప్రకారం రూ15,600ల వేతనాలకు బదులగా కేవలం రూ.10వేలను మాత్రమే చెల్లించడం అన్యామమని ఎఐటియుసి రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ విమర్శించారు. ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో కోఠిలోని ఎన్‌హెచ్‌ఎం డైరెక్టర్ కార్యాలయం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రతినిధి బృందం కమిషనర్ సర్వే సంగీత సత్యనారాయణకు వినతి పత్రాన్ని సమర్పించగా, ఆమె స్పందిస్తూ 15రోజుల లోపు వేతనాలు వస్తాయని హామీనిచ్చారు. దీంతో కాంట్రాక్ట్ సిబ్బంది ధర్నాను విరమించారు. అంతకుముందు నరసింహ మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ద్వారా రాష్ట్రంలో దాదాపు 800 మంది నాల్గవ తరగతి సిబ్బంది పనిచేస్తున్నారని, వారికి కనీస వేతనాల చట్టం ప్రకారం వేతనాలను అమలుచేయాలని డిమాండ్‌చేశారు. పెండింగ్‌లో ఉన్న నవంబర్, డిసెంబర్, జనవరి వేతనాలను తక్షణమే చెల్లించాలన్నారు. ఎన్‌హెచ్‌ఎంలో అధికారులు ఈ సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నారన్నారు. కొంత మందికి మాత్రం రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా జీతాలను చెల్లిస్తూ, కింది స్థాయి ఉద్యోగుల పొట్ట కొడుతూ, శ్రమదోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ ధర్నాలో జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా, జనగాం జిల్లా అధ్యక్షురాలు గంగరబోయిన జ్యోతి, యూనియన్ నాయకులు దాడి మాధవరావు, జ్యోతి, లక్ష్మి దేవమ్మ, నాగమణి, మంగమ్మ, శైలజ, షాముల్, శ్రీనివాస్, కృష్ణ, వెంకటయ్య, పరశురాం, సాయిబాబా, రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో సంచరిస్తున్న పులి..

ప్రజలకు ఎలాంటి ప్రమాదం లేదు : అటవీ శాఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో సంచరిస్తున్న పులి విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అటవీ శాఖ నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తోందని అధికారులు తెలిపారు. పిసిసిఎఫ్ డా.సువర్ణ అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం అనంతరం, చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో నిపుణుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పులి ప్రస్తుత కదలికలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రాబోయేరోజుల్లో చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు.

**ఆరేపల్లి పరిసరాల్లో పులి సంచారం..**

ఈ నెల 8 నాటికి సిద్ధిపేట జిల్లా ఆరేపల్లి గ్రామం పరిసర ప్రాంతాల్లో పులి ఉన్నట్లు అటవీ శాఖ బృందాలు నిర్ధారించాయి. ట్రాకింగ్ ఆధారంగా పులి ఉత్తర దిశగా కదులుతున్నట్లు వెల్లడించారు. ఫిబ్రవరి 6, 7 తేదీల్లో పులి అడుగుజాడలు కనిపించడంతో పాటు, కొన్ని ప్రాంతాల్లో ప్రత్యక్షంగా కనిపించినట్లు అధికారులు తెలిపారు.

**గ్రామాల్లో నిఘా పెంపు..**

ప్రజలకూ, పులికీ ఎలాంటి హాని కలగకుండా సిద్ధిపేట, జనగాం, కరీంనగర్, యాదాద్రి జిల్లాల్లో ప్రత్యేక పట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు అటవీ శాఖ ప్రకటించింది. ఈ బృందాలు గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ, పులి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నాయి. పుణె నుంచి వచ్చిన టైగర్ రెస్క్యూ నిపుణులు పరిస్థితిని పర్యవేక్షిస్తుండగా, స్థానిక వెటర్నరీ డాక్టర్లు సహకారం అందిస్తున్నారు. అవసరమైతే ఎన్టీసీఏ నిబంధనల ప్రకారం పులిని పట్టుకునే చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. పులి వేట చేసిన ప్రాంతాల వద్ద ప్రజలు గుమిగూడకుండా పోలీసులు అదుపు చర్యలు చేపడుతున్నారు. సోషల్ మీడియాలో పుకార్లు వ్యాపించకుండా ఉండేందుకు అటవీ శాఖ ప్రతిరోజూ అధికారిక సమాచారం విడుదల చేయనుంది.

## ఆర్‌టిసి టికెట్ల ద్వారా సైబర్ మోసాల పట్ల అవగాహన



ఎండి నాగిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రోజురోజుకు పెచ్చురిల్లి పోతున్న సైబర్ మోసాల పట్ల అవగాహన కల్పించేందుకు ఆర్‌టిసి 'టికెట్'ను అస్త్రంగా వినియోగించుకోనున్నారు. సైబర్ నేరగాళ్లు కెవైసీలతోనే మోసాలకు పాల్పడుతుండడంతో టికెట్ల వెనుక జాగ్రత్తలు ముద్రించి ప్రజలకు ప్రయాణమే కాదు.. ఆర్థిక నేరాల పట్ల అవగాహణ కల్పించాలని నిర్ణయించారు. కెవైసి పేరిట జరుగుతున్న మోసాలకు చెక్ పెట్టేందుకు ఆర్‌టిసితో ఆర్‌బిఐ చేతులు కలిపింది. ఇందుకు సంబంధించి హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో ఆర్‌టిసి ఎండి వై. నాగిరెడ్డి ఆర్‌బిఐ అధికారులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి మాట్లాడుతూ రోజుకు 60 లక్షల మంది చేతులు మారే ఈ చిన్ని టికెట్ ముక్కనే.. సైబర్ నేరగాళ్లకు కళ్లెం వేయనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో 1.4 కోట్ల మందికి అవగాహన కల్పించున్నామని చెప్పారు. ఆర్‌బిఐ నిబంధనలకు అనుగుణంగా ఖాతాదారులలో ప్రతి ఒక్కరూ అప్డేట్ చేసుకోవడం ఎంతో అవసరమని, లావాదేవీలు ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగుతాయనే విషయాన్ని ఉద్యోగులు మరవకూడదన్నారు.కెవైసి ప్రాధాన్యతను ఆర్‌బిఐ అధికారులు వివరిస్తూ ఆన్‌లైన్, ఎటిఎం, బ్యాంక్ బిజినెస్ కరెస్పాండెంట్, బ్యాంకు శాఖ ద్వారా కెవైసీ అప్డేట్ చేసుకోవచ్చని ఇందుకు ఆధార్, ఓటర్ ఐడీ, డ్రైవింగ్ లైసెన్స్ వంటి చెల్లుబాటు అయ్యే డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్, ఈ నెల9 వ తేదీన నుంచి 13వ తేదీ వరకు కెవైసి– సురక్షిత బ్యాంకింగ్ కు మీ తొలి అడుగు' అనే థీమ్తో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు2026ను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కెవైసి, సెంట్రల్ కెవైసి రిజిస్ట్రీ సికెవైసిపై ప్రజల్లో అవగాహన పెంచడం, అలాగే ఖాతాల నిర్వహణలో క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం, కెవైసికి సంబంధించిన మోసాలు, మనీ మ్యూల్ కార్యకలాపాల పట్ల అప్రమత్తత వంటి అంశాలపై ప్రజలను చైతన్యవంతులను చేయడం ఆర్‌బిఐ లక్ష్యమన్నారు. ఇందులో భాగంగా బస్సు టిక్కెట్ల వెనుక భాగంలో ఎఫ్ఎల్‌డబ్ల్యూ థీమ్ సందేశాలను ముద్రించడం ద్వారా రోజుకు సుమారు 20 లక్షల మంది ప్రయాణికులకు, వారం పాటు మొత్తం సుమారు 1.4 కోట్ల మందికి ఈ సందేశం చేరుతోంది. అదనంగా, సుమారు 120 ఆర్‌టిసి బస్సుల వెనుక భాగంలో (ఫైనాన్షియల్ లిటరసి వీక్) థీమ్ పోస్టర్లను ప్రదర్శించడం ద్వారా విస్తృత ప్రచారంద్వారా అవగాహన కల్పించనున్నామని ఆర్‌బిఐ అధికారులు వెల్లడించారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆర్‌బిఐ జనరల్ మేనేజర్ ముత్యాల జ్ఞాన సుప్రభాత్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు యశ్వంత్ సాయి చిట్టెంశెట్టి, రాములు సభావత్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులకు పింఛన్ కోసం పిటిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న వాళ్లకు పింఛన్, ఇంటి స్థలం ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. తెలంగాణ ఉద్యమకారులకు ఇంటిస్థలం, పింఛను ఇవ్వాలనే వ్యాజ్యంపై తదుపరి విచారణను ఈ నెల 23కి వాయిదా వేసింది. అధికారంలోకి వస్తే తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు ఇంటిస్థలం, పింఛను ఇస్తామన్న ఎన్నికల హామీ మేరకు కలెక్టర్ స్వీకరించిన వినతిపత్రాలపై చర్యలు తీసుకోలేదంటూ జి.నాగరాజు, కె.యాదగిరి మరో ఏడుగురు వేసిన పిటిషన్లను జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారించారు. పిటిషనర్లు తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ఎంతో నష్టపోయారని, కేసుల వల్ల ఉద్యోగాలకు కూడా దూరమయ్యారని పిటిషనర్ లాయర్ చెప్పారు. కేసుల కారణంగా ఉద్యోగాలను కూడా పొందలేకపోయారని, కేసుల కారణంగా కోర్టులకు వెళుతూ ఉద్యోగాలకు అర్హత కోల్పోయి నిరుద్యోగులుగా మిగిలారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 250 గజాల ఇంటి స్థలం, పింఛను ఇస్తామని హామీ అమలు జరిగేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వాదనలపై న్యాయమూర్తి కల్పించుకుని, ఒక పార్టీ ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. ఎన్నికల హామీలపై ఆధారపడి పిటిషన్ ఎలా వేస్తారని, జీవో అనేది విధానపరమైనదని, జీవో లేకుండా పథకాలు అమలు చేయాలని పిటిషన్ వేసేందుకు వీల్లేదని చెప్పారు. ఎన్నికల హామీని ఇంకా నమ్ముతున్నారా, ఇంటి స్థలం, పింఛన్ ఇస్తామనే ఎన్నికల హామీ అమలుకు ఉత్తర్వులు జారీ చేయబోమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమిస్తే దేశ సమరయోధుల తరహాలో స్థలాలు ఇవ్వాలని కోరడం ఏమిటని ప్రశ్నించారు. వేలకు వేల మంది తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారని, అలాంటి వాళ్లదందరికీ 250 గజాల స్థలం ఇవ్వడం సాధ్యం కాదన్నారు. దీనిపై న్యాయవాది కల్పించుకుని, ప్రభుత్వం ఇప్పటికే యాదగిరి మరొకరికి ఇంటి జాగా ఇచ్చిందన్నారు. దీని జీవోలు బయటకు రాలేదన్నారు. ప్రభుత్వ వివరణ కోసం విచారణ 23కు వాయిదా పడింది.

## కర్ల రాజేశ్‌ది ముమ్మాటికి లాకప్ డెత్తే

మంద కృష్ణ మాదిగ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కర్ల రాజేశ్‌ది ముమ్మాటికి లాకప్ డెత్ అని, ఆయన శవానికి రీ పోస్ట్‌మార్టం చేయాల్సిందేనన ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. అప్పటీ వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంద కృష్ణమాదిగా మాట్లాడుతూ కర్ల రాజేశ్‌ను కోదాడ పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి చిత్ర హింసలకు గురి చేయడం వల్లే ఆయన మరణించడం ముమ్మాటికి నిజమని ఆయన స్పష్టం చేశారు. ఫోరెనిక్స్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్) రిపోర్టు రాకపముందే కర్ర రాజేశ్ గుండెపోటుతో మరణించారని పోలీసులు ఏలా చెబుతారని ఆయన ప్రశ్నించారు. తమకు ఈ పోస్టుమార్టంపై అనేక అనుమానాలు ఉన్నాయని నిజ నిజాలను నిగ్గు తెల్చేందుకు రీ పోస్టుమార్టం చేయాల్సిందేనని స్పష్టంచేశారు. నీటి పారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోదాడ ఎంఎల్‌ఏ పద్మావతి కర్ల రాజేశ్ రీపోస్టుమార్టాన్ని అడ్డుకుంటున్నారని మంద కృష్ణ మాదిగ ఆరోపించారు.

**లాకప్ డెత్‌పై సిఎం రేవంత్‌రెడ్డి స్పందించాలి**

కర్ల రాజేశ్ లాకప్ డెత్ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించాలని మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. లాకప్‌డెత్ ఘటనను నిరసిస్తూ ఈనెల 27న కోదాడలో ప్రజా ఆగ్రహ సభను నిర్వహించనున్నామని ఈ సభకు ప్రతిపక్ష పార్టీలు నాయకులను ఆహ్వానించనున్నామని చెప్పారు. అంతకు ముందు హైదరాబాద్‌లో లాకప్ డెత్‌పై ఎంఆర్‌పిఎస్ నిజాలు పోలీసుల అబద్దాలు అనే అంశంపై త్వరలో రౌండ్ టేండ్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

## సాహిత్యంతోనే సమాజ అస్తిత్వం

విద్యార్థులు అన్ని రకాల సాహిత్యాన్నీ చదవాలి..
ఏదీ నిషిద్ధం కాకూడదు
విశ్వజనీన అంశాలపై పరిశోధకులు దృష్టి సారించాలి
2వ తెలుగు సాహిత్య మహాసభలో ఎంఎల్‌సి దేశపతి శ్రీనివాస్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యార్థులు అన్ని రకాల సాహిత్యాన్నీ చదవాలని, ఏదీ నిషిద్ధం కాకూడదని, గత కాలపు సాహిత్య పరిణామాలను అధ్యయనం చేయాలని కవి, రచయిత ఎంఎల్‌సి దేశపతి శ్రీనివాస్ సూచించారు. విశ్వజనీన అంశాలపై దృష్టి సారించడంతో పాటు సమాజంలో విచ్ఛిన్నం అవుతున్న పరిస్థితులను సాహిత్యకారులు అన్వేషించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలుగు శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆర్ట్స్ కాలేజీ వేదికగా 2వ తెలుగు సాహిత్య మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ సాహిత్యం లేకపోతే మనిషి మానవీయ గుణాల నుంచి దూరమవుతాడని అన్నారు. చరిత్ర, సామాజిక శాస్త్రాలు స్థల కాలాలను రికార్డు చేస్తాయి కానీ, అస్తిత్వం, సంస్కృతి, భావోద్వేగాలను ప్రోత్సహించేది సాహిత్యమే అని వివరించారు. సాహిత్యం చాలా పవర్ ఫుల్ అని, అందె శ్రీ, గద్దర్ లాంటి వారిని గుర్తు చేస్తూ తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి కి వారి సాహిత్యమే ఉపయోగపడిందన్నారు. తెలంగాణ లిటరరీ కాంగ్రెస్ సమాజ మూలాలను కనుగొంటూ, కొత్త దృష్టికి వేదికగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మొలుగారం కుమార్ మాట్లాడుతూ తెలుగు కేవలం సంభాషణ భాష మాత్రమే కాదు, అది ఒక సంస్కృతి, జీవన శైలి అని అన్నారు. టెక్నాలజీని వినియోగించి తెలుగు భాష అభివృద్ధికి కృషి చేయవచ్చని తెలిపారు. తెలుగు లిటరరీ కాంగ్రెస్ డైరెక్టర్, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతకింది కాశీం మాట్లాడుతూ సైన్స్ కాంగ్రెస్, హిస్టరీ కాంగ్రెస్ జరిగినట్లే తెలుగు లిటరరీ కాంగ్రెస్ కూడా జరపాలనే ఉద్దేశంతో ఈ మహాసభను ప్రారంభించామని చెప్పారు. ప్రైమరీ స్కూల్ టీచర్ల నుంచి యూనివర్సిటీ ప్రొఫెసర్ల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. క్రియేటివ్ రైటింగ్, రాయడం, చదవడం వంటి అంశాలను సిలబస్‌లో చేర్చామని, విద్యార్థులను ఆ దిశగా తీసుకెళ్లాలని అన్నారు. డిగ్రీ విద్యార్థులకు తెలుగు సిలబస్‌ను మూడు సంవత్సరాలు పెట్టాలని, అలా చేస్తే వచ్చే ఫలితాలను వివరించారు. తెలుగు యూనివర్సిటీ విసి, ప్రొఫెసర్ వెల్దండ నిత్యానంద రావు మాట్లాడుతూ అతి నాగరికతతోపాటు, నేటి వైజ్ఞానికత దేశాన్ని ధ్వంసం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి సమాజంలో తరాలమధ్య అంతరాలహా కొనసాగుతూ సంఘర్షణ వాతావరణం ఉందన్నారు. తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్, ప్రొఫెసర్ లావణ్య మాట్లాడుతూ గతంలో ఇజాలకు ఎక్కువ స్థానం ఉండేదని, ఇప్పుడు స్వతంత్ర వ్యక్తీకరణకు చోటు దక్కుతోందని తెలిపారు. గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ చైర్మన్ కల్వల విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ అమెరికాకో కూడా తెలుగు భాషను కాపాడుకుంటూ, 40 దేశాల్లో భాషను విస్తరించేందుకు కమిటీ వేశామన్నారు. తెలుగు సంపద సలహాదారు, డాక్టర్ రేమిళ్ల మూర్తి మాట్లాడుతూ భాషా సాహిత్యం విస్తరణకు తాము కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఓయు తెలుగు శాఖ అధ్యక్షులు, తెలుగు లిటరరీ కాంగ్రెస్ కన్వీనర్ ప్రొఫెసర్ సాగి కమలాకర శర్మ, తెలుగు అధ్యాపకులు డాక్టర్ ఎస్ రఘు, డాక్టర్ చంద్రయ్య, తెలంగాణ రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న వివిధ యూనివర్సిటీల తెలుగు అధ్యాపకులు, పరిశోదకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనపై బిజెపి కఠిన చర్యలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్న నేతలపై బిజెపి కఠిన చర్యలు చేపట్టింది. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎన్నికల బరిలో నిలిచిన వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని రాష్ట్ర క్రమశిక్షణ సంఘం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సూచనల మేరకు సోమవారం రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధికారికంగా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సస్పెన్షన్ తక్షణమే అమల్లోకి వస్తుందని పార్టీ ప్రకటించింది. జగిత్యాల మున్సిపాలిటీలో సాంబారి కళావతి, అరవ లక్ష్మి, ముద్దం రాము, రావతి రాజు, కొక్కుల ధర్మేంద్ర, సిరికొండ భారతి, పులి శ్రీధర్‌లతో పాటు మెట్‌పల్లి నుంచి మరి సంద కిశోర్, ఆర్మూర్ నుంచి ప్రశాంత్, బొండ్ల నరేష్, కోరుట్ల నుంచి ఇందూరి సత్యం, అయిలాపూర్ నుంచి పద్మ, తోట రాజేశంలను పార్టీ నుంచి సస్పెండ చేశారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ రవీందర్ విశ్వనాథ్ మాట్లాడుతూ సస్పెండ్ అయిన నేతలందరూ నేటి నుంచి వారం రోజులలోపు తమ ప్రవర్తనపై రాష్ట్ర పార్టీకి వివరణ ఇవ్వాలని ఆదేశించారు. పార్టీ నియమ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై భవిష్యత్తులో కూడా కఠిన చర్యలు కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు.



## ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు

డిజిపికి బిజెపి ఫిర్యాదు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో జరుగుతున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల వేళ నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నాయని బిజెపి రాష్ట్ర విభాగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు రాష్ట్ర డిజిపికి సోమవారం బిజెపి నేతలు ఒక లేఖను సమర్పించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నప్పటికీ, కొందరు పోలీసు అధికారులు అధికార పక్షానికి కొమ్ముకాస్తున్నారని, దీనిపై గతంలో రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని లేఖలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 8న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మిర్యాలగూడ పర్యటన సందర్భంగా, బిజెపి స్థానిక నాయకులను పోలీసులు అక్రమంగా గృహనిర్బంధం చేశారని పార్టీ ఆరోపించింది. పోలీసు యంత్రాంగం అధికార పార్టీ అభ్యర్థులతో కుమ్మక్కై, తమ పార్టీ అభ్యర్థులను బెదిరింపులకు గురిచేస్తోందని, ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని బిజెపి మండిపడింది. అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని బిజెపి నేతలు డిజిపిని కోరారు. ఈ లేఖపై ఎంపి రేఖా శర్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్. గౌతమ్ రావు, బిజెపి లీగల్ సెల్ సభ్యుడు ఆర్.వి. పవన్ మైత్రేయ సంతకాలు చేశారు. ఈ ఫిర్యాదు ప్రతిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు కూడా పంపినట్లు వారు తెలిపారు.

# ‘సర్’ ప్రక్రియకు అడ్డంకులు రానివ్వం

అవసరమైతే ఆదేశాలు జారీ చేస్తాం: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ:** బెంగాల్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక స మగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై నెలకొన్న వి వాదాల వేళ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎస్ఐఆర్ ప్రక్రియను ఎవరూ అడ్డుకోవడానికి అ నుమతించబోమని, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే చర్యలు సహించబోమని అత్యున్నత న్యాయస్థానం హెచ్చరించింది. ఆ విషయంలో అవసరమైతే తగిన ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొంది. సిజెఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ ఎన్‌వీ అంజారియా నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సహా పలువురు దాఖలు చేసిన పిటిషన్లపై కోర్టు విచారణ జరిపింది. ఎస్ఐఆర్ ప్రక్రియ కారణంగా పెద్ద ఎత్తున ఓటర్ల పేర్లు తొలగించే ప్రమాదం ఉందని, అర్హులైన ఓటర్లు తమ హక్కు కోల్పోయే అవకాశముందని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా భారీగా ఓట్ల తొలగింపు జరగొచ్చన్న అభిప్రాయాన్ని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన సిజెఐ, ఎస్ఐఆర్ ప్రక్రియకు ఎటువంటి అడ్డంకి రానివ్వమని, ఇది రాష్ట్రాలన్నీ గమనించాలని స్పష్టం చేశారు.

**డిజిపికి కోర్టు ఆదేశాలు**

విచారణ సందర్భంగా ఎన్నికల సంఘం (ఇసి) సమర్పించిన అఫిడవిట్‌ను కోర్టు పరిశీలించింది. ఎన్నికల అధికారులు జారీ చేసిన నోటీసులను కొందరు దుండగులు కాల్చివేశారని ఇసి ఆరోపించింది. ఇప్పటివరకు ఆ ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని కూడా తెలిపింది. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఆ విషయంపై వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని బంగాల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి)కు కోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

**అధికారుల చేతుల్లోనే!**

కేంద్ర ప్రభుత్వ తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ ‘భారత రాజ్యాంగం దేశంలోని అన్ని రాష్ట్రాలకు సమానంగా వర్తిస్తుంది. ఎన్నికల ప్రక్రియను ఎవరూ దెబ్బతీయకూడదు‘ అని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సహకారం అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఇక, ఎస్ఐఆర్ ప్రక్రియలో సహాయంగా ఉపయోగించేందుకు బంగాల్ ప్రభుత్వం 8,505 గ్రూప్‌బి అధికారుల జాబితాను ఎన్నికల సంఘానికి అందజేసింది. వీరికి శిక్షణ ఇచ్చి అవసరమైన చోట వినియోగించవచ్చని కోర్టు సూచించింది. అయితే తుది నిర్ణయాలు మాత్రం ఎన్నికల రోల్ అధికారుల చేతుల్లోనే ఉంటాయని బెంచ్ స్పష్టం చేసింది. ఈ అధికారుల పనితీరు, బాధ్యతలు ఎలా ఉండాలన్నది ఎన్నికల సంఘమే నిర్ణయిస్తుందని తెలిపింది. మమతా బెనర్జీ తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్, మైక్రో ఆబ్జర్వర్ల నియామకం, పెద్దఎత్తున ఓటర్ల తొలగింపు వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేశారు. ‘మాకు మాస్ ఎక్స్‌క్లూజన్ అస్సలు వద్దు. అర్హులైన ఓటరు ఒక్కరూ కూడా నష్టపోవద్దు’ అని ఆయన కోర్టును కోరారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పాక్షికంగా సాగాలని పేర్కొంది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, దానిని కాపాడటం అందరి బాధ్యత అని వ్యాఖ్యానించింది. ఒకవేళ ఎక్కడైనా అవకతవకలు జరిగితే తక్షణమే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. మొత్తంగా చూస్తే, ఎస్ఐఆర్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నది సుప్రీంకోర్టు స్పష్టమైన సందేశంగా మారింది.

# నరవణే పుస్తకంపై మోదీలో వణుకు

- అందుకే మోదీ లోక్‌సభకు రాలేదు
- ప్రధానిని బెదిరించేందుకు విపక్ష ఎంపిలు ప్లాన్ చేశారనేది అబద్ధం
- అలాంటి ఎంపిలను అరెస్టు చేయించి ఉండాల్సింది : రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ :** నరేంద్ర మోదీ రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు సమాధానం ఇవ్వడానికి విముఖత చూపుతూ లోక్‌సభకు రాకుండా డుమ్మా కొట్టారని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సోమవారం ఆరోపించారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే పుస్తకం అంశానికి భయపడే రాలేదన్నారు. సభ్యుల నుంచి ప్రమాదం ఉందన్న కారణంగానే మోదీ సభకు రాకుండే ఉండి ఉంటే... మోదీని బెదిరించిన వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయగలరా అని సవాల్ విసిరారు. అమెరికా ఒప్పందం, అది జరిగిన తీరు, దాని వల్ల రైతులపై పడే ప్రభావం వంటి అంశాల కారణంగా బడ్జెట్‌పై చర్చకు ప్రభుత్వం భయపడుతోందని ఆయన విమర్శించారు. సభ్యులు ప్రధానిని బెదిరించబోతున్నారని ప్రచారం చేస్తున్న ఈ ఆలోచనపై తాము చాలా కలత చెందామని, అయితే అలాంటి ప్రశ్నే లేదన్నారు. ప్రధానమంత్రి సభ్యుల వల్ల ముప్పుందని కాదు, తాను చెబుతున్న విషయాలపై జవాబు చెప్పేందుకు ధైర్యం లేకే సభకు రావడం లేదన్నారు. ఆయన ఇప్పటికీ భయపడుతున్నారని, ఎందుకంటే ఆయన సత్యాన్ని ఎదుర్కోలేరని రాహుల్ ఎద్దేవా చేశారు. ‘మేము ఈ విషయాలను చెప్పడానికి అనుమతిస్తారని, ఆ తర్వాత చర్చ జరగాలని ఒప్పందం కుదిరింది’ అని ఆయన అన్నారు. చర్చ జరగాలని ప్రతిపక్షం చాలా ఆసక్తిగా ఉందని రాహుల్‌గాంధీ చెప్పారు. ‘కానీ ప్రభుత్వం ఏమి చెబుతుందో చూద్దాం. నా వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం, చర్చకు ప్రభుత్వం భయపడుతోంది. ప్రధాని సభకు రాలేదు. మేము చెప్పేదానికి ఆయన భయపడ్డారు, మొదటి అడుగుగా నరవణే పుస్తకాన్ని ఆయనకు అందించడానికి భయపడ్డారు’ అని గాంధీ అన్నారు. ‘నా అంచనా ప్రకారం, బడ్జెట్‌పై చర్చకు ప్రభుత్వం ఆందోళన చెందుతోంది, ఎందుకంటే అమెరికా ఒప్పందం, అది జరిగిన తీరు, మన రైతులపై దాని ప్రభావం వంటి అంశాలపై చర్చ జరగబోతోంది, ప్రభుత్వం అది జరగాలని కోరుకోవడం లేదు’ అని ఆయన అన్నారు. నరవణే పుస్తకం విషయం వెలుగులోకి వచ్చినప్పుడు కొన్ని రోజుల క్రితం ఈ విషయం ప్రారంభమైందని గాంధీ చెప్పారు. ‘నేను దాని గురించి మాట్లాడకూడదని ప్రభుత్వం కోరుకుంది. అందుకే వారు సభను అడ్డుకున్నారు. వారు నన్ను మాట్లాడనివ్వలేదు. ఇలా 34 సార్లు జరిగింది. మొదట, నేను ఒక పుస్తకాన్ని ఉటంకించకూడదని వారు అన్నారు, అప్పుడు నేను ఒక పుస్తకాన్ని ఉటంకించడం లేదని, ఒక పత్రికను ఉటంకిస్తున్నానని చెప్పాను. అప్పుడు వారు మీరు ఒక పత్రికను కూడా ఉటంకించకూడదని అన్నారు. అప్పుడు నేను దాని గురించి మాట్లాడతానని చెప్పాను. నేను దాని గురించి మాట్లాడటం వారికి ఇష్టం లేదు’ అని ఆయన అన్నారు. నరవణే పుస్తకం ప్రచురించబడలేదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తప్పుడు వాదన చేశారని రాహుల్ ఆరోపించారు. ఆ పుస్తకం ప్రచురించబడిందని, తాను ప్రతి రూడా లభించిందన్నారు. రాష్ట్రపతి ప్రసంగంలో ప్రతిపక్ష నాయకుడిని, మొత్తం ప్రతిపక్షాన్ని మాట్లాడనివ్వకపోవడం ఒక పెద్ద సమస్య. వారి సభ్యులలో ఒకరు పుస్తకాలను ఉటంకిస్తూ నీచమైన విషయాలు మాట్లాడారు, కానీ దాని గురించి ఏమీ అనలేదు. వారు ఎప్పుడు కావాలంటే అప్పుడు ఏది కావాలంటే అది చెప్పగలరు, కానీ ప్రతిపక్షం చెప్పకూడదనే విషయం మాకు నచ్చలేదు’అని ఆయన అన్నారు. కాంగ్రెస్ సభ్యుల సస్పెన్షన్, ప్రధానమంత్రిపై దాడి చేయాలనుకుంటున్నారనే వారిపై ఉన్న ఆరోపణలను చర్చించాల్సిన అంశాలుగా గాంధీ పేర్కొన్నారు.



**స్పీకర్ బిర్లాతో రాహుల్‌గాంధీ భేటీ**

ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సోమవారం కొంతమంది ప్రతిపక్ష నాయకులతో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిశారు. సభలో తాను లేవనెత్తాలనుకుంటున్న సమస్యల గురించి ఆయనకు తెలియజేశారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చ ప్రారంభమయ్యే ముందు మాట్లాడటానికి తనను అనుమతించాలన్న గాంధీ డిమాండ్‌పై ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్టంభన నెలకొనడంతో లోక్‌సభ కార్యకలాపాలు మరుసటి వాయిదా పడిన తర్వాత, కొన్ని నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశం జరిగింది. ఎనిమిది మంది కాంగ్రెస్ ఎంపిల సస్పెన్షన్ సమస్యను, మహిళా ఎంపిలపై చేసిన ఆరోపణలతో సహా పార్లమెంటుకు సంబంధించిన ఇతర సమస్యలను లేవనెత్తాలనుకుంటున్నట్లు రాహుల్‌గాంధీ స్పీకర్‌కు చెప్పారని వర్గాలు తెలిపాయి. గత వారం సభలో బిర్లా మాట్లాడుతూ, చాలా మంది కాంగ్రెస్ సభ్యులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సీటు వైపు వెళ్లి ‘ఊహించని చర్య’కు పాల్పడవచ్చని తన వద్ద కచ్చితమైన సమాచారం ఉందని, అందుకే రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చకు సమాధానం ఇవ్వడానికి ఆయన సభకు రాకూడదని తాను అభ్యర్థించానని పేర్కొన్నారు. స్పీకర్‌తో గాంధీ సమావేశమైనప్పుడు టిఎంసి నాయకుడు అభిషేక్ బెనర్జీ, డిఎంకె నాయకుడు టి.ఆర్. బాలు, సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అఖిలేష్ యాదవ్ కూడా ఆయనతో పాటు ఉన్నారు. ప్రతిష్టంభనను ముగించడానికి లోక్‌సభకు చెందిన ఎనిమిది మంది ప్రతిపక్ష ఎంపిల సస్పెన్షన్‌ను రద్దు చేయాలని ప్రతిపక్ష నాయకులు స్పీకర్‌ను కోరారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం. నరవణే జ్ఞాపకాల పుస్తకంలోని కొన్ని భాగాలపై ఆధారపడిన ఒక వ్యాసం నుండి ఉటంకించడానికి గాంధీని సభాపతి అనుమతించకపోవడంతో ఈనెల 3 నుండి లోక్‌సభలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ఆ వ్యాసంలో ఆయన 2020 నాటి భారత్‌–చైనా సంఘర్షణ గురించి ప్రస్తావించారు.

# శరద్ పవార్‌కు అస్వస్థత : ఆస్పత్రిలో చేరిక



**పుణె :** ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ అస్వస్థతకు గురయ్యారు. గత కొన్ని రోజులుగా ఆయన గొంతునొప్పి, దగ్గుతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే కుటుంబ సభ్యులు ఆయన్ను పుణెలోని రూబీ ఆస్పత్రికి తరలించారు. శరద్ పవార్ కొన్ని రోజులుగా గొంతునొప్పితో బాధపడుతున్నారని ఆయన సన్నిహితుడు తెలిపారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ పర్వేజ్ నేతృతంలోని బృందం శరద్ పవార్‌కు చికిత్స అందిస్తోంది. మరిన్ని వివరాలను తర్వాత వెల్లడిస్తామని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ‘శరద్ పవార్‌కు ముందుగా దగ్గు కోసం పరీక్షలు నిర్వహిస్తారు. ఆ తర్వాత ఆయన్ను ఆసుపత్రిలో చేర్చుకోవాలా లేదా డిశ్చార్జ్ చేయాలా అనే దానిపై నిర్ణయం తీసుకుంటారు’ అని రూబీ హాల్ క్లినిక్ చీఫ్ కార్డియాలజిస్ట్, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పర్వేజ్ గ్రాంట్ వెల్లడించారు. సోమవారం ఉదయం నుంచి దగ్గు కారణంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉందని పవార్ ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే ఎలాంటి రిస్క్ తీసుకోకూడదనే ఉద్దేశంతో ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపాయి. శరద్ పవార్‌తో ఆయన కుమార్తె, బారామతి పార్లమెంట్ సభ్యురాలు సుప్రియా సూలే కూడా పుణెలోని రూబీ హాల్ ఆసుపత్రికి వెళ్లారు.

# మావోయిజంతో వినాశనమే

మార్చి 31 కల్లా అంతం చేస్తాం: అమిత్ షా



**న్యూఢిల్లీ:** ‘మావోయిజం ఏ సమాజానికి ఎప్పుడూ మేలు చేయలేదు. అది అడుగుపెట్టిన ప్రతిచోటా వినాశనం తప్ప అభివృద్ధిని కాంక్షించలేదు. కొలంబియా, పెరూ, కంబోడియా వంటి దేశాల చరిత్రే ఇందుకు నిదర్శనం. అందుకే చెబుతున్నా, మార్చి 31 నాటికి దేశం నుంచి నక్సలిజాన్ని సమూలంగా తుడిచిపెడతాం’ అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా కేంద్రం జగదల్‌పుర్‌లో సోమవారం జరిగిన ‘బస్తర్ పాండుమ్–2026’ ముగింపు ఉత్సవాల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ, నక్సల్స్ అంతానికి డెడ్‌లైన్ విధించారు.

**తుపాకీకి తుపాకీతోనే బదులు**

అమిత్ షా తన ప్రసంగంలో మావోయిస్టులకు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ‘మేము ఎవరితోనూ యుద్ధం చేయాలనుకోవడం లేదు. మా పోరాటం మా గిరిజన సోదర–సోదరీమణుల రక్షణ కోసమే. కానీ ఎవరైనా చేతిలో ఆయుధం పట్టుకుంటే, వారికి ఆయుధంతోనే సమాధానం చెబుతాం. ఐఇడిలు అమర్చి అమాయక పిల్లల ప్రాణాలు తీస్తున్నారు. పాఠశాలలను, ఆసుపత్రులను తగులబెడుతున్నారు. ఇంతటి క్రూరత్వం ఎక్కడి నుంచి వచ్చింది? సాయుధ పోరాటాన్ని ప్రభుత్వం ఉక్కుపాదంతో అణిచివేస్తుంది‘ అని ఆయన తేల్చిచెప్పారు. మావోయిస్టుల వల్ల దశాబ్దాలుగా నష్టపోయిన బస్తర్ ప్రాంతం ఇప్పుడు అభివృద్ధి వైపు పరుగులు పెడుతోందని షా పేర్కొన్నారు. డిసెంబర్ 2027 నాటికి బస్తర్ ప్రాంతంలోని 7 జిల్లాల్లోని ప్రతి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం అని హామీ ఇచ్చారు. వచ్చే ఐదేళ్లలో దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన గిరిజన ప్రాంతంగా బస్తర్‌ను మారుస్తామన్నారు.

**రాష్ట్రపతి భవన్‌కు ఆహ్వానం**

బస్తర్ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పడమే ప్రధాని మోదీ లక్ష్యమని షా అన్నారు. తుపాకులు, పేలుడు పదార్థాలు బస్తర్ గుర్తింపు కాదని, ఇక్కడి సంస్కృతే అసలైన గుర్తింపు అని ఉద్ఘాటించారు. ‘బస్తర్ పాండుమ్’ ఉత్సవాల్లోని 12 విభాగాల్లో గెలుపొందిన టాప్3 విజేతలను రాష్ట్రపతి భవన్‌కు ఆహ్వానిస్తామని, అక్కడ వారు తమ కళలను ప్రదర్శించి విందులో పాల్గొంటారని ప్రకటించారు. పోలీసుల త్యాగాలను స్మరిస్తూ తన ప్రసంగాన్ని ముగించారు.

# మీరు బిజెపి ఒత్తిడికి లొంగారు

లోక్‌సభ స్పీకర్‌కు కాంగ్రెస్ మహిళా ఎంపిల లేఖ



**న్యూఢిల్లీ :** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కాంగ్రెస్ మహిళా ఎంపిలు సోమవారం ఘాటు లేఖ రాశారు. ప్రధాని మోదీ సభకు గైర్హాజరు కావడాన్ని సమర్థించే క్రమంలో, స్పీకర్ తమపై నిరాధార ఆరోపణలు చేశారని అన్నారు. అధికార పార్టీ ఒత్తిడి మేరకే ఆయన ఈ విధంగా చేశారని ఆరోపించారు. సభకు నిష్పక్షపాత సంరక్షకుడిగా వ్యవహరించాలని వారు ఓం బిర్లాను కోరారు. గత గురువారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో చర్చ ప్రారంభించారు. అయితే దీనిపై సమాధానం ఇచ్చేందుకు రావద్దని ప్రధాని మోదీని తాను కోరానని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు. ఎందుకంటే, కాంగ్రెస్ సభ్యులు ప్రధాని సీటు వైపు దూసుకొచ్చి, ‘కొన్ని ఊహించని అవాంఛనీయ చర్యలకు’ పాల్పడే అవకాశం ఉందని తనకు కచ్చితమైన సమాచారం ఉందని ఆయన సభలో చెప్పారు. ఒకవేళ ఎంపిలు ఏదైనా అవాంఛనీయ చర్యలకు పాల్పడి ఉంటే, దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలు తునాతునకలయ్యేవని వ్యాఖ్యానించారు. దీనిపై ప్రియాంక గాంధీ ఘాటు రిప్లై ఇచ్చారు. ‘మోదీపై ఎవరైనా దాడి చేస్తారనడం పచ్చి అబద్ధం. ప్రధాని స్పీకర్ వెనుక దాక్కుంటున్నారని’ విమర్శించారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ మహిళా ఎంపీలు తాజాగా ఆయనకు లేఖ రాశారు. ఈ లేఖలో ప్రియాంక గాంధీ, జ్యోతిమణి, ఆర్ సుధా, వర్షా గైక్వాడ, జ్యోత్స్నా మహంత్ తదితరులు సంతకాలు చేశారు.

**ఆ భయంతోనే మోదీ గైర్హాజరు**

‘మోదీ నేతృత్వంలోని ప్రజా వ్యతిరేక ప్రభుత్వంపై మే ము నిరంతరంగా పోరాడుతున్నాం, ప్రశ్నిస్తున్నాం. అందుకే మమ్మల్ని టార్గెట్ చేస్తున్నారు. ప్ర ధాని సభకు రాకపోవడానికి కారణం మా నుంచి ముప్పు ఉండడం కాదు. కేవలం భయం వల్లనే ఆయన రాలేదు. ప్రధానికి ప్రతిపక్షాలను ఎదుర్కొనే ధైర్యం లేదు. మేము ప్రేమ, శాంతి, రాజ్యాంగ విలువలు, మానవ గౌరవాన్ని నమ్మే కాంగ్రెస్ సభ్యులం. మాకు హింస, బెదిరింపులపై నమ్మకం లేదు. మేము ధైర్యవంతమైన మహిళా ప్రతినిధులం. మేము బెదిరింపులకు భయపడం‘ అని కాంగ్రెస్ మహిళా ఎంపీలు ఆ లేఖలో పేర్కొన్నారు.

**రాహుల్ గాంధీకి మాట్లాడే అవకాశం ఇవ్వలేదు!**

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై లోక్‌సభలో రాహుల్ గాంధీ మాట్లాడాలని అనుకున్నారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణె రాసిన పుస్తకంలోని అంశాలను ఆయన ప్రస్తావించాలని భావించారు. కానీ గత నాలుగు రోజులుగా ప్రతిపక్ష నేత అయిన రాహుల్‌కు స్పీకర్ మాట్లాడే అవకాశం కల్పించలేదు. దీనిని కాంగ్రెస్ మహిళా ఎంపిలు తీవ్రంగా ఖండించారు. ఇది ఏ విధంగానూ సమర్థించలేని చర్య అని వారు పేర్కొన్నారు.

**స్పీకర్ పక్షపాత ధోరణి**

అధికార పక్షం ఒత్తిడితో స్పీకర్, ఇండియా కూటమికి చెందిన 8 మంది ఎంపిలను సస్పెండ్ చేశారని, కానీ మాజీ ప్రధానులపై అసభ్యకరంగా మాట్లాడిన బిజెపి ఎంపిలపై ఎలాంటి చర్య తీసుకోలేదని కాంగ్రెస్ మహిళా ఎంపిలు ఆరోపించారు. ఈ విషయంపై తాము స్పీకర్‌ను కలిసినప్పుడు, తాను ప్రభుత్వ స్పందన కోసం ఎదురుచూస్తున్నాన్ని చెప్పారని, దీనిని బట్టి ఆయన స్వతంత్ర నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని అర్థమవుతోందని వారు ఎద్దేవా చేశారు. ‘స్పీకర్ పదవిపై, స్పీకర్‌పై మాకు వ్యక్తిగతంగా గౌరవం ఉంది. అయితే ఓం బిర్లా నిరంతరం అధికార పార్టీ ఒత్తిడిలో ఉన్నారని స్పష్టమవుతోంది. కష్టకాలంలో సరైన నిర్ణయాలు తీసుకున్న వ్యక్తిగా చరిత్ర మిమ్మల్ని గుర్తుంచుకోవాలి. అంతేకానీ, రాజ్యాంగ విలువలు దెబ్బతీసే వారి ఒత్తిడికి లొంగిపోయిన వ్యక్తిగా ఉండకూడదు. స్పీకర్ పదవి అనేది పార్లమెంట్ గౌరవాన్ని కాపాడడానికి, నిష్పక్షపాతంగా, పార్టీలతో సంబంధం లేకుండా సభ్యులందరి హక్కులను పరిరక్షించడానికి ఉద్దేశించిన రాజ్యాంగబద్ధమైన పదవి అని మహిళా ఎంపిలు తమ లేఖలో పేర్కొన్నారు.

# తెలంగాణ అటవీ శాఖ అభివృద్ధికి జైకా రుణ సహాయం

- 5 సంవత్సరాల కాలానికి రూ.1270 కోట్ల ప్రాథమిక ప్రతిపాదన..
- అటవీ అధికారులతో జపాన్ ప్రతినిధుల భేటీ..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ అటవీ శాఖను సమగ్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జెఐసిఎ) నుంచి రుణ సహాయం పొందేందుకు అటవీ శాఖ ప్రాథమిక ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఈ మేరకు అరణ్యభవన్‌లో అటవీ దళాల ముఖ్య సంరక్షణాధికారి డాక్టర్ సి.సువర్ణ అధ్యక్షతన జపాన్ నుంచి వచ్చిన జైకా ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా డాక్టర్ సువర్ణ తెలంగాణ రాష్ట్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలపై జైకా ప్రతినిధులకు వివరించారు. పచ్చదనం పెంపు లక్ష్యంగా వనమహోత్సవం కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున అమలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే జైకా ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధి, టైగర్ రిజర్వ్‌ల బలోపేతం, వన్యప్రాణి సంరక్షణ, అర్బన్ ఫారెస్ట్ డెవలప్మెంట్, విస్తృత ప్లాంటేషన్ కార్యక్రమాలు, క్షీణించిన అడవుల పునరుద్ధరణ, అటవీ అగ్నిప్రమాదాల నివారణ వంటి పలు కీలక కార్యక్రమాలను అమలు చేయనున్నట్లు నిర్ణయించారు. జైకా సహకారంతో 5 సంవత్సరాల కాలానికి రూ.1270 కోట్ల విలువైన ప్రాథమిక ప్రతిపాదనను సిద్ధం చేశారు. మొత్తం వ్యయంలో 85 శాతం నిధులను జైకా నుంచి రుణ రూపంలో, మిగిలిన 15 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలని ప్రతిపాదనలో పొందుపరిచారు. ఈ సందర్భంగా జైకా ప్రతినిధులు మాట్లాడుతూ, భారత్–జపాన్ ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయాలనే దిశగా ప్రస్తుతం భారత్‌లోని పది రాష్ట్రాల్లో అటవీ రంగానికి సంబంధించిన ప్రాజెక్టులను జైకా అమలు చేస్తోందని వారు తెలిపారు. తెలంగాణ అటవీ శాఖ ప్రతిపాదించిన అభివృద్ధి కార్యక్రమాలు సమగ్రంగా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉన్నాయని ప్రశంసించారు. డాక్టర్ సి. సువర్ణ మాట్లాడుతూ..ప్రస్తుత పరిస్థితుల్లో జైకా ప్రాజెక్ట్ అటవీ శాఖకు అత్యంత అవసరం. గతంలో ప్రపంచ బ్యాంకు సహకారంతో వచ్చిన నిధులను మా శాఖ విజయవంతంగా అమలు చేసిన అనుభవం ఉంది. ప్రస్తుతం క్యాంపా నిధులు తగ్గుతున్న నేపథ్యంలో, జైకా వంటి అంతర్జాతీయ సహకార ప్రాజెక్టులు అటవీ శాఖ అభివృద్ధికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి అని పేర్కొన్నారు. అటవీ రంగాన్ని ఆధునికీకరణ దిశగా తీసుకెళ్లడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ఈ జైకా సహకారం కీలక పాత్ర పోషించనుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా జైకా ప్రతినిధులను తెలంగాణ ప్రభుత్వం తరఫున అటవీ శాఖ అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో జైకా ప్రతినిధులు ఇహాచినాట్సు, షిమోజో హిటోమీ , జైకా భారతీయ ప్రతినిధి సిద్ధార్థ్ పరమేశ్వరన్,అటవీశాఖ అధికారులు వినయ్ కుమార్, రత్నాకర్ జౌహరి, ప్రియాంక వర్గీస్, ఎస్.జె. ఆశ, క్షితిజతో పాటు ఆయా జిల్లాల ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.




# 111 ఏళ్ల జాన్ మోరిస్ ఫైర్ ఇంజిన్‌కు జాతీయ స్థాయి గౌరవం

స్టేట్స్‌మన్ వింటేజ్ ర్యాలీలో రెండు ప్రతిష్టాత్మక ట్రోఫీలు





**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే లాలాగూడ వర్క్‌షాప్ సిబ్బంది అంకితభావానికి మరోసారి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. 111 ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన ‘జాన్ మోరిస్ ఫైర్ ఇంజిన్ 2026’లో నిర్వహించిన 59వ స్టేట్స్‌మన్ వింటేజ్, క్లాసిక్ కార్ ర్యాలీలో రెండు ప్రతిష్టాత్మక ట్రోఫీలను గెలుచుకుని దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది.ఈ నెల 8న న్యూఢిల్లీలో జరిగిన ఈ ర్యాలీలో, స్టేట్స్‌మన్ భవనం నుంచి గ్రేటర్ నోయిడా మీదుగా జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వరకు సుమారు 90 కిలోమీటర్ల దూరం ప్రయాణించిన జాన్ మోరిస్ ఫైర్ ఇంజిన్, తన అరుదైన వారసత్వ విలువతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్భంగా వాహనానికి ‘ఇండియన్ ఆయిల్ హెరిటేజ్ ప్రిజర్వేషన్ ట్రోఫీ’,‘ఆటోమోటివ్ ట్రస్ట్ బ్రిటిష్ హెరిటేజ్ ప్రిజర్వేషన్ ట్రోఫీ’లతో సత్కారం లభించింది. 1914లో తయారైన ఈ ఫైర్ ఇంజిన్‌ను అప్పట్లో హైదరాబాద్‌లోని హెచ్‌ఇహెచ్ నిజాం స్టేట్ రైల్వే వినియోగించింది. ప్రస్తుతం ఇది న్యూఢిల్లీలోని నేషనల్ రైల్ మ్యూజియంలో ప్రముఖ ప్రదర్శనగా ఉంది. ప్రపంచంలోనే అరుదైన ఘ్రూస్‌బరీ, ఛాలెంజర్ సాలిడ్ టైర్లు, ఒరిజినల్ అ గ్నిమాపక పరికరాలు, అజాక్స్ గన్ మెటల్ ట్విన్ పంప్ వంటి అసలైన భాగాలతో ఇప్పటికీ సురక్షితంగా నిలిచిన ఏకైక ఫైర్ ఇంజిన్‌గా దీనికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ చారిత్రక వాహనాన్ని అద్భుతంగా సంరక్షిస్తున్నది మాత్రం సికింద్రాబాద్ రైల్వే లాలాగూడ క్యారేజ్ వర్క్‌షాప్ సాంకేతిక బృందమే. వారి నైపుణ్యం, అంకితభావమే ఈ విజయానికి మూలకారణంగా నిలిచింది. రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్ జాన్ మోరిస్ ఫైర్ ఇంజిన్‌ను పరిశీలించి లాలాగూడ వర్క్‌షాప్ సిబ్బందికి రూ.50,000 నగదు బహుమతి ప్రకటించారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ కూడా వర్క్‌షాప్ బృందాన్ని అభినందిస్తూ, జాన్ మోరిస్ ఫైర్ ఇంజిన్‌కు జాతీయ స్థాయిలో వచ్చిన గుర్తింపు దక్షిణ మధ్య రైల్వేకు గర్వకారణం అని పేర్కొన్నారు.వారసత్వ సంపద సంరక్షణలో లాలాగూడ వర్క్‌షాప్ మరోసారి దేశానికి ఆదర్శంగా నిలిచిందని రైల్వే వర్గాలు వెల్లడించాయి.

# 54వ అఖిల భారత అంతర్–రైల్వే జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌లో దక్షిణ మధ్య రైల్వే అద్భుత విజయం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కోల్‌కతాలో ఈ నెల 4 నుంచి 6 వరకు నిర్వహించిన 54వ అఖిల భారత అంతర్–రైల్వే జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ (పురుషులు మహిళలు) లో దక్షిణ మధ్య రైల్వే జట్టు అద్భుత విజయాన్ని సాధించింది. ఈ పోటీల్లో ఎస్‌సిఆర్ జట్టు స్వర్ణం, వెండి, మూడు కాంస్య పతకాలు సాధించి ఘన విజయాన్ని నమోదు చేసింది. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సోమవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవను పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ క్రీడాకారులను అభినందిస్తూ, కఠిన శ్రమ, క్రీడాస్ఫూర్తి, నిబద్ధతను ప్రశంసించారు.

# జీవితంలో ఏదీ సులువుగా ఉండదు..



పరీక్షా పే చర్చలో విద్యార్థులతో మోదీ

**న్యూఢిల్లీ :** సాంకేతికత మనం పనిచేసే విధానాన్ని మారుస్తుందని, దాన్ని అర్థం చేసుకుని అవసరానికి తగినట్లుగా వినియోగించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. అంతేగానీ సాంకేతికతే మిమ్మల్ని బానిసలుగా మార్చుకునే పరిస్థితికి వెళ్లొద్దని సూచించారు. ‘పరీక్షా పే చర్చ’ రెండో ఎడిషన్‌లో భాగంగా పలువురు విద్యార్థులతో ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా కెరీర్ పురోగతికి సంబంధించి వారికి విలువైన సూచనలు చేశారు. విద్యార్థులు వెలిబుచ్చిన సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. క్రమశిక్షణ, ప్రేరణ ఈ రెండింటిలో ఏది ముఖ్యం..? అన్న ప్రశ్నకు.. ఆ రెండింటినీ పోల్చకూడదని అన్నారు. ఎంత స్ఫూర్తి పొందినా ఆచరణలో క్రమశిక్షణ లేకపోతే సత్ఫలితాలు పొందలేరని అన్నారు. సమయపాలన, స్థిరత్వం, స్వీయ క్రమశిక్షణే మన ప్రేరణను అర్థవంతమైన ఫలితాలుగా మారుస్తుందని చెప్పారు. ఎఐతో ఉద్యోగాలు పోతాయన్న భయాలు నిజమేనా..? అన్న ప్రశ్నకు సాంకేతికత మన పనితీరును మెరుగుపరుస్తుందని చెప్పారు. దాన్ని సరిగ్గా వినియోగించుకుంటే ఎఐకి విద్యార్థులు భయపడాల్సిన పనిలేదన్నారు. టెక్నాలజీతో ఎలా పనిచేయాలన్నది నేర్చుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు. జీవితంలో ఏదీ సులువుగా ఉండదన్నారు. విద్యార్థులకు ఐదు ట్రావెల్ డెస్టినేషన్స్ చెప్పండి..? అని అడుగగా.. ముందు మన సొంత ప్రాంతాలపై దృష్టిపెట్టాలని చెప్పారు. మన జిల్లా, నగరం, రాష్ట్రంలో ఉన్న ముఖ్యమైన ప్రాంతాల జాబితాను రాసుకోవాలన్నారు. ఆ తర్వాత ఎక్కడికి వెళ్లాలో ఎంచుకోవాలని చెప్పారు. అనంతరం మన సమీపంలో ఉన్న ప్రాంతాల విశిష్టతను తెలుసుకుంటే, అది భవిష్యత్తులో ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. మంచి నాయకుడిగా ఎలా మారాలి..? అన్న ప్రశ్నకు మన విధివిధానాలకు ఎన్నటికీ భయపడకూడదని చెప్పారు. విధేయత, నిబద్ధతతో పనిచేయాలన్నారు. నిలకడగా సరైన పని చేయడమే నిజమైన నాయకత్వమని చెప్పారు. లీడర్‌షిప్‌నకు ముఖ్యమైన లక్షణం మీ ఆలోచనలను కనీసం 10 మందికైనా స్పష్టంగా తెలియజేయగలడమని అన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily

హైదరాబాద్
మంగళవారం
10-02-2026
www.prajapaksham.in



# మున్సిపోల్స్‌కు రంగం సిద్ధం

తెలంగాణ రాష్ట్రంలో నిర్ణీత పరిపాలనాకాలం ముగిసిన 116 పురపాలక సంఘాలు, 7 పురపాలక కార్పొరేషన్‌లకు ఈనెల 11(బుధవారం) నిర్వహిస్తున్న పోలింగ్‌కు రాజకీయ పక్షాల ప్రచారానికి సోమవారం సాయంత్రం 5గంటలకు తెరపడింది. అయితే ఇంటింటికీ ప్రచారం, ఓటుకు నోటు, ఇతర ప్రలోభాల పంపిణీ, చాటుమాటు బేరసారాలు ఇప్పుడే మొదలవుతాయి. ఓటర్లను ప్రభావితం చేసే ఈ అవినీతి పద్ధతులకు అడ్డుకట్టపడాలంటే పోలీసు యంత్రాంగం మాత్రమే సరిపోదు. రాజకీయ పార్టీల కార్యకర్తలు పరస్పరం నిఘా పాటించటం అవసరం. పోటీలోని ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు, వారి తరఫున చైర్మన్ క్యాండిడెట్లు లేదా పార్టీల హంగుదారులు ఓటర్లను ప్రలోభపెట్టటంలో పోటీపడటం స్థానిక ఎన్నికల్లో సహజ ప్రక్రియగా సాగుతున్నందున పరస్పర నిఘాతో అవినీతిని అరికట్టాలనుకోవటం పేరాశే అవుతుంది. వర్ధిల్లుతున్న ప్రజాస్వామ్య వ్యవస్థలో మూడవ దొంతర పాలనా వ్యవస్థ అయిన స్థానిక సంస్థల్లో (పంచాయతీరాజ్, మున్సిపల్) ప్రజలెన్నుకున్న పాలకవర్గాల పాలన ఎప్పుడూ ఆహ్వానించదగిందే.

**తెలంగాణ రాష్ట్రంలో ఇవి రెండవ దఫా పురపాలక ఎన్నికలు. తొలి ఎన్నికలను అప్పటి అధికార పార్టీ టిఆర్‌ఎస్ స్వీప్ చేసింది – ఇప్పుడు మనుగడకు ప్రాకులాడుతోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం మాదే అంటున్న బిజెపి ఈ ఎన్నికల్లో బలపరీక్ష చేసుకుంటోంది. పాలక కాంగ్రెస్ పార్టీ తమ రెండేళ్ల పాలన ఫలితాలను వివరిస్తూ అత్యధిక మెజారిటీ పురపాలికలపై జెండా ఎగురవేయగలమన్న ధీమాతో ఉంది. ఇక ఓటరు దేవుళ్లదే నిర్ణయం!**

73,74 రాజ్యాంగ సవరణలు ఆ సంస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించాయి. పార్లమెంటు, అసెంబ్లీల వలె స్థానిక సంస్థలకు కూడా ఐదేళ్ల పదవీకాలం ముగిసేలోపు విధిగా ఎన్నికలు జరపాలని ఆ సవరణ చట్టాలు నిర్దేశించాయి. అయితే రిజర్వేషన్‌లు వంటి అంశాల నిర్ణయాధికారం రాష్ట్ర ప్రభుత్వాల చేతిలో ఉన్నందున పాలకపార్టీల అనుకూలతలనుబట్టే ఎన్నికల నిర్ణయం జరుగుతోంది. ఇది వాంఛనీయం కాదు.

2014 లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన దరిమిలా పదేళ్లపాటు రాష్ట్రాధికారంతోపాటు స్థానిక సంస్థల పాలన కూడా దాదాపు పూర్తిగా టిఆర్‌ఎస్/బిఆర్‌ఎస్ చేతిలోనే ఉంది. కాబట్టి గ్రామాలు, పట్టణాల్లో పౌర వసతుల ప్రస్తుత స్థితిగతులకు ఆ పార్టీదే బాధ్యత. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన గ్రామ పంచాయతీల ఎన్నికల్లో 60శాతంపైగా తమ పార్టీకి లభించినట్లు ఆ పార్టీ క్లెయిం చేసింది. అయితే కిందపడినా పైచేయి మాదే అన్నట్లు బిఆర్‌ఎస్ పల్లెలు తమ పార్టీకే పట్టం కట్టాయని ప్రచారంలో పెట్టింది. బిజెపి గొప్పలకు పోదామన్నా గ్రామీణులు ఆ అవకాశం ఇవ్వలేదు. అందువల్ల ఈ మున్సిపల్ ఎన్నికలపై ఆ పార్టీ ఆశలు పెట్టుకుంది.

ఈ స్థానిక ఎన్నికలకు పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నావిస్‌ను ప్రచారానికి దించింది. రాష్ట్ర నాయకులు అధ్యక్షుడు రాంచందర్ రావు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ దూకుడు ప్రదర్శించారు.

ఈ ఎన్నికల్లో కమ్యూనిస్టులు, ఎంఐఎం, ఇంకా ఇతరులు చెదురుమదురుగా పోటీలో ఉండగా ప్రధాన పోటీ ముఖ్యంగా కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి మధ్య జరుగుతోంది. రాజకీయ పార్టీల గుర్తులపై జరిగే ఈ ఎన్నికల్లో ఫలితాలపై ఎన్ని క్లెయిములకు అవకాశం లేదు. ఏ పార్టీ ఎన్ని వార్డులు, ఎన్ని చైర్మన్, మేయర్ పదవులు దక్కించుకుంటుందో స్పష్టంగా తెలుతుంది. కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికలను తమ రెండేళ్లపాలనకు గీటురాయిగా తీసుకుంది. ముఖ్యమంత్రి సహా, మంత్రులు, ఎమ్మెల్యేలు నిర్దిష్టమైన బాధ్యతలతో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు.

ముఖ్యమంత్రి స్వయంగా మిర్యాలగూడ, చొప్పదండి, నిజామాబాద్ రూరల్, పరిగి, భూపాలపల్లి బహిరంగసభల్లో ప్రసంగించారు. కాగా తమ పార్టీ పునరుజ్జీవనానికి ఈ ఎన్నికలను ఉపయోగించుకుంటున్న బిఆర్‌ఎస్ ముమ్మర ప్రచారం చేబట్టింది. రాష్ట్ర కేంద్రంనుంచి వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు, అసెంబ్లీలో పార్టీ ఉపనాయకుడు తన్నీరు హరీష్‌రావు ప్రధానంగా ఉత్తర తెలంగాణా జిల్లాలైన కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్, మెదక్ జిల్లాలపై కేంద్రీకరించారు. కాగా కెసిఆర్ కుమార్తె, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఫార్వర్డ్‌బ్లాక్ చిహ్నంపై కనీసం ఓ వందమంది అభ్యర్థులను పోటీ చేయించారు.

ఈ ఎన్నికల్లో ప్రచారస్థాయి దిగజారింది. ముఖ్యంగా మూడు ప్రధాన పార్టీల నేతలు స్థానిక అభివృద్ధికి తమ ప్రణాళికలగూర్చి కాకుండా సునాయాసంగా రాజకీయ నిందారోపణలు చేసుకున్నారు. భాష నేలబారుగా సాగింది. అందువల్ల ఓటర్లు అవేవీ పట్టించుకోకుండా, స్థానికంగా అభ్యర్థు ల పూర్వాపరాలు, సమస్యలను పరిష్కరించగల సామర్థ్యం, అభివృద్ధికి దోహదం చేయగల చొరవ తదితర అంశాలను దృష్టిలోకి తీసుకుని సమర్థులకు ఓటు చేయాలి. విత్తనంబట్టేకదా వృక్షం ఫలాలనిస్తుంది. అందువల్ల ఓటు వేసేటపుడు తప్పు నిర్ణయం తీసుకుంటే ఆ తర్వాత చింతించినా నిష్ఫలం.

ఈ ఎన్నికల తదుపరి మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల ఏర్పాటు నిమిత్తం ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికల నిర్వహణ పూర్తిచేస్తే స్థానిక సంస్థల్లో ప్రజాస్వామ్యయుతంగా ప్రజాప్రాతినిధ్య పాలన ఏర్పాటు సంపూర్ణమవుతుంది.



## అసోం సిఎంపై చట్టపరంగా ముందుకు

**నాకు, నా భార్యకు పాకిస్థానీ ఏజెంట్ అలీ తౌఖీర్ షేక్‌తో సంబంధాలు ఉన్నాయని అసోం సిఎం హిమంత బిశ్వశర్మ చేసిన వ్యాఖ్యలు పచ్చి అబద్ధం. 2013లో తన పాకిస్థాన్ పర్యటన గురించి సిట్ అధికారులు నన్ను ఎన్నడూ ప్రశ్నించలేదు. ప్రజల మధ్యలో మతపరమైన విద్వేషాలు సృష్టించేందుకు హిమాంత శర్మ ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. తన భార్య, మైనర్ పిల్లలపై అసంబద్ధమైన ఆరోపణలు చేసినందుకుగాను అసోం సిఎం వ్యాఖ్యలపై చట్టపరంగా ముందుకు వెళ్తాం. ఆయన మాట్లాడిన వీడియో ఆధారంగా కేసు నమోదు చేయాలి. నా భార్య ఉద్యోగ సంబంధమైన పనికోసం మాత్రమే పాకిస్థాన్ పర్యటనకు వెళ్లింది.**

– లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత
గౌరవ్ గొగోయ్



## వైవిధ్యభరిత వ్యవసాయ ఉత్పత్తులను సాధించలేమా!

అనాదిగా మన సుస్థిర వ్యవసాయ రంగం పప్పుధాన్యాలతో (పల్సెస్) అవినాభావ సంబంధాలను కలిగి ఉంది. చూడడానికి చిన్న సైజులో కనిపించినప్పటికీ పప్పుల్లో విలువైన పోషకాలు, పేదల పళ్లెంల్లో చోటు, రుచిరమైన ఆహార పదార్థాలుగా ప్రాధాన్యతతో పాటు నేల సత్తువ పెంచడానికి ఇవి దోహదపడుతున్నాయి. కొంత మేరకు ఖరీదు తక్కువగా ఉంటూ సంపన్నుల నుంచి కడు పేదవాడి వరకు అందరూ పప్పును దాదాపు నిత్యంవాడడం జరుగుతున్నది. లెగ్యూమ్స్‌గా పిలువబడే పప్పుల్లో ముఖ్యమైనవిగా పెసర, కంది, శనగ, మినుములు, బొబ్బర్లు, సోయా బీన్స్ లాంటి పలురకాలు ఉంటాయి.

**పప్పుధాన్యాల ప్రాధాన్యం:** పప్పు ధాన్యాల పలు ముఖ్యమైన ప్రయోజనాలను బట్టి వాటి ఉత్పత్తులను వంటల్లో వాడడం, ప్రోటీన్లకు మూల పోషకాలుగా భుజించడం, కొవ్వులు తక్కువగా ఉండడం, కరిగే స్వభావం కలిగిన పీచు పదార్థాలు ఉండడం కొలెస్ట్రాల్‌తో పాటు బ్లడ్ షుగర్స్‌ను తగ్గించగల ఉత్తమ పోషకాహారంగా గుర్తిస్తూ, అన్ని వర్గాల కుటుంబాలు వాటి వాడకాన్ని పెంచడానికి ప్రయత్నాలు చేస్తే ఆరోగ్యకరమైన పౌర సమాజం నిర్మితం అవుతుంది. హృదయనాళ సంబంధ, మధుమేహం, స్థూలకాయ అనారోగ్యాలు రాకుండా పప్పులను మన భోజనంలో ఇమడ్చుకోవాలి. పప్పుధాన్యాల వాడకంతో అందులోని ఆంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్, లాంటి ముఖ్యమైన పోషకాలు శరీరానికి అందించబడతాయి. పప్పులు ఉత్తమ ఆహార పదార్థాలే కాకుండా ఆహార పదార్థాల నష్టాలను, ఆహార వ్యర్థాలను తగ్గిస్తాయి.

**ఆహార భద్రత, నేల నాణ్యత పెంపు:** పప్పులను పండించే రైతులు వాటిని తమ ఆహార పదార్థాలుగా తినడమే కాకుండా ఆర్థిక రాబడికి మార్కెటింగ్ కూడా చేస్తూ కుటుంబాల ఆహార భద్రతతో పాటు ఆర్థిక స్థిరత్వానికి కూడా దోహదపడుతున్నాయి. నేలలో నత్రజని నిల్వలు పెంచగల పప్పులు నేల నాణ్యతను సహితం పెంచుతాయి. పంట మార్పిడి, సాగు పద్ధతుల్లో వైవిధ్యత సాధించడంతో పాటు తెగుళ్ల నివారణ, పురుగులను దూరంగా ఉంచడం కూడా సుసాధ్యం అవుతున్నది. ఇతర ఆహార ధాన్యాలతో పోల్చితే పప్పులను పండించుటకు తక్కువ నీరు అవసరం అవుతున్నది. ఒక కిలోగ్రామ్ పప్పును పండించడానికి దాదాపు 1250 లీటర్ల నీరు అవసరం కాగా ఒక కేజీ పంది మాంసానికి 13,000 లీటర్ల నీరు వినియోగించబడుతున్నది.ఉత్తమ ఉత్పత్తులు, ఉత్తమ పోషక విలువలు, ఉత్తమ వినియోగం, ఉత్తమ పర్యావరణం, ఉత్తమ ఆరోగ్య జీవనం, ఉత్తమ జీవన విధానాలకు పప్పుధాన్యాలు అనాదిగా దోహదపడుతున్నాయి. అన్ని వర్గాల ప్రజలకు కావలసిన పప్పుధాన్యాలతో సమ్మిళిత, సుస్థిర, వినియోగాలతో పేదవాడి కండల్లో శక్తి ఊరుతుంది, ఆరోగ్యం పటిష్టమవుతుంది. ఇలాంటి పప్పుధాన్యాల పట్ల సామాన్య జనాల్లో అవగాహన కలిపించడం మనందరి కనీస కర్తవ్యం అని నమ్మాలి.

(10 ఫిబ్రవరి ప్రపంచ పప్పుధాన్యాల దినం సందర్భంగా)

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి,** 9949700037

# ఎప్‌స్టెయిన్ బూతు పురాణంలో "భారతీయ" ప్రముఖులు



ఎం.కోటేశ్వరరావు

ఎప్‌స్టెయిన్ ఫైల్స్! ఈ మాట వినగానే వివాదాస్పద కాశ్మీరీ ఫైల్స్ సినిమా గుర్తుకు వస్తుంది. అమెరికా లో జెఫ్రీ ఎప్‌స్టెయిన్ స్వంత విమానాల్లో తిరిగేంత ధనవంతుడు, ఫైనాన్సర్, ఘరానా పైరవీ, తార్పుడుగాడు. వాడి దగ్గర ఉన్న ఫైల్స్ ఓ బూతుసినిమా అనుకుంటే దాని లో మన దేశానికి చెందిన ప్రముఖులు ప్రధాని నరేంద్రమోదీ నుంచి ప్రభుత్వ ప్రాపకం ఉన్న పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ వరకు కొందరు నటించినట్లు ప్రస్తావనలు ఉన్నాయి. నీలి చిత్రాల్లో నటించటం అంటే 'ఏ' దృశ్యాల్లోనే పాల్గొనాల్సిన అవసరం లేదు. అసలేం జరిగింది? ట్రంప్ సర్కార్ విధిలేక బయటపెట్టిన లక్షలాది ఆ ఫైళ్లలో ప్రముఖ దర్శకురాలు, న్యూయార్క్ నగర వామపక్ష మేయర్ జోహ్రాన్ మమదానీ తల్లి మీరా నాయర్ పేరు కూడా ఉంది. ట్రంప్‌ను సవాల్ చేసి ప్రపంచ పెట్టుబడిదారీ కుంభస్థలంగా భావించే నగరానికి 34ఏండ్ల మమదానీ ఎన్నికయ్యాడు. అవకాశం కోసం చూస్తున్న అమెరికాలో వామపక్ష వ్యతిరేకులు, వారి అడుగుజాడల్లో నడిచే హిందూత్వ శక్తులు రెచ్చిపోయాయి. కృత్రిమ మేథతో రూపొందించిన చిత్రాల్లో ఒకదానిలో బాలుడిగా ఉన్న జోహ్రాన్ మమ్‌దానీ, మీరానాయర్, బిల్‌క్లింటన్,జెఫ్రీ ఎప్‌స్టెయిన్ ఉన్నారు. ఆ ఫొటోలను ఎక్స్‌లో పెట్టటంతో లక్షలాది మంది చూశారు. ఇద్దరు పెద్ద ఉగ్రవాదులతో ఒక చిన్న ఉగ్రవాది అన్నారు. మమదానీకి శిక్షణ ఇచ్చింది ఎప్‌స్టెయిన్ అన్న అర్థం వచ్చేలా ఫొటోల కింద వ్యాఖ్య రాశారు.

మన దేశంలో హిందూత్వ ప్రచారం చేస్తున్న ఖాతాలలో జైపూర్ డైలాగ్స్ ఒకటి. అలెక్స్ జోన్స్ పోస్టు చేసిన ఫేక్ ఫొటో వీడియోను అది షేర్ చేసింది. మమదానీ అసలు తండ్రి ఎప్‌స్టెయిన్ అని వర్గాలు తెలిపాయి అంటూ వ్యాఖ్య చేశారు. ఇదే విధంగా వాయిస్ ఆఫ్ హిందూస్ పేరుతో ఉన్నవారు కూడా దాన్ని ప్రచారంలో పెట్టారు. నిజమేమిటో తల్లి చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలా అనేకమంది వాటిని వైరల్ చేశారు. దీని వెనుక ముస్లిం వ్యతిరేక వామపక్ష భావజాల వ్యతిరేక ఉన్మాదం స్పష్టంగా కనిపిస్తోంది. మీరా నాయర్ అమెరికాలో చదువుకున్న రోజుల్లో ఆమెకు టీచర్‌గా ఉన్న మిచెల్ ఎపిస్టెయిన్‌తో 1970దశకం చివరిలో వివాహం జరిగింది. కొన్ని సంవత్సరాల తరువాత విడిపోయారు. ఈ ఎప్‌స్టెయిన్‌కు, తార్పుడు ఎపిస్టెయిన్‌కు కుటుంబం, ఇతరత్రా ఎలాంటి సంబంధాలు లేవు. ఒకరు ఆర్టిస్టు కాగా మరొకడు నేరగాడు. మీరా నాయర్ ఎలాంటి తప్పూ చేయనప్పటికీ ఆ పార్టీలో పాల్గొనటాన్ని అవకాశం గా తీసుకొని మమదానీ వ్యతిరేకులు, వారితో గొంతుకలిపిన హిందూత్వశక్తులు పెద్ద ఎత్తున కృత్రిమ ఫొటోలు సృష్టించి అక్రమ సంబంధాలను అంటగట్టారు. జోహ్రాన్ తండ్రి ఎప్‌స్టెయిన్ అని ప్రచారం చేశారు. ఎన్నికల్లో నిజాలను దాచి తమను మోసం చేశారంటూ మమదానీ అభిమానుల ముసుగులో కొందరు న్యూయార్క్‌లో ప్రదర్శన చేశారు. అయితే నిజ నిర్ధారణ చేసిన వారు అవన్నీ తప్పుడు ప్రచారాలని, ఎలాంటి వాస్తవం లేదని తేల్చారు.

ఎప్‌స్టెయిన్ ఫైల్స్‌లో పేర్లున్న మన ప్రముఖుల గురించి చూద్దాం. వారికి ఆ తార్పుడు గాడు అమ్మాయిలను సరఫరా చేసినట్లు గానీ, వాడి నేరాలలో భాగస్వామ్యం ఉన్నట్లు గానీ ఇప్పటి వరకు వెలువడిన పత్రా ల్లో లేదు. ఇప్పటికి ఆరులక్షల పేజీలు వెల్లడి కాగా ఇంకా బయటకు రావాల్సినవి ఉన్నాయి. ఇక్కడ అసలు సమస్య అలాంటి అవాంఛనీయ వ్యక్తితో విలువలు వలువల గురించి కబుర్లు చెప్పేవారు సంబంధాలు ఎందుకు పెట్టుకున్నారన్నదే బయటకు రావాల్సిన అంశం. తెరవెనుక ఇవన్నీ సాధారణమే అంటారా అదైనా చెప్పండి. మోదీ ఆన్ బోర్డ్ అనే ఇమెయిల్లో ప్రధాని పేరు ప్రస్తావన ఉంది. ఆ తార్పుడుగాడితో 2014–17 సంవత్సరాలలో కేంద్రమంత్రి హరదీప్ సింగ్ పూరీ ఐదుసార్లు కలిసినట్లు వెల్లడైంది. ఐఎఫ్ఎస్ అధికారి అయిన పూరీ 2014 జనవరిలో బిజెపిలో చేరారు. అంతకు ముందు 1974 నుంచి 2013వరకు విదేశాంగశాఖ అధికారిగా వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం పెట్రోలియం శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు.

ప్రధాని నరేంద్రమోదీ గురించి జెఫ్రీ ఎప్‌స్టెయిన్, డోనాల్డ్ ట్రంప్ మాజీ వ్యూహకర్త స్టీవ్ బనాన్ మధ్య నడిచిన ఇమెయిల్స్‌లో ప్రస్తావన ఉంది. తాను ట్రంప్ అధికార యంత్రాంగం భారత ప్రధాని కార్యాలయ అధికారులకు మధ్యవర్తిగా ఉన్నట్లు ఎప్‌స్టెయిన్ పేర్కొన్నాడు. 2017 జూలై ఆరున మోదీ ఇజ్రాయెల్ పర్యటన ముగిసిన తరువాత కతార్‌కు చెందిన జబోర్ వై అనే వ్యక్తి(కతార్ రాచకుటుంబానికి చెందిన వ్యక్తి అని వార్తలు)కి మెయిలు పంపాడు. దానిలో "భారత ప్రధాని మోదీ సలహా తీసుకున్నారు. అమెరికా అధ్యక్షుడికి మేలు చేకూర్చేందుకు ఇజ్రాయెల్‌లో నృత్యం చేశారు, పాట పాడారు. వారు కొద్ది వారాల ముందు కలుసుకున్నారు, అది పని చేసింది" మోదీ ఇజ్రాయెల్ పర్యటన ఖ్యాతి తనదే అని కూడా పేర్కొన్నాడు. ఒక భారత ప్రధాని తొలిసారిగా ఇజ్రాయెల్‌ను సందర్శించటమే గాక తరువాత విదేశాంగ విధానంలో నిర్ణయాత్మక మార్పులు చేసిన ఖ్యాతి మోదీకి దక్కిందన్నది స్పష్టం. ఈ ఫైళ్లలో ఉన్న అంశం మీద మన విదేశాంగశాఖ స్పందించింది. ప్రధాని పర్యటన నిజమే గానీ శిక్షపడిన ఒక నేరగాడు పేర్కొన్న అంశాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, ఎప్‌స్టెయిన్ లేదా ఇతర విదేశీ సలహాల ప్రభావంగానీ పర్యటన మీద లేదని వ్యాఖ్యానించింది. ఆ సమయంలో ఎప్‌స్టెయిన్ ట్రంప్ యంత్రాంగంతో సంబంధాలలో ఉన్నాడన్నది, భారత వ్యవహారాల్లో వేలుపెట్టాడన్నది వాస్తవమే అన్నది కొందరి అభిప్రాయం. ఇప్పుడున్న పరిస్థితిలో నిజానిజాలను ఎవరూ బయటపెట్ట రన్నది వేరే చెప్పనవసరం లేదు.

నరేంద్రమోదీ నేరుగా కలిసినట్లు ఎప్‌స్టెయిన్ కూడా చెప్పలేదు. అతగాడి హవా నడిచిన సమయంలో కేంద్రమంత్రి హరదేవ్ సింగ్ పూరీ 2014–17 సంవత్సరాలలో ఐదుసార్లు కలిసినట్లు ఎప్‌స్టెయిన్ దినచర్య డైరీలో పూరీ పేరు ఉంది. మూడు సార్లు న్యూయార్క్ నివాసంలో భేటీ అయినట్లు స్పష్టంగా ఉంది. నరేంద్రమోదీ అధికారానికి వచ్చిన తరువాత 2014 నవంబరులో భారత డిజిటల్ ఎకానమీ, పెట్టుబడులకు ఉన్న మంచి అవకాశాల గురించి పూరీ ఒక మెయిల్ పంపారు. సిలికాన్ వాలీలోని, టెక్ కంపెనీల ఉన్నతాధికారులు, పెట్టుబడిదారులతో పూరీని కలిపేందుకు చురుకుగా ఎప్‌స్టెయిన్ పనిచేసినట్లు ఒక మెయిల్లో ఉంది. లింక్‌డ్ ఇన్ కంపెనీ స్థాపకుడితో భారత్‌లో పెట్టుబడి అవకాశాల గురించి పూరీ చర్చించినట్లు కూడా వెల్లడైంది. తాను ఎనిమిదేండ్లు న్యూయార్క్‌లో ఉన్నానని, మూడు సార్లు కలిసింది నిజమే అని అంతర్జాతీయ పీస్ ఇనిస్టిట్యూట్‌లో పనిచేస్తుండగా మూడుసార్లు కలిసింది నిజమే అని, అది పని సంబంధంగా, చాలా పరిమితమైన కలయిక అని, తనకు అతగాడి నేరజీవితం గురించి తెలియదని వైర్ పోర్టల్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా పూరీ చెప్పారు. అంతర్జాతీయ శాంతి వ్యవహారాల్లో ఎప్‌స్టెయిన్‌కు ఉన్న సంబంధం ఏమిటో ఒక రాయబారిగా పూరీ ఏమి చర్చించారో అంతుబట్టదు. ఆ భేటీల తరువాతే హరదేవ్‌సింగ్ పూరీ కేంద్రమంత్రివర్గంలో 2017లో చేరారు. చిత్రం ఏమిటంటే ఈ ఫైళ్ల గురించి తొలి సమాచారం 2025 నవంబరులోనే వెల్లడైంది. ఇదంతా వట్టిదే అని అప్పుడు బిజెపి ప్రతినిధి ప్రదీప్ భండారీ కొట్టి పడేశారు. ఇప్పుడు ఆ పెద్దమనిషి తలెక్కడ పెట్టుకున్నారో తెలియదు.

రిలయన్స్ కమ్యూనికేషన్స్ పేరుతో మందిని ముంచిన అనిల్ అంబానీ నడిపిన వ్యవహారాలు ఎప్‌స్టెయిన్ ఫైల్స్‌లో స్పష్టంగా ఉన్నాయి. 2017మార్చినెల 16న అంబానీ పంపిన ఒక వర్తమానం ఇలా ఉంది. "హలో నేను ఢిల్లీలో ఉన్నాను. జారెడ్(ట్రంప్ అల్లుడు జారెడ్ కుషనర్) మరియు బానన్ (స్టీవ్ బానన్ ట్రంప్ ప్రధాన వ్యూహకర్త) లను నేను కలుసుకొనేందుకు మీ సాయం కావాలని "నాయకత్వం" (ప్రధాని కార్యాలయం)వాంఛిస్తున్నది. దయచేసి సలహా ఇవ్వండి. ప్రధాని వాషింగ్టన్ పర్యటన జరపబోతున్నారు" అని అనిల్ అంబానీ పేర్కొన్నాడు.

ఇదంతా ఆ తరువాత 2017 జూన్‌లో జరిపే అమెరికా పర్యటనకు ముందు జరిగింది.2017 నుంచి 2019వరకు అనిల్ అంబానీ ఎప్‌స్టెయిన్ మధ్య నిరంతర సంబంధాలు ఉన్నట్లు ఫైళ్లలో బయటపడింది. వారేమి చర్చించుకున్నారంటే అమెరికా, భారత్‌లో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, పెట్టుబడి వ్యూహాలు, ట్రంప్ యంత్రాంగంతో అప్పాయింట్‌మెంట్లు, మోదీ అమెరికా, ఇజ్రాయెల్ యాత్రల గురించి. ప్రధాని ఇజ్రాయెల్ పర్యటనకు ముందు, ఇజ్రాయెల్ మాజీ ప్రధాని ఎహూద్ బరాక్‌ను ఎలా కలుసుకోవాల్సింది ఒక మెయిల్‌లో ఎప్‌స్టెయిన్ అంబానీకి సూచించాడు. ఇద్దరి మధ్య సమావేశం ఏర్పాటు చేస్తానని చెప్పాడు.

మోదీ పర్యటనపై ఇజ్రాయెల్ వ్యూహం గురించి చర్చించారు. ఆ సమయంలో అనిల్ అంబానీ రిలయన్స్ డిఫెన్స్ లిమిటెడ్ కంపెనీ ఇజ్రాయెల్ ప్రభుత్వరంగ సంస్థ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్ లిమిటెడ్ కంపెనీతో సంయుక్త ప్రాజెక్టు నడుపుతున్నది. మోదీ సర్కార్ రాఫెల్ విమానాల కొనుగోలు ఒప్పందంలో అనిల్ అంబానీ పాత్ర, అతగాడికి ఆ విమానాలను తయారు చేసే ఫ్రెంచి కంపెనీ దసాల్ట్‌తో విమానాల విడిభాగాల తయారీపేరుతో కుదిరిన ఒప్పందం గురించి తెలిసిందే. అంతకు ముందు అంబానీలు ఎన్నడూ ఆ రంగంలో లేరు. అనిల్ అంబానీ దివాలా ప్రకటించినపుడు 2019లో తనకు 75 కోట్ల డాలర్ల రుణ సేకరణకు సలహా ఇవ్వాలని ఎప్‌స్టెయిన్‌ను కోరినట్లు వెల్లడైంది. వీటి గురించి వివరణ కోరగా అంబానీ కంపెనీ నుంచి స్పందన లేదని మీడియాలో వార్తలు వచ్చాయి. రాజకీయ నేతలు, వాణిజ్య కంపెనీల యజమానుల సంబంధాలు గురించి ఈ ఉదంతం వెల్లడిస్తున్నది.

# కొత్త లేబర్ కోడ్‌లు అమలు సాధ్యమేనా?



ఎస్.బాల్‌రాజ్
ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
8074246685

కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ ఒకటి నుండి నాలుగు కొత్త లేబర్ కోడ్‌ల అమలుకు సంసిద్ధం అవుతున్నది. 1923 నుండి 1996 వరకు అనేక చారిత్రాత్మక పోరాటాలు, ఉద్యమాలు చేసి, సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి ఈ కార్మిక వ్యతిరేక కోడ్‌లను తెచ్చింది. నాటి రవి అస్తమించని సామ్రాజ్యవాది బ్రిటీష్ పాలకుల మెడలు వంచి, అదే విధంగా దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని, కార్మికులకు ప్రయోజనాలు కావాలని చేసిన పోరాటాలలో వేలాది కార్మికులను చిత్రహింసలకు గురిచేసిన, కాల్చిచంపినా వెనుకడుగు వేయని కార్మికవర్గం ఉద్యమాలు, పోరాటాలు చేసి, అమరుల త్యాగాల ఫలితంగా కార్మిక చట్టాలను సాధించుకుంది, స్వాతంత్ర్య దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక శాఖలపై, యాజమాన్యాలపై కార్మికులు చేసిన పోరాటాల ఫలితంగా, సమ్మెచేసే హక్కు, వేతనాలు, పి.ఎఫ్, ఇయస్‌ఐ, గ్రాట్యుటీ చట్టాలను సాధించుకొని అమలు చేయించుకుంటున్న కార్మికవర్గ గొప్ప పోరాటాల చరిత్ర సువర్ణ అక్షరాలతో లిఖించబడుతుంది.

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారానికి వచ్చి హిందుత్వ ఎజెండా, ఆలోచన విధానంతో పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు, బడా వ్యాపారస్తులకు మేలు చేస్తూ, వారి ఆస్తులు పెంచుకొనే విధంగా సహకరిస్తున్నది, 140 కోట్ల ప్రజలలో 60 కోట్ల మంది కార్మికులు, 30 కోట్ల రైతులు, 10 కోట్ల మంది పేద, మధ్య తరగతి ప్రజలు, అన్ని విద్యార్హతలు ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించకుండా ప్రజలకు, కార్మిక, రైతులకు వ్యతిరేకంగా మోడీ పాలన కొనసాగుతున్నది. భారతదేశాన్ని మతతత్వ ఎజెండాతో ముందుకు తీసుకోపోయే ఆలోచనతో మెజార్టీ ప్రజలకు వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం నిలబడుతున్నది.

కరోనా కాలంలో 2019–2020 సంవత్సరాలలో పార్లమెంట్‌లో ఎలాంటి చర్చ లేకుండా 4 లేబర్ కోడ్‌లకు ఆమోదం పొందింది. ఇప్పుడు మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను నోటిఫై చేసి ఏప్రిల్ ఒకటి నుండి అమలు చేస్తామని కార్మిక వర్గానికి సవాల్ చేస్తున్నది.

కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను అమలులో భాగంగా అందరికి కనీస వేతనాలు అమలు చేస్తామని చెబుతోంది. కాని 1948లో తెచ్చిన కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయకుండా, అన్ని రంగాలలో పనిచేస్తున్న కార్మికవర్గానికి కనీస వేతనాలు అమలు చేస్తామంటున్నది. కార్మికవర్గ పోరాటాన్ని గౌరవించి 4 లేబర్ కోడ్‌లను అమలు చేయకుండా, 29 చట్టాలను తు.చ. తప్పకుండా అమలు చేయాల్సిందిపోయి మోడీ కోడ్‌ల అమలుకై శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నది.

కార్మికవర్గాన్ని దోపిడీ చేసే కోడ్‌ల అమలులో భాగంగా, దేశంలోని 60 కోట్ల మంది కార్మికులకు వెంటనే అపాయింట్‌మెంట్ ఆర్డర్లు, నియామక పత్రాలు ఇవ్వాలి, కార్మిక సంఘాలు సమ్మెలు చేస్తూ డిమాండ్ చేస్తున్నా దున్నపోతుపై వర్షం పడ్డ చందంగా పాలక వర్గాలు వ్యవహరిస్తున్నాయి.

సంవత్సరానికి 180 రోజులు పనిచేస్తే జీతంతో కూడిన సెలవులు వర్తింపచేస్తామని కేంద్ర ప్రభుత్వం దగాకోరు మాటలు చెబుతున్నది.

యాజమాన్యాల దయా దాక్షిణ్యాలతో స్త్రీ కార్మికులు రాత్రిపూట 8 గంటల నుండి 12 గంటలు పనిచేయాలని నిబంధన పెట్టిన కోడ్‌లు ఎంతో దుర్మార్గమైనవి.

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చట్టాన్ని అమలు చేస్తూ స్త్రీ, పురుష కార్మికులకు వ్యత్యాసంలేని వేతనాలు చెల్లించలేని కేంద్ర ప్రభుత్వంతో కార్మికవర్గం పోరాడుతుంటే మాటలతో కాలం గడుపుతున్నది.

మహిళలకు 26వారాలు ప్రసూతి సెలవులు ఇవ్వాలన్న మోడీ తెస్తున్న కోడ్‌ల వలన యాజమాన్యాలు మహిళా కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వకుండా 6 నెలల వేతనం ఎగకొట్టేందుకు, మహిళా కార్మికురాలను పనినుండి తొలగించి, కొత్తవారిని నియమించుకుంటుంటే గుడ్లు అప్పగించి చూస్తుంది ప్రభుత్వం. మహిళలు పనిచేసే చోట పసి పిల్లలకు క్రెచ్‌సెంటర్లు పెట్టి మహిళా ఉద్యోగుల పిల్లలకు పాలు, గుడ్లు, పండ్లు, బలమైన పోషక ఆహారం అందిస్తూ మహిళా ఉద్యోగులతో పనిచేయించాలన్న బిజెపి పాలకులు గర్భిణితో ఉన్నప్పుడే పనినుండి తొలగించిన తర్వాత బాలల సంరక్షణ కేంద్రాలు శిశు సంరక్షణలేని ఆనాథ కేంద్రాలుగా మిగిలిపోతాయి తప్ప కేంద్ర ప్రభుత్వం ఏమీ చేయలేదు.

మహిళలు ఇంటి నుండి పనిచేసే అవకాశం అన్ని కోడ్‌లలో చేర్చారు. తెలంగాణాలో 8 లక్షల మంది బీడీ కార్మికులు, దేశవ్యాపితంగా 5 కోట్ల మంది బీడీ కార్మికులు పనిచేస్తుంటే నెలకు వెయ్యి రూపాయలు వేతనం రావటం లేదు. మహిళలు ఇంటి నుండి పనిచేసినా ఎటువంటి ప్రయోజనాలను కోడ్‌లలో కల్పించలేదు. ఇయస్‌ఐ, పిఎఫ్ చట్టాలు అమలు చేస్తున్నా, కనీస వేతనాల మాటేలేదు.

కార్మికులందరికి 8 గంటలకన్న ఎక్కువ గంటలు పనిచేసినా అదనపు వేతనాలు చెల్లించాలన్న నిబంధనలను అమలు చేసే స్థితిని ఏ ఒక్క కోడ్‌లో పొందుపర్చలేదు. అదే విధంగా కార్మికులకు బోనస్ చెల్లిస్తామని, ఒక సంవత్సరకాలం సర్వీస్ పూర్తిచేస్తే గ్రాట్యుటీ చెల్లిస్తామని, కార్మికులందరికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్న కోడ్‌లను కేంద్ర ప్రభుత్వమే అమలు చేయకపోతే ప్రైవేటు యాజమాన్యాలు అమలు చేస్తాయా కార్మికవర్గం ఆలోచించాలి.

కార్మికులందరికి ప్రతి సంవత్సరం తప్పనిసరిగా ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయడం, కార్మికులు అందరికీ ఇయస్‌ఐ పథకాన్ని అమలు చేసే బదులు అనేక ప్రయోజనాలు ఉన్న ఇయస్‌ఐ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ భవిష్యత్తులో ఇయస్‌ఐ హాస్పిటల్స్ ఎత్తివేస్తారు. ప్రైవేటీకరణకు ద్వారాలు తెరుస్తారు.

కార్మికవర్గం పోరాటాలు, ఉద్యమాలతో కార్మికుల నష్ట పరిహార చట్టం 1923, కార్మికులు యూనియన్‌లు పెట్టుకొనే హక్కు చట్టం 1926, వేతనాల చెల్లింపు చట్టం 1936, పారిశ్రామిక వివాదాల పరిష్కార చట్టం 1947, కనీస వేతనాల చెల్లింపు చట్టం 1948, ఫ్యాక్టరీల చట్టం 1948, కార్మిక రాజ్య బీమా ఇయస్‌ఐ చట్టం 1948, ప్రావిడెంట్ ఫండ్ చట్టం 1952, ప్రసూతి ప్రయోజనాల చట్టం 1961, బోనస్ చెల్లింపు చట్టం 1965, కాంట్రాక్టు కార్మికుల పర్మినెంట్ చేసే చట్టం 1970, గ్రాట్యుటీ చెల్లింపు చట్టం 1972, బాలకార్మిక నిషేధ చట్టం 1986, దుకాణాల ఉద్యోగులు సమగ్ర చట్టం 1988, ఉద్యోగుల పెన్షన్ పథకం 1995ను అమలు చేయుట, భవన నిర్మాణ మరియు ఇతర కార్మికుల సంక్షేమ చట్టం 1996, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయుట, స్త్రీ, పురుషులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించే, 1976 చట్టం, బీడీ, సిగార్స్ వర్కర్స్ సంక్షేమ సెస్సు చట్టం 1976, బీడీ వర్కర్స్ వెల్ఫేర్ ఫండ్ చట్టం 1976, వెట్టి నిర్మూలన చట్టం 1976, సినీ వర్కర్స్ మరియు సినిమా థియేటర్ వర్కర్స్ రెగ్యులరైజేషన్ యాక్ట్ 1981, కోల్‌మైన్స్, పి.ఎఫ్.చట్టం, గనుల పరిశ్రమల కార్మికుల పర్మినెంట్ 1948, ఎంప్లాయీస్ పెన్షన్ చట్టం 1995, ఇండస్ట్రియల్ ఎంప్లాయిమెంట్ స్టాండింగ్ ఆర్డర్ చట్టం 1946, వలస కార్మికుల చట్టం 1976, మెటర్నిటీ బెనిఫిట్స్ చట్టం 1961, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ చట్టం 1961, ప్లాంటేషన్ లేబర్ చట్టం 1951, సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయీస్ చట్టం 1976, వారంతపు సెలవుల చట్టం 1942, జర్నలిస్టుల మరియు ఉద్యోగుల చట్టం 1955 వంటి అనేక చట్టాలు కార్మికులు పోరాడి సాధించుకున్నవి. మోడీ బిజెపి ప్రభుత్వం 29 చట్టాలను సమూలంగా రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను తెచ్చింది. మోడీ సర్కార్ కార్మికవర్గ వ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెలో 40 కోట్ల మంది కార్మికులు, రైతులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని 10 కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు పిలుపిచ్చాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, సంఘటిత, అసంఘటితరంగ కార్మికులు పాల్గొని సమ్మెను విజయవంతంచేసి కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడుదాం.

ప్రజాపక్షం
Telugu National Daily


## గెలుపు దిశగా శైవిరెడ్డి ప్రచారం

**ప్రజాపక్షం/మక్తల్ :** గెలుపు దిశగా కాంగ్రెస్ అభ్యర్థి శైవి రెడ్డి సోమవారం తన మద్దతు దారులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మీ ఆడ బిడ్డగా వస్తున్న నన్ను ఆశీర్వదించండి అని 9వ వార్డు అభ్యర్థి శైవి రెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆశీస్సులతో 9వ వార్డులో విజయం సాధించడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అభ్యర్థి శైవిరెడ్డి మాట్లాడుతూ తాను నిత్యం 9వ వార్డు ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని. తనపై నమ్మకం ఉంచి ఓటర్లు ఆశీర్వదిస్తే, వార్డులోని ప్రతి సమస్యను పరిష్కరించి అభివృద్ధికి కృషి చేస్తానని అభ్యర్థి శైవిరెడ్డి హామీ ఇచ్చారు. అభ్యర్థి వెంట కాంగ్రెస్ 9వ వార్డ్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం/కృష్ణ :** నారాయణపేట జిల్లా కృష్ణ మండల వర్కింగ్ జర్నలిస్టుల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎనుకున్నారు. మండల కేంద్రంలోని క్షీరాలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో జర్నలిస్టులు సమావేశమై అధ్యక్షులు గురు ప్రసాద్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడిగా బి.దేవేంద్రప్ప, ఉపాధ్యక్షులుగా వి.సురేష్, సురేష్ సజ్జన్, ప్రధాన కార్యదర్శిగా టి.రమేష్, కార్యదర్శిగా చెన్నయ్య గౌడ్, కోశాధికారిగా నాగేంద్ర, మిగతా సభ్యులను కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన ప్రెస్‌క్లబ్ అధ్యక్షుని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ ఆ అధ్యక్షుడు బి.దేవేంద్రప్ప మాట్లాడుతూ అన్ని విధాలుగా అందరినీ కలుపుకొని నడుస్తున్నాని అన్నారు. తనను అధ్యక్షుడిగా ఎన్నిక చేసినందుకు అందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## 16.44 లీటర్ల మద్యం స్వాధీనం

టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/నారాయణపేట :** మున్సిపల్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో నారాయణపేట టౌన్ పరిధిలో పోలీసుల తనిఖీలలో పెరపాళ్ళ గ్రామానికి చెందిన సాయికుమార్ గౌడ్ అనే వ్యక్తి వద్ద నారాయణపేట పట్టణంలోని శాసనపల్లి రోడ్డులో అక్రమంగా తరలిస్తున్న 16.44 లీటర్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని అట్టి వ్యక్తిపై కేసు ననమోదు చేయడం జరిగిందని టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఎన్నికల సందర్భంగా అక్రమ మద్యం రవాణా, నిల్వలపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఉత్సాహభరితంగా ప్రచారం



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** మున్సిపల్ ఎన్నికల చివరి రోజున, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి నారాయణపేట పట్టణంలోని షాప్ టు షాప్ ప్రచారం నిర్వహించారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మాట్లాడి, దుకాణ యజమానులను పలకరించి బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వమని కోరారు. ప్రచారం ఉత్సాహభరితంగా, స్నేహపూర్వకంగా సాగి, స్థానికులు బీఆర్ఎస్ అభ్యర్థులకు ఘన మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ ఇంచార్జీగా విచ్చేసిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, జనగామ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, సీనియర్ నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ పైపులు లీకేజీ..



**ప్రజాపక్షం/శ్రీరంగాపూర్:** శ్రీరంగాపూర్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో జానంపేట వెళ్లే దారిలో మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజీ అయింది. నీరు వృధా అవుతుందని ప్రజలు వాపోతున్నారు. దీంతో పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మీద నీరు ఇలా తాగేది ఎలా అని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా ఈ సమస్య కొనసాగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించి లీకైన పైపులైను వెంటనే నిలిపివేసి ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## గ్రామ సమస్యలు పరిష్కరిస్తాం




**ప్రజాపక్షం/వంగూర్ :** గ్రామంలో ఏవార్డులోనైనా మౌలిక సమస్యలు ఉన్నట్లయితే వెంటనే పరిష్కరిస్తామని కొండారెడ్డిపల్లి సర్పంచ్ మల్లెపాకుల వెంకటయ్య అన్నారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఏచిన్న సమస్య ఉన్న గ్రామస్తులు వార్డు సభ్యుల దృష్టికి తీసుకొచ్చినట్లయితే పాలకవర్గం వెంటనే స్పందించి అట్టి సమస్యను పరిష్కరిస్తామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ బ్రహ్మాచారి, ఉపసర్పంచ్ వేమారెడ్డి, పంచాయతీ కార్యదర్శి కిషన్, వార్డు సభ్యులు చందు, కృష్ణ, దేవమ్మ, అనిత, మమత, గ్రామస్తులు రాఘవేందర్, వంశీ, శేఖర్, జంగయ్య, బాలరాజు, తిరుపతయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

### జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి భద్రతను

# ''మరింత బలోపేతం చేయాలి''

మీడియా అకాడమీ చైర్మన్‌కు జడ్చర్ల జర్నలిస్ట్ సంఘం వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో జడ్చర్ల జర్నలిస్ట్ సంఘం నాయకులు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా బస్ పాస్ సౌకర్యం కల్పించాలని, ప్రతి ప్రింట్ జర్నలిస్టుకు ల్యాప్‌టాప్, కెమెరా, వీడియో జర్నలిస్టులకు ల్యాప్‌టాప్‌తో పాటు వీడియో కెమెరాలను 100 శాతం సబ్సిడీపై అందించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే అక్రిడేషన్ కార్డును ఆధారంగా చేసుకొని అన్ని టోల్ గేట్లలో ఫ్రీ టోల్ సౌకర్యం కల్పించడంతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో జర్నలిస్టులకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టులు సమాజానికి సమాచార వారధిగా పనిచేస్తున్న నేపథ్యంలో వారి సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించాలని నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జడ్చర్ల నుంచి వచ్చే జర్నలిస్టులకు ప్రత్యేకంగా రెండు రోజుల శిక్షణా తరగతులు నిర్వహించి, పూర్తి స్థాయి సర్టిఫికెట్లు అందిస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల నైపుణ్యాభివృద్ధికి మీడియా అకాడమీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వడ్ల కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం.డి. సుల్తాన్, ఉపాధ్యక్షుడు శేఖర్ తెలుగు, సంయుక్త కార్యదర్శి మల్లేష్, సీనియర్ పాత్రికేయులు, ఇసి మెంబర్ తాంబూలం శ్రీనివాస్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



## స్వర ఝురి

**ప్రజాపక్షం/త్యాగరాయగానసభ :** భువన భాస్కర సంగీత సాహిత్య సేవా సమితి 109వ కార్యక్రమంలో భాగంగా పాడుతా తీయగా వాయిద్య కళాకారుల సహకారంతో వినూత్న భక్తి సినీ సంగీత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపల్లి భార్గవ్‌రామ్‌కు కవి గాయకరత్న, ప్రముఖ సంగీత గురువు శ్రీలత, రచయిత్రి అనురాధలకు అవార్డులను ప్రధానం చేయడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైకోర్టు సూపరింటెండెంట్ పివిపి అంజనీకుమారి విచ్చేశారు.

## రంజాన్ ఏర్పాట్లపై సమీక్ష

**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** రానున్న రంజాన్ మాసంలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చార్మినార్ జెడ్‌సీ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. జెడ్‌సీ కార్యాలయంలో ఆయన వివిధ విభాగాలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి రంజాన్ ఏర్పాట్లపై చర్చించారు. రంజాన్ నేపథ్యంలో ప్రార్థనా మందిరాలు, రద్దీ ప్రాంతాల్లో చెత్త సమస్య తలెత్తకుండా ఉండేలా ఐదు సర్కిళ్లలో 15 ప్రత్యేక బృందాలు ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. సమావేశంలో డీసీలు అలీ, మంగతాయారు, సుభాష్, సరిత, భాస్కర్‌రెడ్డి, ఎస్‌డబ్ల్యూఎం డీఈలు వెంకట్ రాజు, నవీన్‌కుమార్, రంజిత్‌రెడ్డి, శ్రీరాములు, రాంకీ సంస్థ జోనల్ ఇంచార్జి నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.




## రూపాయి విలువ పతనానికి దేశీయ పాలకవర్గాల విధానాలు కారణం

ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ డి.నరసింహారెడ్డి

**ప్రజాపక్షం/చిక్కడపల్లి :** రూపాయి విలువ పతనానికి అంతర్జాతీయ పరిణామాలతో పాటు దేశీయ పాలకవర్గాలు అనుసరిస్తున్న విధానాలు కారణమవుతున్నాయని ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ డి.నరసింహారెడ్డి ఆరోపించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపాయి విలువ పతనం, అమెరికా యుద్ధోన్మాద దాడులుప్రజలపై ప్రభావం అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ.... విదేశీ విద్య, టూరిజం వల్ల మన దేశీయ మారకద్రవ్యం ఎక్కువగా ఖర్చు అవుతుందని.. మనం కోల్పోతున్న సంపదను అమెరికా స్వంతం చేసుకుంటుందని తెలిపారు. దశాబ్దాలుగా యూనివర్సిటీలను, విద్యా విధానాన్ని నాశం చేసిన ప్రభుత్వ విధానాల ఫలితంగానే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. రూపాయి తగ్గడమే కాకుండా డాలర్ విలువ కూడా ప్రపంచ వ్యాప్తంగా తగ్గుతుందన్నారు. కార్యక్రమానికి తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు డా.వై.సుధీర్‌రెడ్డి అధ్యక్షత వహించగా.... కాకతీయ వర్సిటీ రిటైర్డ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ తోట జ్యోతిరాణి, ప్రజా రచయిత, కళాకారుడు భూపాల్, స్త్రీ విముక్తి సంఘటన ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా డా.ఆర్‌కే రచించిన చారిత్రక భౌతికవాదంఒక పరిచయం పుస్తకాన్ని ప్రముఖ చరిత్రకారులు, ప్రొఫెసర్ వకుళాభరణం రామకృష్ణ ఆవిష్కరించారు.

# పోలింగ్ ముగిసేదాక ప్రచారంపై నిషేధం



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకొని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని అనుసరిస్తూ జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్ పట్టణాలలో సోమవారం సాయంత్రం నుండి 5గంటల నుండి ప్రచార కార్యక్రమాలపై నిషేదం అమల్లోకి వస్తుందని, ఎన్నికలు ముగిసేంతవరకు ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. 48గంటల సైలెన్స్ పిరియడ్ సమయంలో పై పట్టణాలలో ఎవరు కూడా బహిరంగ ఎన్నికల ప్రచారం చేయరాదన్నారు. ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, ఎంసిసి బృందాలు, పోలీసు అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు.

**కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి**

ఈనెల 13న ఓట్ల లెక్కింపు సిబ్బంది విధులు నిర్వహించేందుకుగాను ర్యాండమైజేషన్ పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి బదావత్ సంతోష్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఎన్నికల పరిశీలకురాలు రాజ్యలక్ష్మి, అదనపు కలెక్టర్ దేవసహాయంలతో కలిసి కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్ మున్సిపాలిటిల పరిధిలోని 8బ్యాలెట్ ఈనెల 13న ఓట్ల లెక్కింపు సిబ్బంది విధులు నిర్వహించేందుకుగాను అవసరమైన సిబ్బందితో పాటు అదనంగా 20శాతం సిబ్బందిని రిజర్వులో ఉంచేవిధంగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియను పూర్తిచేసినట్లు తెలిపారు. నోడల్ అధికారి డిఇఓ రమేష్‌కుమార్, ఈడిఎం నరేష్ పాల్గొన్నారు.




## సమాచారం పొందడం ప్రతి ఒక్కరి హక్కు

ఆర్‌టిఐ కమిషనర్లు బోరెడ్డి అయోధ్యరెడ్డి, పివి.శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/చిక్కడపల్లి :** సమాచారం పొందడం ప్రతి ఒక్కరి హక్కు... సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆర్‌టీఐ కమిషనర్లు బోరెడ్డి అయోధ్యరెడ్డి, పీవీ శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం, అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం, పీపుల్స్ ఫ్రంట్ ఫర్ రైట్ టు ఇన్ఫర్మేషన్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన చర్చాగోష్టికి వారు ముఖ్యఅతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. యూపీఏ ప్రభుత్వ కాలంలో తెచ్చిన మంచి ప్రయోజనకర చట్టాలలో సమాచార హక్కు చట్టం ఒకటని తెలిపారు. ప్రభుత్వ పారదర్శకతను ప్రజానీకానికి తెలియచెప్పేందుకు ఆర్‌టీఐ బలమైన సాధనంగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో యూడీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఎం.శ్రీనివాస్, హెచ్‌సీఎఫ్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, హెచ్‌సీఎఫ్ ప్రధాన కార్యదర్శి కే.వీరయ్య, పీఎఫ్ఆర్ఐ కోశాధికారి బీజేఎం రెడ్డి, హెచ్‌సీఎఫ్ నాయకులు పీ.శ్రీనివాసరావు, మల్లం రమేష్, సంగీత, రాజమౌళి, సుకుమార్, గోపాల్, సైదులు, శంకరయ్య తదితరులు పాల్గొని ప్రసంగించారు.



## కాంగ్రెస్ విజయం ఖాయం

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

**ప్రజాపక్షం/కంటోన్మెంట్ :** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొని ప్రసంగించారు. గడచిన రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడం జరిగిందని వివరించారు. అభివృద్ధిని కాంక్షించే ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



## ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఉప్పల్ ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ప్రతినిధులు సోమవారం పరమేశ్వర్‌రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల్ ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన వేముల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పారేల్లి సాగర్. ఉపాధ్యక్షులు ఎవి.శ్రీధర్‌రావు, కూకుట్ల నరోత్తంరెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, జాయింట్ సెక్రటరీ దాస రాజుతో పాటు సీనియర్ జర్నలిస్టులు దొంతుల వెంకటరామిరెడ్డి, కొలనుపాక చంద్రమౌళి, పల్లా మహేందర్ రెడ్డి, కోడికంటి శ్రీనివాస్, ఎస్. ముత్యంరెడ్డి, ఓ.రమేష్, రాజులను ఆయన అభినందించారు. ఈసందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. పాత్రికేయులకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, నూతనంగా ఎన్నికైన ఉప్పల్ ప్రెస్‌క్లబ్ కమిటీకి తన వంతు సహాయక సహకారాలు ఉంటాయని పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

# సఫారీలకు భారీ విజయం

మర్క్‌రమ్, ఎంగిడి జోరుతో కెనడా కుదేలు..




గత సీజన్ రన్నరప్ దక్షిణాఫ్రికా పదో ఎడిషన్‌లో అదిరే బోణీ చేసింది. బ్యాటింగ్ యూనిట్ దంచేయగా.. బౌలింగ్ దళం కెనడాను వణికించింది. లుంగి ఎంగిడి(4–31) సంచలన స్పెల్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను బెంబేలెత్తించాడు. పవర్ ప్లేలోనే మూడు వికెట్లు పడినా.. నవనీత్ ధలివాల్(64) అర్ధ శతకంతో మెరవగా.. హర్ష్ ఠాకెర్(33) రాణించాడు. కానీ, సాధించాల్సిన రన్‌రేటు పెరిగిపోవడంతో పెద్ద షాట్లు ఆడబోయి టెయిలెండర్లు సైతం పెవిలియన్ చేరారు. దాంతో.. సఫారీ టీమ్ 57 పరుగుల తేడాతో గెలుపొంది ఘనంగా టోర్నీలో అడుగు పెట్టింది.

పొట్టి ప్రపంచకప్ ఆరంభ పోరులో దక్షిణాఫ్రికా అలవోక విజయంతో బోణీ కొట్టింది. అహ్మదాబాద్‌లో కెప్టెన్ ఎడెన్ మర్క్‌రమ్(54), ట్రిస్టన్ స్టబ్స్(34 నాటౌట్), డేవిడ్ మిల్లర్(39 నాటౌట్)ల మెరుపులతో 214 పరుగుల భారీ స్కోర్ బాదిన ప్రొటీస్ జట్టు.. ఆతర్వాత ప్రత్యర్థిని 156కే కట్టడి చేసింది. పేసర్ లుంగి ఎంగిడి(4–31) నిప్పులు చెరగగా కెనాడా బ్యాటర్లు చేతులెత్తేశారు. నవనీత్ ధలివాల్(64) హాఫ్ సెంచరీతో చెలరేగినా.. సహచరుల నుంచి స్పందన కరువవ్వడంతో సఫారీ జట్టు 57 పరుగులతో జయభేరి మోగించింది.

**తొలి బంతికే వికెట్**

భారీ ఛేదనలో కెనడా తొలి ఓవర్ మొదటి బంతికే వికెట్ కోల్పోయింది. ఎంగిడి(4–31) సంధించిన బంతిని ఆడాలా? వద్దా? అనే సందేహంతో టచ్ చేసిన కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా(0) వికెట్ కీపర్ డికాక్ చేతికి చిక్కాడు. ఆ తర్వాతి ఓవర్లో యువరాజ్ సమ్ర(12), నికోలస్ కిర్టన్(4)లను ఔట్ చేసిన ఎంగిడి కెనడాను కష్టాల్లోకి నెట్టాడు. పవర్ ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోయిన ప్రత్యర్థిని ఈసారి రబడ దెబ్బకొట్టాడు. భారీ షాట్లు ఆడుతున్న శ్రేయాస్ మొవ్వ(9) ను బౌల్డ్ చేసి నాలుగో వికెట్ అందించాడు.

టాపార్డర్ కుప్పకూలిన వేళ నవనీత్ ధలివాల్(64), హర్ష్ ఠాకెర్(33)లు జాగ్రత్తగా ఆడుతూ.. వీలుచిక్కినప్పుడల్లా బౌండరీలు బాది స్కోర్ వంద దాటించారు. కవర్స్‌పై బౌండరీ బాదిన హర్ష్ ఆ తర్వాత బంతికే బిగ్ షాట్ ఆడి ఔటవ్వగా.. ఐదో వికెట్ 69 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అర్ధ శతకం తర్వాత ధలివాల్ దూకుడుగా ఆడే క్రమంలో బాస్చ్ ఓవర్లో వెనుదిరిగాడు. ఆ తర్వాత ఆడేవాళ్లెవరూ లేకపోవడంతో కెనడా 156కే పరిమితమైంది. దాంతో.. 57 పరుగులతో గెలిచిన ప్రొటీస్ జట్టు వరల్డ్‌ప్ వేటను ఘనంగా ఆరంభించింది.

టాస్ గెలిచిన కెనడా బ్యాటింగ్ బదులు బౌలింగ్ ఎంచుకొని అందర్నీ ఆశ్చర్యపరిచింది. బలమైన బ్యాటింగ్ లైనప్ కలిగిన దక్షిణాఫ్రికాను తక్కువకే కట్టడి చేయాలనుకున్న ఆ జట్టు ఆశలు ఆడియాశలయ్యాయి. ఓపెనర్ ఎడెన్ మర్క్‌రమ్ (59).. క్వింటన్ డికాక్(25)లు కెనడా బౌలర్లను అలవోకగా ఎదుర్కొంటూ ధనాధన్ ఆడారు. డికాక్‌ను బౌల్డ్ చేసిన దిల్‌ప్రీత్ బజ్వా తొలి వికెట్‌కు 70 పరుగులు జోడించి పునాది వేసిన ఈ ద్వయాన్ని విడదీశాడు. మర్క్‌రమ్ దూకుడుగా ఆడి 28 బంతుల్లోనే అర్ధ శతకం అందుకున్నాడు. కానీ, కాసేపటికే అతడు అన్ష్ పటేల్ ఓవర్లో ఔటయ్యాడు. అనంతరం డెవాల్డ్ బ్రవిస్(6) విఫలమైనా.. రియాన్ రికెల్టన్(33).. 3 ఫోర్లు, ఒక సిక్సర్‌తో చెలరేగాడు. ట్రిస్టన్ స్టబ్స్(34 నాటౌట్), డేవిడ్ మిల్లర్(39 నాటౌట్)లు డెత్ ఓవర్లలో బౌండరీలతో చెలరేగి స్కోర్ బోర్డును ఉరికించారు. ఫలితంగా సఫారీ జట్టు నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది.



## ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

నల్లగొండ ఎంపి రఘువీర్ రెడ్డి

**ప్రజాపక్షం/హాలియా:** హాలియా మున్సిపాలిటీ రాష్ట్రంలోనే అత్యుత్తమమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం హాలియా మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ నా జన్మ స్థలమైన హాలియా దినదినాభివృద్ధి చెందుతూ మున్సిపాలిటీగా అవతరించిందని చెప్పారు. ప్రస్తుతం నేను నా తమ్ముడు సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి కలిసి హాలియాను రాష్ట్రంలోనే అత్యుత్తమమైన మున్సిపాలిటీగా తీర్చి దిద్దేందుకు ప్రణాళికలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు అందరినీ భారీ మెజార్టీతో గెలిపించి హాలియాను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు తమకు వారదులను అందించాలని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన కొన్ని తప్పిదాల వలన ఈప్రాంతం కొంత వెనుకబాటు స్థానానికి గురి అయిందని తెలిపారు. ఈకార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి కొండేటి మల్లయ్య,ఒకటో వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గౌని రాజా రమేష్ యాదవ్, మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి,కాకునూరు నారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ధనమ్మశ్రీనివాస్ గెలుపు అభివృద్ధికి మలుపు



**ప్రజాపక్షం/చండూరు:** సిపిఐ అభ్యర్థి జెల్లా ధనమ్మశ్రీనివాస్ గెలుపు అభివృద్ధికి మలుపు అని ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్ అన్నారు. చండూరు మున్సిపాలిటీలోని 4వ వార్డు అభ్యర్థి కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సిపిఐ అభ్యర్థి జెల్లా ధనమ్మశ్రీనివాస్ గెలుపును కాంక్షిస్తూ సోమవారం నెర్లకంటి శ్రీకాంత్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సిపిఐ అభ్యర్థి జెల్లా ధనమ్మశ్రీనవాస్ కంకి కొడవలి గుర్తుపై అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లును కోరారు. 4వ వార్డులో జెల్లా ధనమ్మ గెలిపించుకుంటే అధికార కాంగ్రెస్ తో వార్డు అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని అన్నారు. వార్డులో ఉన్న డ్రైనేజీ , సిసి రోడ్లు ,ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు వంటి సమస్యలు పరిష్కారమవుతాయని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ , ఏఐవైఎఫ్ రాష్ట్ర నాయకుడు మాదగోని అరుణ్ గౌడ్, దోటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు ఓటేస్తే గోసపడుతాం

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటువేస్తే మరింత గోసపడుతామని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. మాజీ సిఎం కెసిఆర్ అన్నట్లుగా మళ్ళీ 2014కు ముందు రోజులు వచ్చాయన్నారు. రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో మీకెమి లాభం జరిగిందో ప్రజలు ఆలోచించాలన్నారు. సోమవారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సూర్యాపేట పట్టణంలో బిఆర్ఎస్ భారీ రోడ్డుషో నిర్వహించింది. అనంతరం కొత్తబస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన వేదికపై ఆయన ప్రజలనుద్ధేశించి ప్రసంగించారు. సిఎం రేవంత్ రెడ్డి ఆయన మంత్రి వర్గమంతా దోచుకునే పనిలో పడ్డారన్నారు. మంత్రుల మధ్య, సిఎం మధ్య సఖ్యత లేక ఒకరి బండారం ఒకరు భయటపెట్టుకుంటున్నారని అన్నారు. వీరి మధ్య పంపకాల పంచాయితీ కాదు రాసలీలల పంచాయితీలు పెట్టుకోవడం మరీ నీచమన్నారు. ఐఏఎస్, ఐపిఎస్ స్థాయి అధికారులపై కూడా అబండాలు వేస్తున్నారని పేర్కొన్నారు. గత పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో సూర్యాపేట పట్టణానికి వేల కోట్ల రూపాయలు తెచ్చి అభివృద్ధి పనులు చేశానని గుర్తు చేశారు. సూర్యాపేటకు మంజూరైన నిధులు వెనక్కి పంపిన దుర్మార్గం కాంగ్రెస్‌దన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి ఇస్లావత్ రాంచంద్రనాయక్‌తోపాటు ఆ పార్టీకి చెందిన పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులు పాల్గొన్నారు.

## సాయి శ్రీ ని గెలిపిస్తే డివిజన్ అభివృద్ధి

**ప్రజాపక్షం/నలగొండ టౌన్:** 42వ డివిజన్ కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థిగా పబ్బు సాయిశ్రీ సందీప్‌ని గెలిపిస్తే డివిజన్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి అన్నారు.నల్లగొండ మున్సిపాలిటీ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, సిపిఐ పొత్తులో భాగంగా సోమవారం చివరి రోజు పట్టణంలోని 42వ డివిజన్‌లో కాంగ్రెస్ కార్పొరేటర్ అభ్యర్థి పబ్బు సాయి శ్రీ సందీప్ గెలుపు కోసం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి సంపూర్ణ మద్దతు ఇచ్చి ఇంటింటి ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ కి ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.ఈసందర్భంగా వీరస్వామి మాట్లాడుతూ నల్లగొండ మున్సిపల్ కార్పొరేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ సిపిఐ పొత్తులో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించడం జరిగిందని ఈసందర్భంగా ప్రజల నుండి మంచి స్పందన వచ్చిందని తెలిపారు.ఈడివిజన్ ప్రజలు సాయి శ్రీ కి అవకాశం ఇచ్చి గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఐ నాయకులు ముండ్ల ముత్యాలు,పాణెం వెంకట్రావు,నల్ల నరసింహ,కృష్ణ య్య ఎమ్మార్పీఎస్ నాయకులు కత్తుల తులసిదాసు,సైదులు,టి.గిరి,కత్తుల మారయ్య,సముద్రాల రాజు,విషాని, ఆదమ్మ పూలమ్మ,రజిత తదితరులు పాల్గొన్నారు.



# హుజూర్‌నగర్ అత్యద్భుతంగా అభివృద్ధి చేస్తా

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు





**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 11 జరగనున్న మున్సిపల్, కార్పోరేషన్ ఎన్నికలలో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం జరుగుతుందని, హుజూర్‌నగర్ మున్సిపాలిటీలోని 28 వార్డులలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవనున్నారని హుజూర్‌నగర్ మున్సిపాలిటీని అత్యద్భుతంగా అభివృద్ధి చేస్తానని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న రెండవ మున్సిపల్ సాధారణ ఎన్నికలలో భాగంగా సోమవారం హుజూర్‌నగర్ లోని 5వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థిని యరగాని సుష్మ మురళిని, 6వ వార్డులో సుత్తికొడవలి నక్షత్రం గుర్తుపై పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి శీలం నాగమణి శ్రీను, 10, 17 వార్డులో కంకి కొడవలి గుర్తుపై పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థులను, హస్తం గుర్తుపై పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని మంత్రి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హుజూర్‌నగర్ మున్సిపాలిటిలో మిత్ర పక్షాలైన సిపిఐ, సిపిఎం కాంగ్రెస్ పార్టీల గుర్తులపై పోటీ చేస్తున్న అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి తమ వార్డుల అభ్యున్నతికై తోడ్పడాలని అన్నారు. హుజూర్‌నగర్ మున్సిపాలిటి పరిధిలో మంత్రి ఉత్తమ్ చేసిన అభివృద్ధిని వివరిస్తూ హుజూర్‌నగర్ మున్సిపల్ పరిధిలోగల అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పట్టణ శివారులో ఉన్న రామస్వామి గుట్టపై నిర్మిస్తున్న ఇందిర మోడల్ కాలనీలోని ఇళ్లను త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, డిసిసి ఉపాధ్యక్షులు ఎస్‌కె మన్సూర్ అలీ, కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం పార్టీల నాయకులు, పాల్గొన్నారు.

### కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలి

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణ సమగ్ర అభివృద్ధికి 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌అభ్యర్థులను గెలిపించాలని భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటి పరిధిలోని 13, 24, 25 వార్డుల అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే తాను కోట్లాది రూపాయల నిధులతో పట్టణాన్ని అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. ఈ మూడు వార్డులలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, మంజూరు చేస్తానని భరోసా ఇచ్చారు. 13వ వార్డులో లోవోల్టేజీ విద్యుత్ సమస్యను, మంచినీటి సమస్యను తీరుస్తానని అన్నారు. అలాగే కోదాడలోని ఎర్రకుంట చెరువుకు ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. గ్రీన్ ట్రిబ్యునల్ కింద ఒక ఇల్లు కూడా తొలగించరని, మంత్రిగా తాను హామీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌జానీ, అంబటికర్ర శ్రీనివాస్, కందరబోయిన వీరస్వామి, మైసా రాంబాబు, వేలాద్రి, బాలిరెడ్డి, సుందరి వెంకటేశ్వర్లు, గురుమూర్తి, నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

**ప్రజాపక్షం/చింతపల్లి :** ప్రజల సహకారంతో గ్రామాభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తానని, గ్రామ అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని ధైర్యపురి తండా గ్రామ సర్పంచ్ వాంకుడోత్ అనితదాసు అన్నారు. మండల పరిధిలోని ధైర్యపురి తండా గ్రామంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన గ్రామ ప్రజలు పలు సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో అండర్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని, రోడ్డుపై ఉన్న ర్యాంపులను తొలగించాలని వివరించారు. గ్రామంలో మంచినీటి సమస్య లేకుండా చూడాలని, అదే విధంగా నూతన గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించాలని పలు సమస్యలను గ్రామసభ దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనితదాసు మాట్లాడుతూ త్వరలో గ్రామపంచాయతీ నూతన భవనాన్ని నిర్మించుకొనుటకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పద్మ, ఉప సర్పంచ్ చందర్‌నాయక్, మాజీ సర్పంచ్‌లు బిచ్చ నాయక్, బాల్‌సింగ్ వార్డు సభ్యులు షాహెదా, శంకర్, వెంకటయ్య, జ్యోతి, జాంప, సంతోష్, రమేష్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# నల్లగొండ అభివృద్ధే నా ధ్యేయం...

అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి రోడ్ షో



**ప్రజాపక్షం/నలగొండ :** నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే డివిజన్‌లను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన ప్రధాన ధ్యేయమని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల 14,15,16,17,3 డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మంత్రి రోడ్ షో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో ఇంకా మిగిలి ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ,సీసీ రోడ్డును పూర్తి చేయడంతో పాటు సమస్యలు లేని కాలనీలుగా తీర్చిదిద్దారని అన్నారు.డివిజన్‌లో ప్రతి కాలనీకి 24 గంటలు తాగునీరు వచ్చే విధంగా ఇప్పటికే చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు.నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతుందని మరోసారి స్పష్టం చేశారు. ఇతర పార్టీకి చెందిన అభ్యర్థులు గెలిస్తే వారితో ఎలాంటి ప్రయోజనం ఉండదని చర్లపల్లి,ఆర్జాల బావి,పాతపల్లె, శేషమ్మ గూడెం గ్రామాలలో ఎలాంటి సమస్యలు ఉన్న వాటన్నింటినీ పరిష్కరించే బాధ్యత నాదేనని హామీ ఇచ్చారు.ఈ ప్రచార కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, తిప్పర్తి మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి,డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్ పాల్గొన్నారు.



## మమత జ్యోతిబసును గెలిపించండి

**ప్రజాపక్షం/దేవరకొండ:** ఎన్నికలప్పుడు మాత్రమే ప్రజల వద్దకు వచ్చి ఓట్లు అడిగే వ్యాపారులకు కాకుండా నిత్యం ప్రజల్లో ఉండే సిపిఐ 10వ వార్డు అభ్యర్థి జూలూరు మమత జ్యోతిబసు కంకి కొడవలి గుర్తుపై ఓటేసి గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం 10వ వార్డు లో అభ్యర్థి మమత జ్యోతిబసు తో పాటు పార్టీ శ్రేణులతో కలిసి ముమ్మర ప్రచారం నిర్వహించి ప్రశ్నించే గొంతుక సిపిఐ అభ్యర్థి మమత జ్యోతిబసును కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడు ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, సహాయ కార్యదర్శులు జ్యోతిబసు, నగేష్, శివకుమార్, గిరిప్రసాద్, మల్లయ్య, శంశోద్దీన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిపిఐ మద్దతు

సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక, కార్పోరేట్ అనుకూల విధానాలను అవలంభిస్తున్న మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం 2025, విబిజిరామ్‌జీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్‌బిసిలో 100శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతించడం లాంటి ప్రజావ్యతిరేక విధానాలను ఉపసంహరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర కార్మిక సంఘాలు ఈనెల 12న జరుప తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిపిఐ పార్టీ సంపూర్ణ మద్దతును తెలియజేస్తుందన్నారు. జిల్లాలో కార్మికులు, ప్రజాసంఘాలు ఈ సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి, యాజమాన్యాలకు లాభం చేకూర్చేలా ప్రమాదకరమైన 4 లేబర్ కోడ్లను తెచ్చిందన్నారు. వీటి వల్ల కార్మికులు ఈఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటి, పెన్షన్ వంటి సామాజిక భద్రతకు దూరమవుతారన్నారు. ఉద్యోగ భద్రత ఉండదన్నారు. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో కార్మికుల పనిగంటలు పెంచుతూ చట్ట సవరణ జరిగిందని చెప్పారు. వీబీజిరామ్‌జీ చట్టం తెచ్చి కేంద్రం తన బాధ్యతల నుండి తప్పుకుంటుందని అన్నారు. బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గింపు, పని రోజులు తగ్గిస్తోందని తెలిపారు. విద్యుత్ సవరణ బిల్లు వల్ల సామాన్యులకు విద్యుత్ చార్జీలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, నాయకులు చామల అశోక్ కుమార్, అనంతుల మల్లేశ్వరి, బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్, దేశగాని హేమలత పాల్గొన్నారు.

## అధికార పార్టీ అభ్యర్థులనే గెలిపించాలి

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** మున్సిపాలిటీ అన్ని రకాలుగా అభివృద్ధిలో అందలం ఎక్కాలంటే అధికార కాంగ్రెస్ పార్టీ బలపరిచిన చైర్మన్ కౌన్సిలర్ అభ్యర్థుల చేయి గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. సోమవారం ఆయన పోచంపల్లి మున్సిపాలిటీలో సుడిగాలి ప్రచారం చేశారు. పోచంపల్లికి కావలసిన అత్యవసర సమగ్ర అభివృద్ధి కొనసాగాలంటే 13 వార్డుల అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి చైర్మన్ పీఠం కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 6వ వార్డు అభ్యర్థి గంజి జయమ్మ గణేష్, 7వ వార్డు అభ్యర్థి మంగళపల్లి లావణ్య రమేశ్‌లతో అన్ని సీట్లను గెలిచి క్లీన్ స్వీప్ చేయాలని ఓటర్లను ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో ఆయన వెంట చైర్మన్ అభ్యర్థి తడక వెంకటేశ్వర్లు, టౌన్ అధ్యక్షులు భారత లవ కుమార్, మండల అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, పోచంపల్లి బ్యాంకు చైర్మన్ రమేష్ పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో 'పైళ్ల' మార్క్ పాలిటిక్స్





**ప్రజాపక్షం/యాదాద్రి :** రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతున్న భువనగిరి, పోచంపల్లి మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ రెండు మున్సిపాలిటీలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ సీనియర్ నేత పైళ్ల శేఖర్ రెడ్డి సారథ్యంలో గులాబీ దళం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. అభ్యర్థుల ఎంపిక నుంచి క్షేత్రస్థాయి ప్రచారం వరకు అన్నీ తానై వ్యవహరిస్తూ, పార్టీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ఆయన చేస్తున్న వ్యూహరచనలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. భువనగిరి నియోజకవర్గ గడ్డపై గులాబీ జెండాను రెపరెపలాడించేందుకు శేఖర్ రెడ్డి 'డబుల్ ఇంజన్' వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. కేవలం బిఆర్ఎస్ బలంపైనే కాకుండా, సిపిఐ, సిపిఐఎం ని కలుపుకొని కూటమిగా ఏర్పడి అధికార పార్టీ కాంగ్రెస్ కు దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు. గత తొమ్మిదేళ్లలో చేసిన అద్భుత అభివృద్ధిని ఆయుధాలుగా చేసుకుని శేఖర్ రెడ్డి కాంగ్రెస్కు సవాల్ విసురుతున్నారు.

**క్షేత్రస్థాయిలో 'పైళ్ల' వ్యూహరచన :** భువనగిరిలోని 35 వార్డులు, పోచంపల్లిలోని 13 వార్డుల్లో కూటమి అభ్యర్థులను గెలిపించే బాధ్యతను శేఖర్ రెడ్డి తన భుజస్కందాలపై వేసుకున్నారు. కాంగ్రెస్ ఎత్తులను చిత్తు చేస్తూ, గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భువనగిరి పోచంపల్లి పట్టణాల్లో చేసిన అభివృద్ధిని, ఇంటింటికి అందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఆయన ప్రచారంలో దూసుకుపోతున్నారు.

**చతురతతో కూడిన రాజకీయ వ్యూహం:**

**సీపీఐ, సీపీఎంలతో పొత్తు**

పైళ్ల శేఖర్ రెడ్డి కేవలం అభివృద్ధిపైనే కాకుండా, క్షేత్రస్థాయి రాజకీయ సమీకరణాలను చక్కదిద్దడంలోనూ తన మార్క్ చూపించారు. సీపీఐ, సీపీఎం పార్టీలతో పొత్తు పెట్టుకుని, ఉమ్మడి శక్తితో ఎన్నికల బరిలోకి దిగారు. వామపక్షాల మద్దతుతో క్షేత్రస్థాయిలో క్యాడర్ను ఏకం చేస్తూ, ఓట్ల చీలనివ్వకుండా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఈ కూటమి కలయిక బిఆర్ఎస్కు భారీ ప్లస్ పాయింట్గా మారింది.

**హోరాహోరీ పోరు -కాంగ్రెస్ ఉక్కిరిబిక్కిరి :** భువనగిరిలోని 35 వార్డులు, పోచంపల్లిలోని 13 వార్డుల్లో ప్రతి ఓటరును స్వయంగా కలుస్తూ ప్రచార హోరును పెంచారు. పైళ్ల శేఖర్ రెడ్డి దూకుడును తట్టుకోలేక అధికార కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలను, ముఖ్యంగా మంత్రి సీతక్క వంటి వారిని ప్రచారానికి రప్పించాల్సి వచ్చింది. ఇది పైళ్ల సృష్టించిన రాజకీయ ఒత్తిడికి నిదర్శనంగా కనిపిస్తోంది.

# వేధింపులు ఎక్కువై... బతుకు భారమై

తనతోపాటు, తను కన్న బిడ్డలపై డీజిల్ పోసి నిప్పంటించిన గృహిణి

మంటలు అంటుకొని గృహిణి, చిన్నారులకు తీవ్ర గాయాలు





**ప్రజాపక్షం/చింతపల్లి :** అత్తవారింటి వరకట్న వేధింపులతోపాటు శారీరక, మానసిక వేధింపులు తాళలేక ఓ గృహిణి డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతోపాటు, ఆమే కన్న బిడ్డలపై డీజిల్ పోసి నిప్పంటించిన హృదయవిదారక సంఘటన మండల పరిధిలోని హోమంతాలపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికి ఎస్ఐ ఎమ్ రామ్మూర్తి, బాధితురాలి బంధువుల తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని తక్కళ్ళపల్లి గ్రామానికి చెందిన గొడ్డటి లాలయ్య కుమార్తె శిరీషను హోమంతాలపల్లి గ్రామానికి చెందిన జబ్బు లక్ష్మయ్య పెద్ద కుమారుడైన జబ్బు శీనయ్యకు గత నాలుగు సంవత్సారాల క్రితం ఇచ్చి వివాహం చేయటం జరిగింది. కాల క్రమేనా శిరీష, శీనయ్య దంపతులకు రెండున్నర సంవత్సరాల మగబిడ్డ చర్రి, ఏడు నెలల ఆడబిడ్డ పప్పి సంతానం కలిగారు. వివాహ సమయంలో అనుకున్నంతా కట్నం శీనయ్యకు అప్పజెప్పటం జరిగింది. అయినా సంతృప్తి చెందని శీనయ్యతోపాటు అతని కుటుంబ సభ్యులు పలుమార్లు అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని శిరీష తన తండ్రికి తెలపగా, ఆయన నచ్చజెప్పి అత్తారింటికి పంపడం జరిగిందని ఆమె తండ్రి తెలిపారు. అయినప్పటికీ భర్త కుటుంబ సభ్యుల వేధింపులు తారాస్థాయికి చేరడంతో బాధ భరించలేని శిరీష సోమవారం ఉదయం తన ఇంటి ముందు ట్రాక్టర్‌లో డీజిల్ తీసి తనపై పోసుకోవడంతోపాటు, తన బిడ్డలయిన చర్రి, పప్పిలపై డీజిల్ పోసి నిప్పంటించింది. మంటలు తాలలేక తల్లి, చిన్నారులు తీవ్రంగా అరవడంతో చుట్టుపక్కల వారు గమనించి మంటలు ఆర్పి, వారిని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శిరీషతోపాటు చిన్నారులకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులోని ఓ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. బాధితురాలి భర్త శీనయ్య, అత్తమామా, మరిది, ఆడబిడ్డలపై శిరీష తండ్రి గొడ్డటి లాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

# భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌పై ఉత్కంఠ..

## ఐసిసి చెప్పినట్టే వింటామని బిసిసిఐ వెల్లడి !



పొట్టి ప్రపంచకప్‌లో భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌పై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. ఇండియాతో మ్యాచ్‌ను బాయకాట్ చేస్తామని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ప్రకటించడంతో ఫిబ్రవరి 15న హై ఓల్టేజ్ మ్యాచ్ ఉంటుందా? ఉండదా? అని కోట్లాది మంది చర్చించుకుంటున్నారు. ఇప్పటికే పాక్ బోర్డుకు శ్రీలంక క్రికెట్ ఈ–మెయిల్ పంపగా.. ఐసిసి ప్రతినిధి సైతం మంతనాలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో ఇండో–పాక్ మ్యాచ్‌పై భారత క్రికెట్ నియంత్రణ మండలి తమ నిర్ణయాన్ని వెల్లడించింది. ఐసిసి, ఆసియా క్రికెట్ మండలి ఈవెంట్లలోనే తలపడుతున్న భారత్, పాకిస్థాన్ జట్లు టి–20 వరల్డ్ కప్‌లో ఢీకొనడంపై అనిశ్చితి కొనసాగుతోంది. మూడు డిమాండ్లకు అంగీకరిస్తేనే ఇండియాతో ఆడుతామని ఐసిసికి పాక్ బోర్డు స్పష్టం చేసినందున.. ఐసిసి నిర్ణయం కోసం అందరూ ఎదురు చూస్తున్నారు. ఈ విషయంలో బిసిసిఐ మాత్రం స్పష్టతతో ఉంది. ఫిబ్రవరి 15న భారత జట్టు కొలంబో వెళ్తుందని ఇదివరకే ప్రకటించిన బిసిసిఐ.. తాజా పరిణామాలపై స్పందించింది. ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా సోమవారం మాట్లాడుతూ తాము ఐసిసి నిర్ణయానికి కట్టుబడి ఉంటామన్నాడు. 'లీగ్ దశలో ఫిబ్రవరి 15న కొలంబోలో జరగాల్సిన మ్యాచ్‌పై నేను ఇదివరకే స్పందించాను. ఐసిసి తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా మేము నడుచుకుంటాం. ఈ విషయంలో బిసిసిఐ చెప్పాల్సింది, చేయాల్సిందేమీ లేదు' అని పార్లమెంట్ ప్రాంగణంలో రాజీవ్‌శుక్లా మీడియాతో తెలిపాడు. బాయ్‌కాట్ వార్తలపై ఇటీవలే కెప్టెన్ సూర్యకుమార్‌యాదవ్ సైతం మీడియా సమావేశంలో మాట్లాడాడు. 'ఫిబ్రవరి 15న కొలంబో వెళ్తున్నాం. ఆ రోజుకు ఫ్లైట్‌బుక్ చేసుకున్నాం. మ్యాచ్ ఆడమని వారే(పాక్ బోర్డు) అన్నారు. మేము ఆడేందుకు సిద్ధంగాఉన్నాం' అని వెల్లడించాడు. అంతకుముందు సైకియా స్పందిస్తూ.. ఫిబ్రవరి 15న భారత జట్టు కొలంబో వెళ్తుంది. మ్యాచ్ సమయానికి ఆటగాళ్లంతా స్టేడియం చేరుకుంటారు. మ్యాచ్ రద్దయిందని రిఫరీ ప్రకటించాకే టీమిండియా బృందం స్వదేశానికి బయల్దేరుతుంది' అని పేర్కొన్నాడు.

### మ్యాచ్ ఆడేందుకు పాకిస్థాన్ మూడు షరతులు

టి–20 వరల్డ్ కప్‌లో ఇండియాతో ఫిబ్రవరి 15వ తేదీన జరగనున్న మ్యాచ్ ఆడబోమని పాకిస్థాన్ చెప్పిన విషయం తెలిసిందే. అయితే ఆ మ్యాచ్‌ను నిర్వహించేందుకు ఐసిసి తమ వంతు ప్రయత్నం చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఇద్దరు సభ్యుల బృందం పాకిస్థాన్ వెళ్లింది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చైర్మన్ మోషిన్ నఖ్వీతో చర్చలు నిర్వహించారు. భారత్‌తో మ్యాచ్ ఆడేందుకు మూడు కీలక షరతులు పాకిస్థాన్ పెట్టినట్లు తెలుస్తోంది. ఓ మీడియా కథనం ప్రకారం ఆ షరతులు ఇలా ఉన్నాయి. పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు వార్షిక నిధులను ఐసిసి పెంచాలని కోరింది. ఇక ఇండియా, భారత్ మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లను పునరుద్ధరించాలని ఐసిసిని అభ్యర్థించింది. అయితే ఇండియా, పాక్ మధ్య మ్యాచ్ జరుగుతున్న సమయంలో.. ఆటగాళ్లు ఆన్‌ఫీల్ ఎథిక్స్ పాటించాలని, ప్లేయర్లు అందరూ షేక్ హ్యాండ్ ఇచ్చుకోవాలని పాక్ క్రికెట్ బోర్డు ఐసిసిని కోరినట్లు తెలుస్తోంది. ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను కలిసిన తర్వాత తుది నిర్ణయం వెల్లడించనున్నట్లు నఖ్వీ తెలిపారు.

# తొలి మ్యాచ్‌లో జింబాబ్వే పంజా



పొట్టి ప్రపంచకప్ జింబాబ్వే తొలి అడుగు ఘనం గా వేసింది. కొలంబోలోని సిన్హలీస్ స్పోరట్స్ క్లబ్లో ఆల్‌రౌండ్ షోతో అదరగొడుతూ.. ఒమన్‌పై 8 వికెట్లతో గెలుపొందింది. తొలుత బ్లెస్సింగ్ ముజరబని(316), బ్రాడ్ ఎవాన్స్(318), రిచర్డ్ ఎగర్వ(317)లు వికెట్ల వేటతో 103కే ప్రత్యర్థిని పడగొట్టిన జింబాబ్వే.. స్వల్ప లక్ష్యాన్ని ఆడుతూపాడుతూ ఛేదించింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్(48 నాటౌట్), బ్రెండన్ టేబెండన్ రిటైర్డ్ హర్ట్) మెరుపులతో 13.3 ఓవర్లోనే మ్యాచ్‌ను ముగించింది. గ్రూప్–బిలోని జింబాబ్వే లీగ్ దశ తొలిపోరులో పంజా విసిరింది. పసికూన ఒమన్ జట్టును వణికిస్తూ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మొదట బంతితో, ఆపై బ్యాటుతో రఫ్ఫాడించిన జింబాబ్వే.. 13.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని అందుకుంది. బ్యాటర్లు విఫలమవ్వగా.. ఒమన్ బౌలర్లు సైతం తేలిపోయారు. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ (48 నాటౌట్) ధనాధన్ ఆటతో విరుచుకుపడగా.. లక్ష్యం కరుగుతూ పోయింది. ఓపెనర్ తడివనషే మరుమని(21)ను ఔట్ చేసిన సూఫియన్ తొలి వికెట్ అందించాడు. డియాన్ మేయర్స్(0) డకౌట్ కాగా.. సీనియర్ ప్లేయర్ బ్రెండన్ టేబెండన్ రిటైర్డ్ హర్ట్) తోడుగా బెన్నెట్ చెలరేగాడు. చిన్న లక్ష్యాన్ని మరో 39 బంతులుండగానే ఉఫ్మనిపించిన జింబాబ్వే రెండు పాయింట్లతో పాటు మెరుగైన రన్‌రేటు(+2.702) సాధించింది. ఆరంభంలోనే ఒమన్ను దెబ్బకొట్టి.. జట్టు విజయంలో కీలకమైన ముజరబని ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్గా ఎంపికయ్యాడు. కొలంబోలో బ్లెస్సింగ్ ముజరబని(316), రిచర్డ్ నగవర(317)లు టాప్ ఆర్డర్‌ను పడగొట్టగా ఒమన్ ఆటగాళ్లు క్రీజులో నిలిచేందుకు అపసోపాలు పడ్డారు. డెత్ ఓవర్లలో బ్రాడ్ ఎవాన్స్(318) రెచ్చిపోయాడు. శుభారంభం లభించకపోయినా.. సూఫియన్ మొహమూద్(25), వినాకయక్ శుక్లా(28)లు పట్టుదలతో ఆడి పరువు కాపాడారు. చివరలో నదీమ్ ఖాన్(20) బ్యాట్ ఝులిపించాడు. కానీ, ఎవాన్స్ ఓవర్లో షకీల్ అహ్మద్ బౌల్ కావడంతో 103కే ఒమన్ ఆలౌటయ్యింది. ప్రపంచకప్‌లో జింబాబ్వేపై ఏ జట్టుకైనా ఇదే అత్యల్ప స్కోర్.

## యువతరంగం

# అమల్లో చిత్తశుద్ధి కరవు!

కేంద్ర ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించే పథకాలు.. చేపట్టే ప్రాజెక్టులు ఆచరణలో విఫలమవుతున్నాయన్న విమర్శల్లో నిజం లేకపోలేదు. అందుకు ఉదాహరణగా ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పిఎంకెవివై) పథకాన్ని పేర్కొవాలి. దీని అమలుపై కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) చేసిన తీవ్ర వ్యాఖ్యలు దేశంలోని నైపుణ్యాభివృద్ధి విధానాలపై కొత్త చర్చకు దారితీశాయి. పార్లమెంటులో ప్రవేశపెట్టిన ఆడిట్ నివేదికలో, ఈ పథకం లక్ష్యాలు ఎంత ఆశావహంగా ఉన్నప్పటికీ, అమలులో తీవ్రమైన లోపాలు చోటు చేసుకున్నాయని కాగ్ స్పష్టం చేసింది. ముఖ్యంగా యువత ఉపాధి సమస్యను పరిష్కరించాలన్న ఉద్దేశంతో ప్రారంభించిన పథకం, కార్యరూపంలో అనేక వ్యవస్థాపక వైఫల్యాలను ఎదుర్కొన్నట్టు ఈ నివేదిక వెల్లడించింది. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 2015 జూలైలో స్కిల్ ఇండియా మిషన్‌లో భాగంగా ప్రారంభమైంది. నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహికత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా ఈ పథకం అమలులోకి వచ్చింది. పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు యువత కు అందించి, వారి ఉపాధి అవకాశాలను పెంచడం, చదువుకున్న నిరుద్యోగ సమస్యను తగ్గించడమే దీనిప్రధాన లక్ష్యం. తక్కువ కాలిక శిక్షణ, ముందుగా ఉన్న నైపుణ్యాలకు గుర్తింపు, సర్టిఫికేషన్, ఉపాధి సహాయం వంటి అంశాలు ఈ పథకానికి కేంద్ర బిందువులుగా ఉన్నాయి. 2015 నుంచి 2022 వరకు మూడు దశల్లో ఈ పథకం అమలైంది. ఈ పథకం ప్రత్యేకత ఏమిటంటే, శిక్షణ భాగస్వాములకు చెల్లింపులు ఫలితాల ఆధారంగా జరగడం. శిక్షణ పూర్తయి, సర్టిఫికేషన్ పొందిన అభ్యర్థికి నేరుగా బ్యాంక్ ఖాతాలోకి రూ.500 నగదు ప్రోత్సాహకం జమ చేయడం ఇందులో భాగం. స్కిల్ ఇండియా పోర్టల్ ద్వారా డిజిటల్ పర్యవేక్షణ, ఆధార్ ఆధారిత ధృవీకరణ, మూడో పక్ష అంచనాలు వంటి చర్యల ద్వారా పారదర్శకతను నిర్ధారించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. అధికారిక గణాంకాల ప్రకారం, 2015 నుంచి 2022 వరకు దాదాపు రూ.14,450 కోట్ల వ్యయంతో ఈ పథకం అమలైంది. సుమారు 1.32 కోట్ల మందిని శిక్షణ మరియు సర్టిఫికేషన్ లక్ష్యంగా పెట్టుకోగా, దాదాపు 1.1 కోట్ల మంది సర్టిఫికెట్ పొందినట్లు ప్రభుత్వం చెబుతోంది. కాగ్ ఆడిట్ నివేదిక ఈ ఆశావహ చిత్రాన్ని తీవ్రంగా ప్రశ్నిస్తోంది. 2015నుంచి 2022 మధ్య కాలంలో పథకం అమలులో తీవ్రమైన లోపాలు చోటుచేసుకున్నాయని నివేదిక పేర్కొంది. అత్యంత ఆందోళన కలిగించిన అంశం ఏమిటంటే, దాదా పు 94 శాతం అభ్యర్థుల రికార్డుల్లో నమ్మదగిన బ్యాంక్ వివరాలు లేవని కాగ్ వెల్లడించింది. దీని వల్ల నిజంగా లబ్ధిదారులు ఎవరు అన్న విషయంపైనే సందేహాలు తలెత్తుతున్నాయి. అంతేకాదు, సుమారు 34 లక్షల మంది సర్టిఫికేషన్ పొందిన అభ్యర్థులకు చెల్లింపులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని నివేదిక పేర్కొంది. శిక్షణ కేంద్రాలు మూసివేసినా, శిక్షణ కొనసాగుతున్నట్లు రికార్డుల్లో చూపించడం, ఒకే ఫోటోను అనేక లబ్ధిదారులకు వాడటం వంటి అక్రమాలు చోటుచేసుకున్నాయని నివేదిక పేర్కొంది. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన భారత యువతకు నైపుణ్యాలు అందించి ఉపాధి అవకాశాలు పెంచాలన్న గొప్ప లక్ష్యంతో ప్రారంభమైన పథకం. కాగ్ నివేదిక చూపిస్తున్న వాస్తవాలు, లక్ష్యాలు, అమలులో ఉన్న లోపాల మధ్య పెద్ద అంతరం ఉందని స్పష్టం చేస్తున్నాయి.

# విదేశాల్లో చదువులు..వర్సిటీ ఎంపిక కీలకం

విదేశాల్లో చదవాలి అనుకునేవారు లేదా తమపిల్లలను విదేశాల్లో చదివించడానికి పంపే తల్లిదండ్రులు ముందుగా యూనివర్సిటీల ఎంపిక చేసుకోవాలి. ఆ సమయంలో పలు అంశాలు పరిశీలించాలి. వీసాలు, ఫీజులు, స్కాలర్‌షిప్‌లు, ప్రవేశ అర్హతలు వంటి అంశాలను చాలామంది కుటుంబాలు ఇప్పటికే పరిశీలించాయి. అయితే ఇప్పుడు భారతీయ తల్లిదండ్రుల ఆలోచనలు ర్యాంకింగ్స్ లేదా ప్రముఖ దేశాలకే పరిమితం కాకుండా, ఇతర దేశాల పట్ల కూడా అనుమానాస్పదంగా మారుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టుబడిపై లాభం (ఆర్‌ఒఐ), ఉద్యోగ అవకాశాలు, ఖర్చుల భరించగలగడం, భద్రత కీలకాంశాలుగా మారాయి. అదే విధంగా, పెరుగుతున్న ఖర్చులు, విధాన మార్పులు, ఉద్యోగ మార్కెట్ అనిశ్చితి నేపథ్యంలో తల్లిదండ్రులు విదేశీ విద్యను మరింత జాగ్రత్తగా విశ్లేషిస్తున్నారు. కేవలం అంతర్జాతీయ డిగ్రీ కాకుండా, ప్రాక్టికల్ నైపుణ్యాలు, పని అనుభవం, కెరీర్ స్పష్టత ఇవ్వగల కోర్సులకే ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో 2026లో యూనివర్సిటీని ఖరారు చేసే ముందు కెరీర్ ఫలితాలు, ప్లేస్‌మెంట్ అవకాశాలు ఎలా తెలుసుకోవాలి. ఎందుకంటే, 2026లో డిగ్రీ ఒక్కటే ఉద్యోగానికి హామీ కాదు. కోర్సు ప్రాముఖ్యత, వర్క్–వీసా మార్గాలు, చదువుతూనే లభించే పని అనుభవమే కీలకం. కేవలం ప్లేస్‌మెంట్ శాతాలు మాత్రమే కాకుండా, ఉద్యోగ రకాలు, రంగాలు, ఉద్యోగం దొరికే కాలం లేదా సమయం, సగటు జీతాలు వంటి వివరాలు పరిశీలించాలి. ఇంటర్న్‌షిప్‌లు, కో–ఆప్ ప్రోగ్రామ్‌లు, ఇండస్ట్రీ ప్రాజెక్ట్‌లు ఉన్న కోర్సులు ఎక్కువ అవకాశాలు ఇస్తాయి. మొదటి ఉద్యోగం కంటే కూడా దీర్ఘకాలిక కెరీర్ వృద్ధిపై దృష్టిపెట్టాలి. యూనివర్సిటీ లేదా కోర్సు విశ్వసనీయత ఎంత? అనేది కూడా చూడాలి. ఎందుకంటే, ఈ రోజుల్లో ర్యాంకింగ్స్ మాత్రమే ప్రమాణం కాదు. ఉద్యోగాలు ఎవరిస్తారు అనేది గమనించాలి. దేశం ఆధారంగా కాకుండా, నగరం, కోర్సు పూర్తయ్యే వరకు వచ్చే మొత్తం ఖర్చు ఆధారంగా లెక్కించాలి. తక్కువ ఖర్చుతో ఉన్న ప్రాంతాలు మంచివిగా కనిపించినా, ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్ లేకపోతే దీర్ఘకాలంలో నష్టం కలగవచ్చు. ఇక, క్యాంపస్ ఎంత భద్రమైనది, ఎంత మద్దతు ఇస్తుంది? అనేది కూడా ముఖ్యమే. భద్రత అంటే కేవలం శారీరక రక్షణ కాదు... అకాడమిక్ అడ్వైజింగ్.. కౌన్సెలింగ్.. మెంటల్ హెల్త్ సపోర్ట్.. అంతర్జాతీయ విద్యార్థుల సేవలు వంటి అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. అందుకే, అలాంటి వర్సిటీలను ఎంపిక చేసుకోవాలి. ఏ రకంగా చూసినా, విదేశీ విద్య ఒక పెద్ద పెట్టుబడి. కాబట్టి నిర్ణయం తీసుకునే ముందు పేరు, ర్యాంకు కంటే ఫలితాలు, విలువ, భవిష్యత్ అవకాశాలు ముఖ్యమని తల్లిదండ్రులు గుర్తిస్తున్నారు. సరైన యూనివర్సిటీ అంటే, చదువు పూర్తయ్యాక దారిని చూపేది. నైపుణ్యాలు, అనుభవం ఇచ్చేది. దీర్ఘకాలిక కెరీర్‌కు బలమైన పునాది వేసేది.



# మిత్రపక్షాల విజయంతోనే అభివృద్ధికి బాటలు

## అభివృద్ధిని అడ్డుకుంటున్న బిఆర్‌ఎస్; బిజెపిలకు ఓటు అడిగి హక్కు లేదు

### చండూరు కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/చండూరు :** మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ, సిపిఐ మిత్రపక్షాల అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి బాటలు వేసుకోవాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం చండూరులో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ ప్రచార సభలో పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ చండూరు మున్సిపాలిటిలో చాలా సమస్యలున్నాయి, వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత తనపైనే ఉందన్నారు. చండూరు మునిసిపాలిటీలోని 10వార్డులలో కాంగ్రెస్, సిపిఐ మిత్రపక్ష సభ్యులను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని భరోసా ఇచ్చారు. దోపిడీ, అవినీతికి వ్యతిరేకంగా ప్రజల పక్షాన గొంతు వినిపించే పరిస్థితి వస్తే నేను ముందుంటానన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో రేషన్ కార్డులు, సన్న బియ్యం వస్తున్నాయన్నారు. చండూరు మున్సిపాలిటీలో ఇంటి స్థలాలు లేని నిరుపేదలందరికీ త్వరలోనే ప్రభుత్వ భూమిని గుర్తించి ఇండ్లు కట్టిస్తానన్నారు. చండూరులో ఇప్పటివరకు 10శాతం అభివృద్ధి మాత్రమే జరిగిందని, ఇంకో 90శాతం అభివృద్ధి చేసుకోవాలన్నారు. నా బలం, బలగం మునుగోడు ప్రజలేనని, మీరు వెంట ఉంటే ఎంత దూరమైనా వెళ్లి కొట్లాడుతానన్నారు. అంతకుముందు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ పదేళ్లు అధికారంలో ఉండి అభివృద్ధి చేయని బిఆర్‌ఎస్, కేంద్రంలో అధికారంలో ఉండి అభివృద్ధికి నిధులు ఇవ్వని బిజెపి పార్టీలకు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. కాంగ్రెస్ మద్దతుతోనే తను శాసనమండలి సభ్యుడిగా ఎన్నికయ్యానని నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా సాగు, తాగునీరు ప్రాజెక్టులతో పాటు రోడ్ల అభివృద్ధి, విద్యుత్తు ఆధునీకరణ కోసము కలిసి పని చేస్తామన్నారు. ప్రచారం కార్యక్రమంలో పది వార్డుల అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలపై పోరాడే వారిని గెలిపించండి



### సీతారామయ్య, కలవేన శంకర్ వినతి

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** అనునిత్యం ప్రజాక్షేత్రంలో కొనసాగుతూ వారి సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా పనిచేసేవారిని అభ్యర్థులుగా గెలిపించుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్ ఓటర్లను కోరారు. సోమవారం నస్పూర్ మండలం శ్రీరాంపూర్ టిఎస్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో 17వ వార్డు కౌన్సిలర్‌గా గెలిచి అనేక అభివృద్ధి పనులు చేసినట్టు తెలిపారు. అదే స్ఫూర్తితో ఆరో డివిజన్‌లో పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి మేకల దాసును భారీమెజార్టీతో గెలిపించాలని వారు ఓటర్లను కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి బ్రాంచి కార్యదర్శి ఎస్‌కె. బాజీ సైదా, మల్లయ్య, రాచర్ల చంద్రమోహన్, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మారుమల్లయ్య, కార్యదర్శి లింగం రవి, పూజారి రామన్న, కొత్తపల్లి మహేష్, సిపిఐ శ్రేణులు పాల్గొన్నారు.

## కూనంనేని చేసిన అభివృద్ధిని

# గెలుపుబాటగా మార్చుకుందాం



### సిపిఐ వెంటే కొత్తగూడెం కార్పొరేషన్ ప్రజానికం

### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వెంటే కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని ప్రజానికం ఉన్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా ధీమా వ్యక్తం చేశారు. కొత్తగూడెం, పాల్వంచలోని పలు డివిజన్లలో చేపట్టిన రోడ్ షోకు అపూర్వ స్పందన లభిస్తోందని, సంఖ్యా సమస్య కారణంగా కార్పొరేషన్ వ్యాప్తంగా సిపిఐ అభ్యర్థులు పోటీలో ఉన్నారని, సిపిఐ అభ్యర్థులను గెలిపించుకుందామని ఓటర్లకు పిలుపినిచ్చారు. ప్రజల కోసం పనిచేసే వారిని కార్పొరేషన్‌కు పంపడం ద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అవినీతి రహిత పాలన సాగాలంటే కమ్యూనిస్టులతో మాత్రమే సాధ్యమన్నారు. కూనంనేని ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి చేసిన అభివృద్ధిని గెలుపు మంత్రంగా మార్చుకుందామని చెప్పారు. మోసపూరిత వాగ్ధానాలతో ప్రలోబాలకు గురిచేసేందుకు కొందరు వస్తుంటారని, అలాంటి వారి పట్ల ఓటర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలతో మమేకమయ్యే కమ్యూనిస్టుల ఎన్నికల గుర్తు కంకి కొడవలికి ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ప్రచార కార్యక్రమాల్లో సిపిఐ నాయకులు నెరేళ్ల రమేష్, బత్తుల నాగరాజు, యూసుఫ్, గెద్దాడు నగేష్, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, పి.సత్యనారాయణ చారి, తుమ్మ నర్సయ్య, గడ్డం ప్రభాకర్, మూడెత్తుల శ్రీను, సర్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.





# కమ్యూనిస్టు అభ్యర్థులను ఆదరించాలి

### సిపిఐ గద్వాల జిల్లా కార్యదర్శి ఆంజనేయులు



**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** ఎర్రజెండాతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని సిపిఐ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు పేర్కొన్నారు. గద్వాల మున్సిపల్‌లో 30వ వార్డు నుంచి సిపిఐ అభ్యర్థిగా పోటీచేస్తున్న అడ్వకేట్ రమేష్ గెలిపించాలని ఆయన కోరారు. సోమవారం మున్సిపల్ ఎన్నికల ప్రచారం చివరి రోజు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి 30వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కంకి కొడవలి గుర్తుపై ఓటు వేసి వేసి కౌన్సిలర్‌గా గెలిపించి మున్సిపాలిటీకి పంపాలని విజ్ఞప్తి చేశారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన అడ్వకేట్ రమేష్‌ను 30వ వార్డు నుండి గెలిపించుకుని మున్సిపాలిటీలో ప్రజా సమస్యల పై నిలదీసే వ్యక్తిగా పంపాలన్నారు. వార్డు అభివృద్ధికి కావాల్సిన నిధులను మున్సిపల్ నుండి తీసుకొచ్చి సమస్యలను తీర్చే శక్తి రమేష్‌కు ఉందన్నారు. కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి పేదల పక్షాన పోరాడే సిపిఐని గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. అభ్యర్థి రమేష్ మాట్లాడుతూ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా గొంతుక అవుతారని తెలిపారు. ప్రచారంలో సిపిఐ నాయకులు రంగన్న, వెంకట్రాములు, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షాన పోరాడేది సిపిఐయే

### సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఆదిలాబాద్/నిర్మల్ :** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలోని 11వ వార్డు రాంనగర్‌లో సిపిఐ అభ్యర్థి మావురపు లక్ష్మి నరసయ్య విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం సిపిఐ శ్రేణులు ముమ్మర ప్రచారం నిర్వహించాయి. సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలో ఇంటింటికీ వెళ్లి 'కంకి కొడవలి' గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా ముడుపు ప్రభాకర్‌దరెడ్డి మాట్లాడుతూ పేదల పక్షాన పోరాడే సిపిఐ అభ్యర్థులను గెలిపించేకుంటే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రభుత్వేతర పార్టీలను గెలిపించడంతో సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి పేదల పక్షాన పోరాడే సిపిఐని గెలిపించాలని కోరారు. ప్రచారం కార్యక్రమంలో నాయకులు ఎస్.వి.దాస్. షేక్ పాషా, భాస్కర్, కేశవ్ రాజు, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ అభ్యర్థుల గెలుపుతోనే

# సమస్యలు పరిష్కారం : బాగం



**ప్రజాపక్షం/ఖమ్మం :** మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ బలపర్చిన అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లాలో నాలుగు మున్సిపాలిటీల పరిధిలో పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసేవారిని గెలిపిస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన తెలిపారు. కొందరు డబ్బులతో పదవులు పొందాలని చూస్తున్నారని, డబ్బులతో గెలిచిన వారు ప్రజల గురించి పట్టించుకోరని, ఎంత ఖర్చు చేశాం ఎంత లాభం తీసుకోవాలన్న ఆలోచనలోనే ఉంటారని ఆయన తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తుందని ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పాటులోనూ, ఆ ప్రాంతా అభివృద్ధిలోనూ సిపిఐ కీలక భూమిక పోషించిందన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పలుగ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, పాఠశాలలు, ఇతర ప్రభుత్వ సంస్థల ఏర్పాటు సిపిఐ హయాంలోనే జరిగిందని హేమంతరావు తెలిపారు. మధిర మున్సిపాలిటీలో మడుపల్లి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిన చరిత్ర సిపిఐకి మాత్రమే ఉందన్నారు. అనేక దశాబ్దాల పాటు మడుపల్లి గ్రామ పంచాయతీ సిపిఐ ఏలుబడిలో ఉందని ఇప్పుడు ప్రజలు అనుభవిస్తున్న అనేక అభివృద్ధి కార్యక్రమాల వెనక సిపిఐ కృషి దాగి ఉందని ఆయన తెలిపారు. మడుపల్లి పరిధిలోని ఏడవ వార్డులో సిపిఐ బలపర్చిన ఊట్ల కొండలరావు ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. వైరా మున్సిపాలిటీ 15వ వార్డులో సిపిఐ, బిఆర్‌ఎస్, సిపిఎం బలపర్చిన అభ్యర్థిగా నల్లమోతు శైలజ పోటీ చేస్తున్నారని ఆమెను గెలిపించాలని హేమంతరావు కోరారు. దిద్దుపూడి గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు సిపిఐ సర్పంచ్ అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని ఆయన తెలిపారు. మున్సిపల్ ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి అభివృద్ధికాముకులను గెలిపించాలని ఆయన కోరారు.



## భారత్ ఎండి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** డ్యూచెన్ మస్కులర్ డిస్ట్రోఫీపై పరిశోధనను ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో భారత్ ఎండి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాప్రాలో వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మైసూర్‌లోని జెఎస్ఎస్ ఆసుపత్రి, జెఎస్ఎస్ మెడికల్ కాలేజ్ జెఎస్ఎస్ ఉన్నత విద్యా పరిశోధనా అకాడమీ సహకారంతో నిర్వహించారు. పరిశోధనలో భాగంగా రక్త నమూనాలు సేకరించి, డ్యూషెన్ మస్క్యులర్ డిస్ట్రోఫీకి సంబంధించిన జీవ సూచికల గుర్తింపు ప్రాజెక్ట్ కోసం వినియోగించారు. కుటుంబాలు ఒకరికొకరు బలం చేకూర్చుకునే వేదికగా ఈ వైద్య శిబిరం నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సువేత, రితికా చోర్డియా, తన్మయ, చరణ్, సాయిఅనురాగ్, ఆశ్రిత, తదితరులు పాల్గొన్నారు.



## క్రీడోత్సవాలు ప్రారంభం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణా ఆధ్వర్యంలో కొనసాగుతున్న చీఫ్ మినిస్టర్ కప్ 2025 జిల్లా స్థాయి క్రీడోత్సవాల్లో భాగంగా హాకీంపేటలోని తెలంగాణా స్పోర్ట్స్ స్కూల్‌లో సోమవారం క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. డిఇఒ విజయకుమారి, తెలంగాణా స్పోర్ట్స్ స్కూల్ ఒఎస్‌డి మమతతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ప్రారంభించారు. కబడ్డి, వాలీబాల్, కోకో, ఫుట్‌బాల్, స్కేటింగ్ పోటీల్లో 500 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలను రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు పంపిస్తారన్నారు. రాష్ట్ర స్థాయిలో విజేతలైన క్రీడాకారులకు మొదటి బహుమతిగా లక్ష, రెండవ బహుమతిగా 75 వేలు, మూడవ బహుమతిగా 50వేల రూపాయలు ఇవ్వనున్నారని జిల్లా యువజన క్రీడా శాఖాధికారి తెలిపారు.



## పేద విద్యార్థికి లయన్స్ క్లబ్ సభ్యుల సహాయం

### ఎమ్మెల్యే వివేక్ చేతుల మీదుగా రూ.1.30 లక్షలు అందజేత

**ప్రజాపక్షం/నిజాంపేట్:** నిరుపేద విద్యార్థికి లయన్స్ క్లబ్ సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందజేసి ఉన్నత చదువులకు చేయూతనందించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం కాలనీ అల్లె గూడా బస్తీకి చెందిన శ్రీపతి ఉదయ్ కుమార్ ఆస్ట్రేలియాలో మైక్రో బయాలజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివేందుకు అవకాశం లభించింది. విద్యార్థి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రాన ఉండడంతో సహాయం కోరుతూ స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానందను ఆశ్రయించారు. ఈ మేరకు స్పందించిన వివేక్ లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో సభ్యులందరు కలిసి విద్యార్థి ఉదయ్ చదువుల నిమిత్తం రూ.1.30 లక్షల ఆర్థిక సహాయాన్ని వివేక్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ విద్యార్థి పై చదువుల కోసం ఆర్థిక సహాయాన్ని అందజేసిన లయన్స్ క్లబ్ సభ్యులందరిని అభినందించారు. పేద విద్యార్థులకు, సామాన్యులకు ఎల్లప్పుడు అండగా స్వచ్ఛంద సంస్థలు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ నార్త్ అధ్యక్షులు బిర్రు అంజనేయులు, డిస్ట్రిక్ మాజీ గవర్నర్ కుమార్ శెట్టి, సభ్యులు చల్లా శ్రీనివాస్ రెడ్డి, రామేశ్వర్ రెడ్డి, వెంకటేష్ ముదిరాజ్‌లు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై..

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** కాంగ్రెస్ ప్రభుత్వం అమలుపరుస్తున్న పలు సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. సోమవారం మూడుచింతలపల్లి మున్సిపల్ నాగిశెట్టిపల్లిలో డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీకి చెందిన మొగుళ్ల ప్రేమ్‌కుమార్‌రెడ్డి డిసిసి తోటకూర వజ్రేష్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డిసిసి మాట్లాడుతూ నాగిశెట్టిపల్లిలో ఒక్క పెంకుటిల్లు ఉండకూడదని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్దెమర్రి నుంచి నాగిశెట్టిపల్లి వరకు ఉన్న రోడ్డును విస్తరిస్తామని చెప్పారు. మూడుచింతలపల్లిలో బ్రిడ్జ్ నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమ కోసం కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి శ్రీకాంత్‌నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, జిల్లా ఆర్‌టిఎ మెంబర్ జైపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రామిడి శశిధర్‌రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, బింగి మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## సర్కిల్ కార్యాలయానికి ట్రాక్టర్ అందజేత



**ప్రజాపక్షం/చర్లపల్లి:** కీసర గుట్ట బ్రహ్మోత్సవాల్లో భాగంగా కీసర సర్కిల్ కార్యాలయానికి సాల్వో ఎక్స్‌ప్లోసివ్స్ చైర్మన్ జయరామ్‌రెడ్డి ట్రాక్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను డిప్యూటీ కమిషనర్ వసంత శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కీసరగుట్ట ట్రస్టు బోర్డు చైర్మన్ తటాకం వెంకటేష్‌శర్మ, ఇఓ సుధాకర్‌రెడ్డి, ఎఎంసి గంగన్న, కీసర మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు, డిఇ, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

### ఉప్పల్ జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం



**ప్రజాపక్షం/బోడుప్పల్:** జిహెచ్ఎంసి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో ఉప్పల్ జోనల్ కమిషనర్‌కు ప్రజా పాలనలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రచ్చ కిషన్ మాట్లాడుతూ, బోడుప్పల్ సర్కిల్ పరిధిలో గత కొంతకాలంగా అక్రమ నిర్మాణాలు జోరుగా జరుగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా చేపడుతున్న నిర్మాణాల వల్ల ప్రభుత్వ ఆదాయనికి గండి పడుతుందని అన్నారు. అక్రమ నిర్మాణాల పై సిపిఐ ఆధ్వర్యంలో గత మూడు నెలల నుండి 11సార్లు అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఏ ఒక్క ఫిర్యాదుపైన ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కొంత మంది అధికార పార్టీ నేతలు, మరి కొంతమంది మాజీ కార్పొరేటర్లు, అధికారుల కనుసన్నల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి అని పేర్కొన్నారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని వారు స్వాహా చేస్తున్నట్లు స్థానికంగా ఆరోపణలు వస్తున్నాయి. ఇదే విషయం గురించి బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. ఇప్పటికైనా కమీషనర్ స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని సిపిఐ తరుపున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఒకవేళ చర్యలు చేపట్టకపోతే సిపిఐ ఆధ్వర్యంలో బోడుప్పల్ సర్కిల్ కార్యాలయం ముందు ధర్నా చేపడుతామని అన్నారు. బోడుప్పల్ సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జోనల్ కమీషనర్ ను కొరామని దానికి వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మేడిపల్లి మండల సిపిఐ సహాయ కార్యదర్శి సిహెచ్ మాధవి, ఎఐటియుసి జిల్లా డిప్యూటీ సెక్రటరీ దండు రమేష్, బిసి సంఘం జిల్లా నాయకురాలు కె.ప్రమీల, బికెఎమ్ ఎఫ్ మండల అధ్యక్షులు ఐలయ్య కార్యదర్శి కె.మహాలక్ష్మి, సిపిఐ మండల కౌన్సిల్ సభ్యులు నర్సమ్మ ఇస్తారీ, సోమరాజు, సరిత తదితరులు పాల్గొన్నారు.

# పురపాలికలన్నీ కాంగ్రెస్ కైవసం తథ్యం

### శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలే మరో రెండు రోజుల్లో జరుగనున్న పురపాలక సంఘాల ఎన్నికల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని అన్నింటిని కాంగ్రెస్ పార్టీ దక్కించుకొనేందుకు కారణమవుతోందని శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేసారు. మేడ్చల్ నియోజకవర్గంలో మూడు, చేవెళ్ల నియోజకవర్గంలో మూడు స్థానాలతో పాటు పరిగి, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాల్లోల కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల సమిష్టిగా అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నారన్నారు.

సోమవారం మేడ్చల్ జిల్లా ఆలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని లాల్‌గడి మలక్‌పేటలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌తో కల్సి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజలకోసం నిస్వార్థంగా పనిచేస్తూ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మున్సిపల్ ప్రాంతాలకూ దక్కాలంటే విపక్షాల మాయ మాటల గుప్పిట్లో పడకుండా కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతివ్వాలని ఓటర్లను కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణా రాష్ట్రంలో కొనసాగుతున్న పాలనలో గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనకు భిన్నంగా కొత్త రేషన్ కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రైతు రుణ మాఫీలాంటి అనేక పథకాలను అన్ని వర్గాలకు దక్కేలా చేసిందన్నారు. డిసిసి అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రిగా వెలగబెట్టిన మేడ్చల్ ఎమ్మెల్యే ప్రజాభివృద్ధి గురించి అధికారంలో ఉన్న కాలంలో ఏ మాత్రం పట్టించుకోకుండా ఇప్పుడు ఓట్ల కోసం మాయ మాటలు చెబుతున్నారని, వాటిని ఏ మాత్రం నమ్మరాదన్నారు. గ్రామస్థాయి నుండి మున్సిపాలిటీలు, పట్టణాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని స్పష్టం చేసారు. మేడ్చల్ జిల్లాలోని మూడు మున్సిపాలిటీలు హస్తగతం అవటం తథ్యం అన్న ధీమా వ్యక్తం చేసారు. ధన, రౌడీ, వంచన రాజకీయాలు మల్లారెడ్డి సొంతమని, మంత్రి హోదాలో ప్రభుత్వ స్థలాలన్నీ ఆక్రమించుకొని తన తన విద్యా సంస్థల సామ్రాజ్యాన్ని విస్తరించుకొన్న మల్లారెడ్డి జిల్లాలో ఏ ఒక్క ప్రభుత్వ విద్యాసంస్థ నెలకొల్ప లేక పోవటం ప్రజలకు అందరికీ తెలిసిన విషయమేనన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు కొలను హన్మంతరెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్, మహిపాల్‌రెడ్డి, ఆలియాబాద్ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి కంటం శిరిషా కృష్ణారెడ్డి, ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ సెంటర్‌ల పరిశీలన



**ప్రజాపక్షం /వికారాబాద్ :** వికారాబాద్ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం వికారాబాద్ పట్టణంలోని మేరీ నాట్ స్కూల్ నందు ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ సందర్శించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించి, తాగునీటి వసతి, వైద్య శిబిరం, అల్పాహారం, భోజన వసతి, షామియానాలు ఇతర అన్ని వసతులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు, గందరగోళానికి తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని పక్కాగా అందించాలని, చెక్ లిస్టు ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామాగ్రి అందినదా, లేదా అన్నది జాగ్రత్తగా పరిశీలించుకోవాలని తెలిపారు. సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాల కు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి, ప్రత్యేకించి బ్యాలెట్ పేపర్లు తరలించే సమయంలో తప్పనిసరిగా సాయుధ పోలీసులతో కూడిన బందోబస్తు ఉండాలని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సదుపాయాల కల్పన విషయమై అధికారులకు పలుసూచనలు చేశారు. ఓటర్లకు అన్ని వసతులు అందుబాటులో ఉండాలని, ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని అన్నారు.

## క్రీడారంగంలో సరైన శిక్షణ అవసరం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** విద్యతో పాటు క్రీడా రంగానికి సైతం ప్రాధాన్యతనిస్తూ రాణించేందుకు సరైన శిక్షణతో దేశానికి ప్రపంచ స్థాయిలో వన్నె తెచ్చే దశకు చేరుకునేలా విద్యార్థులు కృషి చేయాలని వినాయకనగర్ కార్పొరేటర్ క్యాసం రాజ్యలక్ష్మి అన్నారు. డివిజన్‌లోని వాజపాయినగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు జిహెచ్ఎంసి ద్వారా మంజూరైన క్రీడా సామగ్రిని సోమవారం కళాశాలకు వెళ్లి ప్రిన్సిపాల్ సమక్షంలో అందచేసారు. విద్యార్థులకు ఆసక్తి ఉన్న అంశాలను తెల్సుకొని సరైన శిక్షణ ఇవ్వటంలో వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు.

## కార్యకర్తల మధ్య కొలను నీలారెడ్డి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య మాజీ మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి బాచుపల్లి, మైటాస్ హిల్ కౌంటీ కాలనీలోని తన నివాసంలో పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. మాజీ కార్పొరేటర్‌లు, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నీలా గోపాల్ రెడ్డిని ఘనంగా శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందజేసి కేక్‌ని కట్ చేయించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు మాజీ మేయర్ కొలను నీలా కేక్‌ని తినిపించి కృతజ్ఞతలను తెలిపారు. అనంతరం నిరుపేద మహిళలకు కొలను నీలా గోపాల్ రెడ్డి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నీలా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ పదవిలో ఉన్నా లేకున్నా నిరుపేద ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం పేద ప్రజల కోసం పనిచేస్తానని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే తన బాధ్యతగా ముందుకు వెళ్తానని అన్నారు. తనపై ఇంతగా ఆదరాభిమానాలను చూపించిన ప్రతిఒక్కరికి ఆమె కృతజ్ఞతలను తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌లు మేకల వెంకటేశ్, సురేశ్ రెడ్డి, నాయకులు బొర్రా చందు ముదిరాజ్, జగన్ యాదవ్, లక్ష్మారెడ్డి, సాంబశివ రెడ్డి, సాయిలు పాల్గొన్నారు.



## బిజెపి అభ్యర్థికి మద్దతుగా చంద్రారెడ్డి ప్రచారం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మాపూర్, లక్ష్మాపూర్ తండాలలో బిజెపి అభ్యర్థికి మద్దతుగా నాగారం మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ప్రచారం నిర్వహించారు. మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ మద్దతుతో విజయం సాధిస్తాడని చంద్రారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొంపల్లి మోహన్‌రెడ్డి, నక్క కిషోర్‌గౌడ్, మెరుగు శ్రీనివాస్ రెడ్డి, రామక్కపేట రవీందర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భారీ మెజార్టీతో గెలిపించాలి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** అలియాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం అలియాబాద్ మున్సిపల్‌లో బిఆర్ఎస్ అభ్యర్థుల తరపున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. అలియాబాద్‌లోని 7 వార్డులను బిఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీచైతన్య పాఠశాలలో కీచక ఉపాధ్యాయుడు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** పాఠాలు చెప్పాల్సిన ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు విద్యార్థిని లైంగిక వేధింపులకు పాల్పడి తాళికట్టి కటకటాల పాలైన ఘటన అలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోచారం ఐటి కారిడార్ పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినిపై అదే పాఠశాలలో భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడు పత్రే మైటీన్ (27)తరచుగా అసభ్యకరంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. మైటీన్ సదరు విద్యార్థినికి మాయమాటలు చెప్పి రహస్యంగా పసుపుతాడు కట్టి పెళ్లి చేసుకున్నాడు. కూతురు మెడలో తాళి గమనించిన తల్లి బాలికను నిలదీసింది. స్కూల్‌లోని ఫిజిక్స్ టీచర్ మైటీన్ సార్ తనను పెళ్లి చేసుకున్నాడని చెప్పింది. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్ళారు. బయట జరిగే విషయాలకు తాము బాధ్యులు కామని ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. దీంతో పోచారం ఐటి కారిడార్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు మైటీన్‌పై ఫోక్సో చట్టం కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన పట్ల విద్యార్థి సంఘాలు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



## 'కార్మిక వ్యతిరేక' లేబర్ కోడ్‌లు రద్దుకు డిమాండ్

### ఎఐటియుసి సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్ ఆవిష్కరణలో సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని బాచుపల్లి మండల సిపిఐ కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. నిజాంపేట్ చౌరస్తాలో ఈ నెల 12న జరిగే ఎఐటియుసి సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్‌ని ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పన్నెండున జరిగే సార్వత్రిక సమ్మెకు కార్మికులు, రైతులు, పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. నిత్యావసర ధరలు పెరుగుతున్నా మున్సిపల్ కార్మికుల జీతాలు పెరగడం లేదని, మున్సిపల్‌లో పనిచేసే కార్మికులకు ఇరవై ఆరు వేలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం వచ్చాక పోరాడి సాధించుకున్న ఇరవై తొమ్మిది కార్మిక చట్టాలకు బదులుగా సాధించుకున్న నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చారని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కేవలం ఏకపక్షంగా ఉందని, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం బదులుగా పేరు మార్చి రామ్ జీ అని రాముని పేరు పెట్టి అందులోని అసలు విషయాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని అన్నారు. ఈ నెల పన్నెండున జరిగే సమ్మెకు పెద్ద ఎత్తున కార్మికులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి నిజాంపేట్ అధ్యక్షులు ఆశి, నాయకులు యాదయ్య, పొన్నకంటి దస్తగిరి, భాగ్యమ్మ, నర్సమ్మ, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.



## స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఇంటింటి ప్రచారం

**ప్రజాపక్షం/వికారాబాద్ :** మున్సిపల్‌లోని ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ వార్డు అభ్యర్థులకు మద్దతుగా మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి అనన్యతో కలిసి 10,31, 32,33,34, వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం రోడ్‌షో నిర్వహించి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే మున్సిపల్ అభివృద్ధి చెందుతుందన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా అనన్య ఉండటంలో అన్ని విధలుగా అభివృద్ధి చేయడం జరుగుతుంది..కావున ప్రతి ఓటరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు సుదాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పలు ప్రాంతాలలో శంకుస్థాపనలు

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** బాలాజీ నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో సోమవారం పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ పగడాల శిరీష బాబురావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కెపిహెచ్‌బి కాలనీ 15వ ఫేజ్‌లో సిసి రోడ్డు నిర్మాణ పనులకు, హబీబ్ నగర్‌లో అలాగే ప్రగతినగర్‌లో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో డివిజన్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేశామన్నారు. రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీరు వంటి మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రజలకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్ గౌడ్, 15వ ఫేజ్ అధ్యక్షుడు రామ్ ప్రసాద్, కార్యదర్శి వెంకట్‌రాజు, జీవానందం, సావిత్రి, షరీఫ్, యాధుల్, రషీద్, హైమద్, తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులు పరిశీలన

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** కెపిహెచ్‌బి డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులను సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కెపిహెచ్‌బి 7వ ఫేజ్ దోభీ ఘాట్‌ను పరిశీలించి, ఫ్లోరింగ్, వాటర్ పైప్‌లైన్, ఎలక్ట్రికల్ పనులు చేపట్టాలని, దోభీ ఘాట్‌కు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం భగత్ సింగ్ నగర్ ఫేజ్ 1లో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అలాగే కెపిహెచ్‌బి 9వ ఫేజ్‌లోని మహిళా మండలి భవనం మొదటి అంతస్తు నిర్మాణానికి సంబంధించి ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎఇ రాజీవ్, హెచ్ఎండబ్ల్యూఎస్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సురేష్‌రెడ్డి, వెంకటరెడ్డి, రాజేష్, పాతూరు గోపి, భగత్‌సింగ్ నగర్ అసోసియేషన్ సభ్యులు , తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ నిర్మాణ పనుల ప్రారంభం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** డివిజన్‌లోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని గౌతం నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రామ్ యాదవ్ అన్నారు. డివిజన్‌లోని ఇందిరా నెహ్రూనగర్ సాయిబాబా ఆలయం సమీపంలో రూ.21 లక్షల వ్యయంతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఎఇ దివ్యజ్యోతి, బిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సేవకుడిగా పని చేస్తా

సిపిఐ అభ్యర్థి మక్బూల్



**ప్రజాపక్షం/షాబాద్:** ప్రజలకు సేవకుడిగా పని చేస్తామని సిపిఐ అభ్యర్థి మక్బూల్ అన్నారు. సోమవారం చేవెళ్ల మండల పరిధిలోని రామన్నగూడ, దామరగిద్ద గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేవెళ్ల మునిసిపాలిటీ 10వ వార్డు సభ్యుడుగా సిపిఐ తరపున ప్రజలకు సేవ చేయడానికి పార్టీ అవకాశం కల్పించిన్నట్లు తెలిపారు. 17వ వార్డు తరపుతన రంగారెడ్డి నగర్, సిపిఐ కాలనిలో సార్ల వెంకటేష్‌కు ప్రజలందరూ కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య,పాపయ్య, శివయ్య తదితరులు ఉన్నారు.

## అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి

కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** కాలనీ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని పంచాయితీరాజ్ టీచర్స్ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణం, బిఎన్‌రెడ్డి నగర్ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణం, బిఎన్‌రెడ్డి నగర్ కాలనీలో వర్షాపు నీటి పైప్‌లైన్ కొరకు చేపడుతున్న పనులను కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ లచ్చిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రావు, కాలనీల అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, తూము భూపాల్‌రెడ్డి, దేవి పోచమ్మ ఆలయ చైర్మన్ ప్రదీప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ధనరాజ్, రాములు పాల్గొన్నారు.

## సిసి కెమెరాల ఏర్పాటు అభినందనీయం

ఎల్‌బి నగర్ ఎసిపి కృష్ణయ్య గౌడ్




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** ఒక సిసి కెమెరా వంది పోలీసులతో సమానమని ఎల్‌బి నగర్ ఎసిపి కృష్ణయ్య గౌడ్ అన్నారు. సోమవారం నాగోల్ డివిజన్ పరిధిలోని మధుర నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను స్థానిక కార్పొరేటర్ అరుణ సురేందర్ యాదవ్, నాగోల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మక్బూల్ హుస్సేన్‌లతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమానికి కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ఉజ్జిని రత్నాకర్ రావు అధ్యక్ష వహించారు. కార్యక్రమంలో కెవి నరిసింహారెడ్డి, ప్రదీప్, జగదీశ్వర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక సౌకర్యాల కల్పనలో విఫలం



**ప్రజాపక్షం/కొందుర్గు:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌళిక సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, ప్రభుత్వం విఫలమైందని గర్భిణీలు ఆరోపించారు. సోమవారం కొందుర్గు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన గర్భిణీలు అధికారుల పనితీరుపై మండిపడ్డారు. ఆసుపత్రికి వచ్చే మహిళలకు మూత్రశాలలు లేకపోవడం అనేక ఇబ్బందులు పడుతున్నామని, గర్భిణీలు రక్త పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన సమయంలో, ఇతర సమయాల్లో అనేక అవస్థలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి మౌళిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

## ప్రజావ్యతిరేక పాలనకు ముగింపు

బిజెపి రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజావ్యతిరేక పాలనకు ముగింపు పలికే సమయం ఆసన్నమైందని బిజెపి రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్, మూర్తజాగూడ, ఎంకేపల్లి ప్రాంతాలలోని వివిధ వార్డులలో బిజెపి రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి రాజకీయంగా విస్తృత ప్రచారం నిర్వహించారు. ప్రచార కార్యక్రమాలలో మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం, ప్రకాష్, అంజన్ కుమార్, కొంరైయ్య, నర్సింహారెడ్డి, బుచ్చిరెడ్డిలతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పనకు నిధులు



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** హస్తినాపురం డివిజన్‌కు మౌలిక వసతులు కల్పనకు 9.80 కోట్ల నిధులతో అభివృద్ధి చేయడం జరుగుతుందని జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్, హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ వెల్లడించారు. సోమవారం డివిజన్‌లోని విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ కాలనీలో నార్త్ ఎక్స్టెన్షన్ కాలనీ, సాగర్ ఎన్క్లేవ్‌లో పలు అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మంకాల శేఖర్‌రెడ్డి, అమర్నాథ్ యాదవ్, చండీశ్వర్, నల్లవెల్లి మనోహర్‌రెడ్డి, రాములు నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, గొపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నరసింహ, సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నగరాభివృద్ధి, మౌలిక సదుపాయాలు

### జిహెచ్‌ఎంసి స్థాయీసంఘం చివరి భేటీలో కీలక నిర్ణయాలు.. 20 ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిన సభ్యులు





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరవాసులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా జిహెచ్‌ఎంసి స్థాయీ సంఘం సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ప్రస్తుత పాలకమండలి చివరి స్థాయీ సంఘం సమావేశం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో మొత్తం 20 ప్రతిపాదనలకు సమావేశం ఆమోదం తెలిపింది. ఇందులో 9 అజెండా అంశాలు కాగా, 11 అదనపు అంశాలు ఉన్నాయి. ఈ సమావేశంలో జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌తో పాటు స్థాయీ సంఘం సభ్యులు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

#### క్రీడలకు పెద్దపీట.. మౌలిక వసతుల పెంపు

- నగరంలో క్రీడా సౌకర్యాలను మెరుగుపరిచే దిశగా కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది.
- బాలానగర్ ఫ్లైఓవర్ కింద ఉన్న ఖాళీ స్థలాన్ని క్రీడా ప్రాంగణంగా మార్చి, దాని నిర్వహణను ఏడాది పాటు ఎన్‌ఆర్‌ఎస్‌సికి అప్పగించాలని నిర్ణయించారు. అలాగే కూకట్‌పల్లి నెక్సస్ మాల్ ఫ్లైఓవర్ కింద ఉన్న క్రీడా ప్రాంగణ నిర్వహణకు టెండర్లు ఆహ్వానించనున్నారు.
- కెపిహెచ్‌బి 5వ దశలో క్రికెట్ ప్రాక్టీస్ పిచ్‌లు, 9వ దశలో ఇండోర్ షటిల్ కోర్టు నిర్వహణకు కొత్తగా ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఇఓఐ) కోరుతూ టెండర్లు పిలవడానికి అనుమతినిచ్చారు.
- చందానగర్ సర్కిల్ పరిధిలోని ఈ కాంప్లెక్స్‌లో కొత్తగా బాక్సింగ్ కోర్టు నిర్మాణానికి పరిపాలనా అనుమతులు లభించాయి.

#### రోడ్ల విస్తరణ, చెరువుల అభివృద్ధి..

- నగర రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు పలు రోడ్ల అభివృద్ధి పనులకు కమిటీ పచ్చజెండా ఊపింది.
- ఆనంద్ నగర్ మన్‌సూరాబాద్ (30 మీటర్లు), సరోజినీనగర్, కోణార్క్ డయాగ్నోస్టిక్స్ రోడ్, కామినేని జంక్షన్ ఎన్‌హెచ్ 65 రోడ్‌ల అభివృద్ధికి, ఆస్తుల స్వాధీనానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.
- సాఫిల్‌గూడ నడిమి చెరువులో జంగిల్ క్లియరెన్స్, ఫెన్సింగ్, డ్రైనేజీ మళ్లింపు పనులకు అనుమతినిచ్చారు.
- దెబ్బతిన్న బిటి రోడ్ల రీకార్పెటింగ్, డివైడర్ల నిర్మాణం, సిసి రోడ్ల పనులకు ఆమోదం తెలిపారు.

#### ప్రజా సౌకర్యాలు, ఇతర నిర్ణయాలు..

- మూసాపేట సర్కిల్ పరిధిలోని వైకుంఠధామం నిర్వహణతో పాటు, నాచారం ఎర్రకుంటలోని హిందూ స్మశాన వాటికను వైకుంఠధామంగా అభివృద్ధి చేయనున్నారు.
- నగర్‌లో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, ఉప్పల్ బీరప్ప గూడలో బహుళ అంతస్తుల భవన నిర్మాణానికి ప్రతిపాదనలు ఆమోదించారు.
- ఉప్పల్ నుంచి నారపల్లి వరకు ఉన్న ఎలివేటెడ్ కారిడార్‌కు మాజీ ఎమ్మెల్యే 'బండారి రాజీ రెడ్డి కారిడార్' పేరు పెట్టే అంశాన్ని తుది నిర్ణయం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని కమిటీ నిర్ణయించింది.

## మాత, శిశు మరణాలు తగ్గించొచ్చు

డిఎంహెచ్ఒ లలితాదేవి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గర్భధారణ ప్రారంభ దశలోనే గుర్తించడం, సరైన ట్రాకింగ్ నిర్వహించడం, సమయానుకూలంగా వైద్యాన్ని అందించడం ద్వారా మాత, శిశు మరణాలను తగ్గించవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లలితాదేవి తెలిపారు. సోమవారం శివరాంపల్లి డిఎంహెచ్ఒ కార్యాలయంలో ఆరోగ్య కార్యకర్తల కోసం నిర్వహించిన ఐహెచ్ఆర్‌పి, ఐడెంటిఫికేషన్ ఆఫ్ హైరిస్క్ ప్రెగ్నెన్సీ ట్రైనింగ్ మొదటి బ్యాచ్ కార్యక్రమం రంగారెడ్డి జిల్లా విజయవంతంగా పూర్తి అయింది. శిక్షణ కార్యక్రమానికి లలితాదేవి హాజరై శిక్షణను విజయవంతంగా పూర్తిచేసిన ఎఎన్‌ఎంలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైరిస్క్ గర్భధారణ ప్రారంభ దశలోనే గుర్తించడం సరైన ట్రాకింగ్ నిర్వహించడం సమయానుకూలంగా వారిని అనుసరించ చేయడం ద్వారా మాతా, శిశు మరణాలను తగ్గించవచ్చు అని పేర్కొన్నారు. అదేవిధంగా ఎన్‌సిపి కార్డులో గర్భిణీలకు సంబంధించిన అన్ని వివరాలను కచ్చితంగా, పూర్తిగా అప్డేట్ చేయడం ఎంతో ముఖ్యమని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్య కార్యకర్తల్లో హైరిస్క్ గర్భదారుల గుర్తింపు ట్రాకింగ్, నిర్మాణపై అవగాహన మరింత పెరిగి మాతా, శిశు ఆరోగ్య సేవలు మరింత బలోపేతం అవుతాయని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో పిఒఎంసిహెచ్ డాక్టర్ రాధిక, డాక్టర్ పూనం, డాక్టర్ సర్వాణి, డాక్టర్ కావ్య, ఆర్మాన్ స్వచ్ఛంద సంస్థ చెందిన డాక్టర్లు డెమో కె.శ్రీనివాసులు, డిపిచ్ ఎన్ఓ మనుమదమ్మ పాల్గొని సూచనలు చేశారు.

# ఎన్నికలు ముగిసే వరకు ఆంక్షలు అమలు

### పోలింగ్, కౌంటింగ్ సందర్భంగా మద్యం, కల్లు దుకాణాలు మూసివేత

రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి వెల్లడి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని అనుసరిస్తూ జిల్లాలో చేవెళ్ళ, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, మొయినాబాద్, శంకర్‌పల్లి మున్సిపాలిటీల పరిధిలో ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని, ఎన్నికలు ముగిసేంత వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో ఎవరు బహిరంగ ఎన్నికల ప్రచారం చేయరాదని అన్నారు. ఎఫ్ఎస్ టి,ఎస్ఎస్‌టి, ఎంసిసి బృందాలు, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా సోమవారం సాయంత్రం నుంచి 11వ తేదీ పోలింగ్ ముగిసేంత వరకు మద్యం షాపులను, కల్లు దుకాణాలను మూసివేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పురస్కరించుకుని 13న కూడా మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలని, కౌంటింగ్ ముగిసేంత వరకు డ్రై డే అమలులో ఉంటుందని తెలిపారు. ఎన్నికలు జరిగే మున్సిపాలిటీల పరిధిలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు ఈనెల 10న సెలవు ఉంటుందని, పోలింగ్ రోజు ఈనెల 11వ తేదీన ఎన్నికలు జరిగే మున్సిపాలిటీల పరిధిలో అన్ని ప్రవేటు, ప్రభుత్వ విద్యాసంస్థలు, కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్ సంస్థలు, వాణిజ్య సంస్థలలో పని చేసే ఉద్యోగులకు వారి ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా సెలవు ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.

#### మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది మూడవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను సాధారణ పరిశీలకులు మాయాంక మిట్టల్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, సమక్షంలో నిర్వహించారు. ఎన్నికలు నిర్వహించవలసి ఉన్న ఆరు మున్సిపాలిటీలకు సంబంధించి ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు,సహాయ ప్రిసైడింగ్ అధికారులకు, కౌంటింగ్ సిబ్బందికి, మైక్రో అబ్జర్వర్స్ మూడవ ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఎవరైనా ఎన్నికల విధులకు గైర్హాజరు అయినట్లయితే ఎన్నికల నిబంధనలను అనుసరించి కఠిన చర్యలు తీసుకోబడుతాయని కలెక్టర్ సి.నారాయణరెడ్డి హెచ్చరించారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా పంచాయతీ అధికారి వి.సురేష్ మోహన్, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లాస్థాయి సిఎం కప్ క్రీడా పోటీలు




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా స్థాయి ముఖ్యమంత్రి కప్ పోటీలు సోమవారం సరూర్ నగర్ లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ మరియు ఖోఖో విభాగాలలో పోటీలు జరిగాయి. పోటీల్లో రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల నుండి వేయిమందికి పైగా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీలలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు మెరిట్ సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఒలింపిక్ అధ్యక్షులు మల్లారెడ్డి, జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ అధికారి ఎర్రబెల్లి వెంకటేశ్వర్ రావు, అసోసియేషన్ కార్యదర్శులు రవికుమార్, రాఘవరెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి రామచంద్రుడు, షబీర్, జిల్లా కోచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు హాజరై నిర్వహించారు. పోటీలలో విజేతలుగా నిలిచిన జట్లు మరియు క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి సిఎం కప్ పోటీలలో రంగారెడ్డి జిల్లాను ప్రాతినిధ్యం వహించనున్నారు.

**పోటీల ఫలితాలు: ఖో-ఖో (బాలురు):** విజేతలు ఎల్ బినగర్ నియోజకవర్గ జట్టు, రన్నర్స్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ జట్టు

**ఖో-ఖో (బాలికలు):** విజేతలు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ జట్టు రన్నర్స్ ఎల్ బి నగర్ నియోజకవర్గ జట్టు

**బాస్కెట్‌బాల్:** విజేతలు ఎల్ బి నగర్ నియోజకవర్గ జట్టు

## ముంపు ప్రాంతాలకు శాశ్వత విముక్తి కల్పిస్తా

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**ప్రజాపక్షం/హయత్ నగర్:** నియోజకవర్గ పరిధిలోని ముంపు ప్రాంతాలు గుర్తించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాశ్వత విముక్తి కల్పిస్తానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. సోమవారం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని వెస్ట్ ఆగమయ్య నగర్ కాలనీ లో రెయిన్ వాటర్ ట్రంక్ లైన్ సిసి రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికి ఎగువనున్న కాలనీల నుంచి వచ్చే వర్షపునీరు వల్ల దిగువ ప్రాంతాల కాలనీలు జలమయం అవుతున్నాయని గుర్తు చేశారు. రెయిన్ వాటర్ ట్రంక్ లైన్ నిర్మాణాలతో ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తన వంతు సహాయసహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, మాజీ అధ్యక్షులు జగదీష్ యాదవ్, టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్ రెడ్డి, కన్నా, కాలనీ గౌరవ అధ్యక్షులు బాలరాజ్ గౌడ్, ఆంజనేయులు, అధ్యక్షుడు యాదయ్య, సెక్రటరీ వసుధ కోశాధికారి సుజాత, జనార్ధన్ రెడ్డి, బోసు వెంకటయ్య చారి, గోవర్ధన్, ఉమేష్ కుమార్, రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుక మజ్లిస్

ఎంఐఎం అధినేత, ఎంపి అసదుద్దీన్ ఓవైసీ



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ప్రజల పక్షాన వాణి వినిపించే ప్రశ్నించే గొంతుకగా మజ్లిస్ పార్టీ ఉంటుందనే విషయాన్ని ఓటర్లు గ్రహించాలని ఎంఐఎం అధినేత, హైద్రాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ పేర్కొన్నారు. సోమవారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులో ఎంఐఎం అభ్యర్థి గౌస్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేశారు. వార్డులోకి కాలనీల్లో పర్యటించి ఎంఐఎం బలపరిచి అభ్యర్థి గౌస్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎంపి అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగినా వారి పక్షాన ప్రశ్నించే గొంతుకగా ఎంఐఎం ఉంటుందనే విషయాన్ని ప్రజలందరు గ్రహించాలన్నారు. షాద్‌నగర్ మున్సిపల్ ఎన్నికల్లో మొదటి వార్డు నుండి ఎంఐఎం మాత్రమే పోటీ చేస్తుందని, ఓటర్లు ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అన్యాయాలు, అక్రమాలు జరిగినప్పుడల్లా ప్రశ్నించే గొంతుక మజ్లీస్ పార్టీ అవుతందని వివరించారు. అభ్యర్థి గౌస్ మాట్లాడుతూ షాద్‌నగర్ మున్సిపాలిటిలోని మొదటి వార్డులో జరిగిన అనేక సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించడం జరిగిందని వివరించారు. మున్సిపాలిటిలో ఉన్న ఒక్క సీటును భారీ మెజార్టీతో గెలిపిస్తే ప్రజా సమస్యలపై మున్సిపాలిటిలో ప్రశ్నించడం జరుగుతుందని తెలిపారు.

## నర్సరీలు ఎండిపోకుండా జాగ్రత్తలు

**ప్రజాపక్షం/యాచారం :** వేసవిలో నిటి ఎద్దడితో నర్సరిలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని యాచారం ఎంపిడిఒ రాధరాణి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తులేకుర్థు గ్రామంలో ఆమె పర్యటించారు. ఈసందర్బంగా మాట్లాడుతూ నర్సరిల్లో ఎలాంటి సమస్యలున్న తమ దృష్టికి తెస్తే పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామంలో తాగునిటి ఎద్దడి తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని అదేశించారు. గ్రామాభివృద్ధిలో సమస్యలుంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అంబోజి రమేశ్ , వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్ళలో చేసిన అభివృద్ధి పనులే గెలిపిస్తాయ్

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రెండేళ్ళ కాలంలో మున్సిపాలిటీలో చేసిన అభివృద్ధి పనులే కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం మున్సిపల్ ఎన్నికల ప్రచారం చివరి రోజు కావడంతో షాద్‌నగర్ మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ అభ్యర్థులతోపాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి మున్సిపాలిటీ పరిధిలోని 28వార్డుల్లో అనేక సంక్షేమ పథకాలను చేపట్టడంతోపాటు అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు ఏ స్థాయిలో విశ్వాసం ఉందో ర్యాలీకి వచ్చిన ప్రజలను చూస్తేనే అర్థం అవుతుందని వివరించారు. ప్రతిపక్ష పార్టీలకు ప్రజలు ఓట్ల రూపంలో గుణపాఠం చెప్పడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పేద ప్రజలు అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి పూర్తిస్థాయిలో తీసుకువెళ్ళెందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే భవిష్యత్‌లో వార్డులను అభివృద్ధి చేయడంతో పాటు ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అయిందనే విషయాన్ని ప్రజలు గ్రహించాలని, మున్సిపాలిటీలో ఓటర్లు ఆలోచించి హస్తం గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. ర్యాలీలో మాజీ జడ్పిటిసిలు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, పి.వెంకట్ రాంరెడ్డి, తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డితోపాటు వివిధ మండల పార్టీల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ 28మంది అభ్యర్థులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily

హైదరాబాద్
మంగళవారం
10-02-2026
www.prajapaksham.in

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న 'డ్రాగన్' సినిమా షూటింగ్ కోసం ఎన్టీఆర్ ప్రస్తుతం జోర్డాన్ వెళ్లారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఆయన కనిపించిన రగ్గడ్‌లుక్, గుబురు గడ్డం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

రీల్

## 'స్వయంభు'లో కత్తి యుద్ధం నేర్చుకున్న నిఖిల్



కార్తికేయ 2తో దేశ వ్యాప్తంగా ప్రశంసలు పొందిన నిఖిల్ ఇప్పుడు తన ప్రతిష్ఠాత్మక 20వ చిత్రం 'స్వయంభు'తో ప్రేక్షకులను అలరించబోతున్నారు. భారీ స్థాయిలో నిర్మించబడిన ఈ హిస్టారికల్ యాక్షన్ చిత్రానికి భరత్ కృష్ణమాచా రి దర్శకత్వం వహించారు. సంయుక్త, నభా నటేష్ హీరోయిన్ లుగా నటిస్తున్నా రు.పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్ పై భువన్, శ్రీకర్ నిర్మించారు. ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. పాన్‌ఇండియా విజన్ తో వస్తున్న స్వయంభు నిఖిల్ కెరీర్ లో మరో మై లు రాయిగా నిలవనుంది నిర్మాత ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ స్వ యంభు టీజర్ ఫిబ్రవరి 11న రిలీజ్ చేయనున్నట్లు నిర్మాత ప్రకటించారు. ఈ సందర్భం గా నిఖిల్ యాక్షన్ లుక్ తో కూడిన పోస్టర్ ను విడుదల చేశారు. స్వయంభు నిఖిల్ కెరియర్ లో హైయెస్ట్ బడ్జెట్ సినిమా. కార్తికేయ 2 తర్వాత పాన్ ఇండియా స్థాయిలో హ్యూజ్ బజ్ వున్న సినిమా ఇది. ఇందులో తన పాత్ర కోసం నిఖిల్ పూర్తిగా ఫిజికల్ ట్రాన్స్ ఫర్మేషన్ అవ్వడంతో పాటు ఇంటెన్స్ ట్రైనింగ్ తీసుకున్నారు.రాజమౌళితో ఐకానిక్ సినిమాలు అందించిన సెంథిల్ కుమార్ సినిమాకి డీఓపి గా పనిచేయడం విశేషం. కేజీఎఫ్, సలార్ ఫేం రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఎం. ప్రభాహరన్, రవీంద్ర ప్రొడక్షన్ డిజైనర్ గా పని చేస్తున్నారు. అన్ని పనులు పూర్తి చేసి స్వయంభు చిత్రాన్ని ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్ తమ్మిరాజు, మాటలు విజయ్ కామిశెట్టి, ఫైట్స్ కింగ్ సోలమన్, స్టంట్ సిల్వా, పాటలు రామజోగయ్య శాస్త్రి.

## 'మృత్యుంజయ్'లో ఐపిఎస్ సీతాగా రేబా మోనికా



శ్రీ విష్ణు హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మృత్యుంజయ్'. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వం వహిస్తున్నారు. రమ్య గున్నం సమర్పణలో లైట్‌బాక్స్ మీడియా, పిక్చర్ పర్‌ఫెక్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్‌పై సందీప్ గున్నం, వినయ్ చిలకపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.'సామజవరగమన' మూవీ తర్వాత శ్రీవిష్ణు, రేబా మోనికా జాన్ జంటగా నటిస్తున్నారు. ఈ సినిమాలో రేబా మోనికా జాన్ పోషిస్తోన్న ఐపీఎస్ సీతా పరుశురామ్ పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. అందం, అభినయంతో కుర్రకారు హృదయాలను దోచుకున్న ముద్దుగుమ్మ రేబా జాన్ మృత్యుంజయ్ చిత్రంలో మరో ఆసక్తికరమైన పాత్రలో కనిపించనుంది. ఆమె పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌లో ఆమె తనదైన నటనతో ఎలాంటి థ్రిల్స్ ఇవ్వనుందోనని అందరూ ఎదురు చూస్తున్నారు. మృత్యుంజయ్ చిత్రం ఫిబ్రవరి 27న థియేటర్లలో సందడి చేయబోతోంది. శ్రీవిష్ణు స్టైల్‌కు తగ్గట్టుగా రూపొందిన ఈ థ్రిల్లర్, మరో ఉత్కంఠతను రేపే ఎంటర్‌టైనర్‌గా నిలుస్తుందనే అంచనాలు ఉన్నాయని నిర్మాతలు అంటున్నారు. శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా వర్క్ చేస్తున్న ఈ చిత్రానికి విద్యాసాగర్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా కాల భైరవ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. మనీషా ఎ.దత్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వర్క్ చేస్తున్నారు.

# సరిపడే వినోదాన్ని అందిస్తాం..

### 'ఆల్ఫా' ట్రైలర్ లాంచ్ లో హీరో హేమంత్ కుమార్



ఎల్‌వి ప్రొడక్షన్స్ బ్యానర్ మీద హేమంత్ కుమార్, అయానా, గోపిక సురేష్ ప్రధాన పాత్రల్లో విజయ్ ఎన్ తెరకెక్కించిన చిత్రం 'ఆల్ఫా'. ఉప శీర్షిక మెన్ లవ్ వెంజన్స్. ఈ సినిమాని హేమంత్ కుమార్, ఆనంద్ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 20న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ మూవీని తెలుగులో రవిశంకర్, మంజునాథ్ డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. ఈ క్రమంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకుడు సముద్ర ముఖ్య అతిథిగా హాజరైయ్యారు.'అంతా ఆ దేవుడి అనుగ్రహంతో జరుగుతుంది అంటే.. మరి ఆ రాక్షసులు' అనే డైలాగ్‌తో ట్రైలర్‌ను ఓపెన్ చేశారు. ఇక వెంటవెంటనే చూపించిన యాక్షన్ సీక్వెన్స్, రౌడీ గ్యాంగ్, మాఫియా సీన్లు అన్నీ అదిరిపోయాయి. 'నేను బరిలోకి కొత్తగా వచ్చాను.. ఆటకు కాదు' అనే హీరో డైలాగ్ మాసీగా ఉంది. మధ్యలో హీరో, హీరోయిన్ ట్రాక్.. రొమాంటిక్ సీన్లు కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి. 'నాకు పాస్ట్, ప్రజెంట్, ఫ్యూచర్ అంతా మా నాన్నే' అనే డైలాగ్‌తో ఇందులో ఫాదర్ సెంటిమెంట్, ఫ్యామిలీ ఎమోషన్స్ ఎలా ఉండబోతోన్నాయో చెప్పేశారు. ఇక చివర్లో షర్ట్ లెస్ సీన్, సిక్స్ ప్యాక్ చూపించిన తీరు మాస్ ఆడియెన్స్‌కి నచ్చేలా ఉన్నాయి. ట్రైలర్ రిలీజ్ చేసిన అనంతరం హీరో హేమంత్ కుమార్ మాట్లాడుతూ 'నాకు తెలుగు సినిమాలంటే చాలా ఇష్టం. నాలాంటి కొత్త వాళ్ల చిత్రాల్ని ఇలా ఎంకరేజ్ చేయడం ఆనందంగా ఉంది. ప్రేక్షకులు పెట్టే డబ్బులకు సరిపోయే ఎంటర్‌టైన్‌మెంట్‌ను మేం అందిస్తాం. ప్రముఖ దర్శకుడు సముద్ర మాట్లాడుతూ ''ఆల్ఫా' ట్రైలర్ అద్భుతంగా ఉంది. కన్నడ నుంచి వస్తున్న హీరోలంతా ఇక్కడ సక్సెస్ కొడుతున్నారు. యశ్, రిషబ్ శెట్టిలా హేమంత్ కూడా పెద్ద విజయాన్ని అందుకోవాలి. 'కేజీయఫ్', 'కాంతార' స్థాయిలో 'ఆల్ఫా'ని ఆడియెన్స్ ఆదరించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.హీరోయిన్లు అయానా, గోపికా సురేష్, డిస్ట్రిబ్యూటర్ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉర్రూతలూగించేలా 'యమ యమ్మ'



విశ్వక్ సేన్, దర్శకుడు కె.వి. అనుదీప్ కలయికలో వస్తున్న 'ఫంకీ' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్, 'ధీరే ధీరే', 'రట్టాటటావ్' పాటలకు అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా ఈ చిత్రం నుంచి మూడవ గీతం 'యమ యమ్మ' విడుదలైంది.తి రుపతిలో ఈ గీతావిష్కరణ వేడుక ఘనంగా జరిగింది. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ మాస్ గీతం విన్న వెంటనే ఆకట్టుకునేలా ఉంది. అందరూ కాలు కదిపేలా భీమ్స్ అందించిన ఉత్సాహభరిత సంగీతం, ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దేవ్ పవార్ అందించిన సాహిత్యం, మాస్ పాటకు తగ్గట్టుగా మళ్ళీ మళ్ళీ పాడుకునేలా ఉంది. గాయని రోహిణి సోరట్ తో కలిసి సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఈ పాటను ఆలపించడం విశేషం. తమ ఉత్సాహభరితమైన గాత్రంతో పాటను మరో స్థాయికి తీసుకెళ్లారు. నాయకానాయికలు విశ్వక్ సేన్, కయాదు లోహర్ పై చిత్రీకరించిన ఈ పాట.. అదిరిపోయే మాస్ బీట్‌లు, ఆట సందీప్ మాస్టర్ అద్భుతమైన నృత్యరీతులతో మాస్ పాటల అభిమానులకు విందు భోజనంలా మారింది. గీతావిష్కరణ కార్యక్రమంలో విశ్వక్ సేన్ మాట్లాడుతూ 'ఒక మంచి సినిమా అందించాలనే ఉద్దేశంతోనే సంవత్సరం విరామం తీసుకొని ఫంకీ సినిమా చేశాను. ఈ చిత్రం మీ అందరినీ మెప్పిస్తుంది. ఇదొక క్లీన్ ఎంటర్టైనర్. మీ కుటుంబంతో కలిసి థియేటర్ కి రండి. రెండు గంటల పది నిమిషాల పాటు అన్నీ మర్చిపోయి కడుపుబ్బా నవ్వుకుంటారు. ఫిబ్రవరి 13న థియేటర్లలో కలుద్దాం. మిమ్మల్ని ఈ సినిమా అసలు నిరాశపరచదు.' అన్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతానికి శ్రోతలలో ఉండే ఆదరణ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరంలేదు. ఆ అంచనాలకు ఏ మాత్రం తగ్గకుండా తొలి గీతం 'ధీరే ధీరే', రెండో గీతం 'రట్టాటటావ్' చార్ట్‌బస్టర్స్ గా నిలిచాయి. ఇప్పుడు 'యమ యమ్మ' కూడా అదే జోరును కొనసాగిస్తూ సంగీత ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఇటీవల విడుదలైన 'ఫంకీ' ట్రైలర్ విశేష స్పందనను సొంతం చేసుకుంది అన్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఎక్కడా రాజీ పడకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం కానుకగా ఒకరోజు ముందుగా ఫిబ్రవరి 13న థియేటర్లలో ఫంకీ' చిత్రం విడుదల కానుంది.

## విప్లవ వీరుడు' షూటింగ్ ప్రారంభం



భారత స్వాతంత్ర సంగ్రామంలో సామాన్యులే వీరులై పోరాడిన చరిత్రను తెరకెక్కిస్తున్న మూవీ 'విప్లవ వీరుడు'. ప్రముఖ నటి ఇంద్రజ కీలక పాత్రలో జైశ్వర్ సోనాలి జంటగా ఎస్ నాగరాజ్ రావు దర్శకత్వంలో ఏవీ జయరాం నిర్మిస్తున్న ఈ సినిమా ఫిలింనగర్ దైవ సన్నిధానంలో పూజా కార్యక్రమాలతో షూటింగ్ ప్రారంభించుకుంది. ముహూర్తం షాట్‌కు ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ ఇంద్రజపై క్లాప్ కొట్టి సినిమా షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంద్రజ మాట్లాడుతూ, సామాన్య ప్రజలు కూడా స్వాతంత్ర పోరాటంలో ఎలా పాల్గొన్నారు అనే అంశాన్ని ఈ సినిమాలో చూపించబోతున్నాం. ఒక సామాన్యుడు విప్లవ వీరుడిగా మారి స్వతంత్ర ఉద్యమంలో వీరోచితంగా పోరాడే కథ ఇది. ఈ చిత్రంలో నేను రాణి భవానీదేవి పాత్రలో కనిపించబోతున్నాను.హీరో జైశ్వర్ మాట్లాడుతూ విప్లవ వీరుడు పాత్రలో ప్రేక్షకుల ముందుకు రానున్నాను. ఈ పాత్ర నాకు ఎంతో ప్రత్యేకం. సినిమా చరిత్రలో నిలిచిపోతుంది అని చెప్పారు. హీరోయిన్ సోనాలి మాట్లాడుతూ, నాకు ఇంత అద్భుతమైన అవకాశం ఇచ్చినందుకు ఎంతో కృతజ్ఞతలు. ఇది నా మొదటి సినిమా. దర్శకుడు ఎస్ నాగరాజు రావు మాట్లాడుతూ ఇది నా డ్రీమ్ ప్రాజెక్ట్. బ్రిటిష్ కాలం నాటి హిస్టారికల్ కథతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. ఇందులో ఇంద్రజ గారు కీలకమైన పాత్రలో నటిస్తున్నారు అని తెలిపారు. నిర్మాత ఏవీ జయరాం మాట్లాడుతూ,టిప్పు సుల్తాన్ కాలం నాటి కథ ఇది. బ్రిటిష్ వారు వ్యాపారం పేరుతో దేశాన్ని ఎలా దోచుకున్నారో, ఆ పరిణామాలను ఈ సినిమాలో చూపిస్తున్నాం. మంచి సందేశం ఇచ్చే సినిమా అవుతుంది అని చెప్పారు. ఈ చిత్రానికి డిజిపి : మాత్యు రాజన్ మ్యూజిక్: ఉదయ్, ఎడిటర్: ఎం ఎన్ ఆర్ .

## 'ఆకాశంలో ఒక తార' క్లైమాక్స్



పాన్‌ఇండియా స్టార్‌డమ్‌తో దూసుకుపోతున్న వెర్సటైల్ హీరో దుల్కర్ సల్మాన్ తాజాగా న టిస్తున్న చిత్రం 'ఆకాశంలో ఒక తార'. విలక్షణ క థలతో ఆకట్టుకునే పవన్ సాదినేని ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా సమర్పణలో ఈ చిత్రాన్ని సందీప్ గున్నం, రమ్య గున్నం నిర్మిస్తున్నారు. దుల్కర్ సరసన కొత్త హీరోయిన్ సాత్విక వీరవల్లి కథానాయికగా నటిస్తోంది. ఈ సినిమా క్లైమాక్స్ షూటింగు రాజమండ్రిలో జరుగుతోంది. శృతి హాసన్ ఈ చిత్రంలో ఒక కీలక పాత్ర చేస్తున్నారు. ఇప్పటికే శృతి హాసన్ పాత్రకు సంబధించిన ఫస్ట్ లుక్ విడుదల చేశారు.ఈ చిత్రానికి జి.వి. ప్ర కాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సుజిత్ సారంగ్ సినిమాటోగ్రఫర్‌గా పని చే స్తున్నారు. శ్వేతా సాబు సిరిల్ ప్రొడక్షన్‌ను పర్యవేక్షిస్తున్నారు.ఈ చిత్రం వేసవిలో తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషలలో పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

## సిపిఐ సంపూర్ణ మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

రక్షించాలని డి.రాజా తన ప్రకటనలో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా, ఖేత్ మజ్దూర్ యూనియన్లు మద్దతుతో కేంద్ర కార్మిక సంఘాలు గురువారం సార్వత్రిక సమ్మెకు పిలుపు ఇచ్చాయి. అమెరికా–యూరప్ దేశాలతో ఇటీవలి వాణిజ్య ఒప్పందాలు దేశంలో రైతుల ప్రయోజనాలకు తీవ్రమైన సవాళ్ళగా మారాయని, అందువల్ల రైతుల ప్రయోజనాలు రక్షించేందుకు ప్రభుత్వం నుండి సరైన వివరణ, ఒక కార్యాచరణ ప్రక్రియ చాలా అవసరమని కోరారు. అదేవిధంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో తెచ్చిన వికసిత్ భారత్–గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) చట్టం–2025తో గ్రామీ ఉపాధి హామీ పథకం ప్రాథమిక హక్కులను అణచివేశారని విమర్శించారు. దేశంలో నిరుద్యోగం, తీవ్ర అసహనం తాండవిస్తున్న తరుణంలో ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడిందని, అదేవిధంగా ఈ పథకం కింద ఆర్థిక భారాన్ని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల్లో ప్రభుత్వాలపై నెట్టివేయడం ఎంత మాత్రం సమ్మతం కాదని, అందువల్ల ఈ భారాలను వెంటనే వెనక్కు తీసుకోవాలని డి.రాజా కోరారు.

## వచ్చేవారం రాజీనామా?

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయి. ఆయన నియమించిన పీటర్ మాండెల్సన్ దౌత్యవేత్త పదవికి రాజీనామా చేసి ఈనెలారంభంలో లేబర్ పార్టీ నుండి కూడా వైదొలగినప్పటికీ, ప్రతిపక్షాలు స్టార్‌మర్‌ను వదిలిపెట్టడంలేదు. మాండెల్సన్ అదేపనిగా అబద్ధాలు చెప్పారని, ఎప్‌స్టీన్‌తో ఎంత లోతుగా ఆయనకు సంబంధాలున్నాయో తెలియదని, ఈ విషయంలో తనను క్షమించాలని గతవారంలోనే స్టార్‌మర్ ఒక ప్రకటన విడుదల చేశారు. కానీ, స్టార్‌మర్ ఉద్దేశపూర్వకంగా మాండెల్సన్‌ను కాపాడేందుకు ప్రయత్నం చేశారని, మాండెల్సన్‌ను శిక్షించాల్సిందేనని, ప్రధానమంత్ర రాజీనామా చేయాల్సిందేనని ప్రతిపక్షాల నుండి రోజు రోజుకూ విపరీతమైన ఒత్తిడి పెరుగుతోంది. ఆయన విమర్శలపాలవుతున్నారు. స్టార్‌మర్ ప్రభుత్వాన్ని నడిపించడంలో మెక్‌స్వీనీ ప్రధాన సూత్రధారి. ఇప్పటికే స్టార్‌మర్ సిబ్బందికి ప్రధానాధిపతిగా ఉన్న మోర్గాన్ మెక్‌స్వీనీ ఆదివారం తన పదవికి రాజీనామా చేశారు. పీటర్ మాండల్సెన్‌ను నియమించాలని ప్రధానమంత్రి స్టార్‌మర్‌కు సలహా ఇచ్చినందుకుగాను పూర్తి బాధ్యత వహిస్తూ మోర్గాన్ మెక్‌స్వీనీ పదవి నుండి వైదొలగారు. ఐతే ఆయన రాజీనామా స్టార్‌మర్ రాజీనామాకు ఎలా దారితీస్తుంది? స్టార్‌మర్‌పై మెక్‌స్వీనీ,మాండెల్సన్ ప్రభావం ఎంత ఉంది? అనే విషయాలు రాబోయే వారం రోజుల్లో బయటపడనున్నాయి.

ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో మాండెల్సన్ భాగోతం గత ఏడాదిలోనే బయట పడింది. ఎప్‌స్టీన్‌తో రాసుకుపూసుకు తిరిగిన మాండెల్సన్‌కు నిధులు కూడా ముట్టాయి. దీంతో గడచిన సెప్టెంబరునెలలో మాండెల్సన్ అమెరికాలో బ్రిటన్ దౌత్యవేత్త పదవికి రాజీనామా చేశారు. తాజాగా అమెరికా ఫెడరల్ న్యాయస్థాన విభాగం డిఓజె జనవరి 30వ తేదీ విడుదల చేసిన పత్రాలలో ఆయన అవినీతి చరిత్ర, స్త్రీలతో సంబంధాలు వెలుగుచూడటంతో స్టార్‌మర్ ప్రభుత్వం ప్రతిష్ఠ కోల్పోయింది. ఇక తనవల్ల లేబర్‌పార్టీ సమస్యలకు గురికాకూడని ప్రకటిస్తూ ఆయన పార్టీకి రాజీనామా చేశారు.

ఐతే తాను ఎలాంటి తప్పు చేయలేదని ఇప్పటికీ ఆయన వాదిస్తున్నారు. 'మాండెల్సన్‌ను అమెరికాలో బ్రిటన్ దౌత్యవేత్తగా నియమిస్తూ తప్పుడు నిర్ణయం తీసుకున్నాం, దానికి నేనే పూర్తి బాధ్యత వహిస్తున్నాను, ఆయన లేబర్‌పార్టీ పరువు ప్రతిష్టలకు భంగం కలిగించారు, దేశాన్ని భ్రష్టుపట్టించారు, రాజకీయాల్లో దేశ విశ్వాసాన్ని గంగలో కలిపారు' అని రాజీనామా సమర్పించిన సందర్భంగా మెక్‌స్వీనీ లిఖితపూర్వకంగా తెలియజేశారు.

## 24న చలో సెక్రటేరియట్

### టిజిఎస్ ఆర్‌టిసిజెఎసి పిలుపు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆర్‌టిసి కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్‌టిసి జెఎసి ఆధ్వర్యంలో ఈనెల 24న చలో సెక్రటేరియట్ చేపట్టనున్నట్లు జెఎసి నేతలు తెలిపారు. ఆర్‌టిసిఎంప్లాయీస్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో సోమవారం జెఎసి నాయకులు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి.మౌలానా, కోకన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరి పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌టిసి కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సుమారు రెండున్నర సంవత్సరాల నుండి జెఎసి ఆధ్వర్యంలో పలు ఉద్యమాల ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, యాజమాన్యం దృష్టికి తీసుకు వెళ్ళినప్పటికీ హామీల అమలుకు నోచుకోలేదని జెఎసి నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలలో ప్రధానంగా ఆర్‌టిసిఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు యూనియన్లపై ఆంక్షలను ఎత్తివేసి, 2021 వేతన సవరణ అమలు, ఆర్‌టిసి విస్తరణ, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని సౌకర్యాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి ఏ ఒక్కటీ అమలు చేయకుండా వాటిని ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఆర్‌టిసి కార్మికులపై ఈ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పెట్టి కార్మికులపై విపరీతమైన పనిభారాలు మోపిందని, రోజుకు 16 గంటలు బలవంతంగా డ్యూటీలు చేయిస్తూ కార్మికుల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కార్మికులలో రోజు రోజుకూ అసంతృప్తి, వ్యతిరేకత తీవ్రరూపం దాలుస్తున్నాయని, అందులో భాగంగా జెఎసి నాయకత్వం ఫిబ్రవరి 24న 'చలో సెక్రటేరియట్' కార్యక్రమానికి పిలుపునిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక వర్గం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల నుండి పెద్ద యెత్తున తరలివచ్చి 'చలో సెక్రటేరియట్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఈ సమావేశంలో సి.ఎన్.కృష్ణ (ఎన్ఎంయు), జె.రాఘవులు, ఎన్.బాల్ రెడ్డి, ఎం.ఎ.మజీద్ (ఈయు), ఎన్.బుద్ధ విశాల్(బికెయు), డి.రాంచందర్ (బిడబ్ల్యూయు), పాపయ్యగౌడ్, ము త్యాలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్లిష్టదశలో కార్మికవర్గం

(మొదటి పేజీ తరువాయి)

వారిని కాంట్రాక్టు ఉద్యోగులుగా నియమించుకుంటున్నారని, మరోవైపు ప్రజల ప్రజాస్వామ్య హక్కులపై దాడులు పెరిగిపోయాయని, మైనారిటీలపై విద్వేషం పెంచి విభజించి పాలించే విషపూరిత ప్రచారం జరుగుతున్న పరిస్థితుల్లో కార్మికులు సమ్మె చేయవలసి వచ్చిందని ఐక్య వేదిక స్పష్టం చేసింది. వ్యూహాత్మకమైన ప్రభుత్వరంగ అధీన సంస్థలను అమ్మకానికి పెట్టి, రైల్వే, రేవులు, ఓడల నిర్మాణ సంస్థలు, బొగ్గగనులు రక్షణ, రహదారులు, విమానాశ్రయాలు, బ్యాంకులు, బీమా, టెలికాం, పోస్టల్, అణు, ఇంధ, విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వంటి ప్రభుత్వ సేవలను భారీ వాణిజ్య వ్యవస్థలు, స్వదేశ విదేశీ సంస్థలకోసం ప్రైవేటీకరణ చేసే చర్యలను ప్రభుత్వం కొనసాగిస్తోందని ఐక్యవేదిక నాయకులు విమర్శించారు. ఈ చర్యలన్నీ దేశీయ పరిశ్రమల వృద్ధికి, ఆర్థిక వ్యవస్థ స్వయంసమృద్ధికి, కార్మికులకు తీవ్ర హాని కలిగిస్తాయని పేర్కొన్నారు. రైతుల సమ్మెవల్ల అనివార్యంగా మూడు వ్యవసాయ చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోవాల్సివచ్చిన తర్వాత వివిధ మార్గాల్లో రైతు వ్యతిరేక విధానాలను కేంద్రం కొనసాగిస్తూ తాజాగా విత్తన బిల్లును తీసుకువచ్చి రైతులపై తీవ్రమైన దాడికి పాల్పడిందని ఐక్యవేదిక విమర్శించింది. కొత్త ఆర్థిక సంవత్సరానికి ఈ నెలారంభంలో చేసిన కేటాయింపులు కూడా అర్థంపర్థం లేకుండా మారాయని విమర్శించింది. కేంద్ర ప్రభుత్వం ప్రజల న్యాయబద్ధమైన డిమాండ్లకు సానుకూలంగా ప్రతిస్పందించడానికి బదులుగా తమకు అనుకూలంగా ఉన్న పెట్టుబడిదారులకు, కార్పొరేట్ ప్రపంచానికి మేలు చేయడంకోసం వివిధ వర్గాల ప్రజలపై దాడులను ఉధృతం చేసిందని విమర్శించారు.

ఈ దేశా న్ని ఒక సంక్షేమ వ్యవస్థగా కొనసాగించేందుకు కేంద్రం ఎంతమాత్రం ఇష్టపడటంలేదని, అందుకే మహాత్మా గాంధీ ఉపాధిపథకం స్థానంలో విబి జీ రామ్ జీ చట్టాన్ని తెచ్చిందని విమర్శించారు. ఇదిలా ఉండగా, బడ్జెట్ సమావేశాల్లో ఇటీవల ఇండియా కూటమి పార్టీలకు చెందిన ఎంపిలు నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ పార్లమెంటు ఆవరణలో నిరసన కార్యాచరణ చేపట్టడం పట్ల ఐక్యవేదిక హర్షం ప్రకటించింది.

### కార్మిక సంఘాల ఐక్యవేదిక ప్రధాన డిమాండ్లు ఇవే

- ✻ నాలుగు లేబర్ కోడ్స్, నిబంధనలను రద్దు చేయాలి
- ✻ ముసాయిదా విత్తనబిల్లు, విద్యుత్ సవరణ బిల్లులను ఉపసంహరించాలి.
- ✻ లాభాల పేరుతో అత్యంత ప్రమాదకరమైన అణు ఇంధన ఉత్పత్తి వంటి విభాగాలలోకి విదేశీ సంస్థలను, దేశీయ ప్రైవేటు సంస్థలను అనుతించేందుకు ఉద్దేశించిన 'శాంతి చట్టం'ను ఉపసంహరించుకోవాలి.
- ✻ విబి జీ రామ్ జీ చట్టాన్ని రద్దుచేసి దశాబ్దాలుగా కొనసాగుతున్న గ్రామీణ కార్మికులకు మేలు చేసే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి.
- ✻ బీమా రంగ కంపెనీలలో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- ✻ వికసిత్ భారత్ శిక్ష ఆధిష్ఠాన్ బిల్లు–2025ను వెనక్కు తీసుకోవాలి.
- ✻ ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలి. అంగన్‌వాడీ, ఆశా, ఎండిఎం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చాలి, ఎన్‌హెచ్‌ఎం డాక్టర్లు, నర్సులను పర్మినెంటు చేయాలి.

## కోట్లు మోసం (మొదటి పేజీ తరువాయి)

మారం సురేష్ రెడ్డి, మమతలు తమకు తెలంగాణ రాష్ట్రంలో లిక్కర్ వ్యాపార దిగ్గజాలమని మాధవరెడ్డితో పరిచయం చేసుకొని, హైదరాబాద్‌లో ఎలైట్ లిక్కర్ మార్ట్ లైసెన్స్ ఖచ్చితంగా ఇప్పిస్తామని నమ్మించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వాధికారులు, ఎక్సైజ్ శాఖ అధికారులు, మంత్రులతో తమకు సన్నిహిత సంబంధాలున్నాయని చెప్పి, ఐఎఎస్ అధికారులతో మాట్లాడుతున్నట్టు నటిస్తూ ఫోన్ కాల్స్ చేసి మోసం చేసినట్లు బాధితుడు ఆరోపించాడు. వారి మాటలు నమ్మిన మాధవ రెడ్డి, 2019 సెప్టెంబర్ నుంచి 2021 మార్చి మధ్య వివిధ తేదీల్లో సురేష్ వీల్స్, హైదరాబాద్ వైన్ మార్ట్ ఖాతాలకు చెక్కుల ద్వారా మొత్తం ₹96.20 లక్షలు చెల్లించినట్లు వెల్లడించారు.ఇంతటితో ఆగకుండా, వారి భాగస్వాములు, మధ్యవర్తులకు కమిషన్ పేరుతో రూ.17 లక్షలు, ప్రభుత్వ అధికారులను మేనేజ్ చేయడానికి అంటూ రూ.3 లక్షలు నగదు, మంత్రులకు ప్రత్యేక సౌకర్యాల పేరుతో మరో రూ.15 లక్షలు నగదు వసూలు చేసినట్లు ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నాడు. మొత్తం మీద బాధితుడి నుంచి రూ.1.26 కోట్లకు పైగా వసూలు చేసినట్లు పేర్కొన్నారు.డబ్బులు తీసుకున్న తర్వాత నిందితులు మాట దాటవేయడం, తప్పించుకోవడం మొదలుపెట్టారని, డబ్బులు అడిగితే బెదిరింపులకు దిగారని బాధితుడు తెలిపాడు. తప్పుడు కేసులు పెడతామని, ప్రాణహాని చేస్తామని బెదిరించినట్లు ఆరోపించాడు. 2025 జూన్‌లో చివరి పరిష్కారంగా అంటూ సురేష్ రెడ్డి రూ.2 కోట్ల విలువైన పోస్ట్‌డేటెడ్ చెక్కు ఇచ్చి, 20 ఎకరాల భూమికి సంబంధించిన అసలు డాక్యుమెంట్లు భద్రతగా ఇచ్చినట్లు చెప్పాడు. అయితే ఆ చెక్కు బ్యాంక్‌లో వేయగా అకౌంట్ క్లోజ్ అయిందని తిరిగి వచ్చిందని, ఇది స్పష్టమైన మోసమని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసును ఆర్థిక నేరాల విభాగం సిఐ ఇ.జహంగీర్ యాదవ్ దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు ఎలైట్ లిక్కర్ లైసెన్స్ పేరుతో పలువురిని ఇదే తరహాలో మోసం చేసినట్లు అనుమానం ఉందని పోలీసులు తెలిపారు.

## 'పచ్చి దోపిడీ'

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రాన్ని ఆదేశించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం సుమోటోగా ఈ కేసు విచారణను చేపట్టింది. 'బ్యాంకులు కేవలం లాభాపేక్షతో, వ్యాపార ధోరణిలో ఉండి, నేరగాళ్లు సులభంగా దోపిడీ సొమ్మును తరలించడానికి వేదికలుగా మారుతున్నాయి' అని జస్టిస్ బాగ్చీ అన్నారు. 2021 ఏప్రిల్ నుంచి 2025 నవంబర్ మధ్య మన దేశంలో ఏకంగా రూ.52వేల కోట్ల సైబర్ మోసాలు జరిగినట్లు హోంశాఖ నివేదిక పేర్కొన్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇది 'అనేక రాష్ట్రాల వార్షిక బడ్జెట్ కంటే ఇది చాలా ఎక్కువ మొత్తం' అని సిజెఐ సూర్యకాంత్ అన్నారు. కాగా, ఈ డిజిటల్ మోసాలు బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్ల లేదా నేరగాళ్లతో సహకరించడం వల్ల జరిగి ఉండవచ్చని ధర్మాసనం అనుమానం వ్యక్తం చేసింది. డిజిటల్ అరెస్టుల పట్ల ఆర్‌బీఐ, బ్యాంకులు సకాలంలో స్పందించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది.

### సుప్రీం కోర్టు ఆదేశాలు

ఆర్‌బిఐ, టెలికాం శాఖ రూపొందించిన నిబంధనలను పరిగణనలోకి తీసుకుని, ఈ నేరాలను సమర్థవంతంగా అరికట్టడానికి నాలుగు వారాల్లోగా ఒక ముసాయిదా ఒప్పందాన్ని సిద్ధం చేయాలని హోం మంత్రిత్వ శాఖను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. అలాగే దేశవ్యాప్తంగా నమోదైన డిజిటల్ అరెస్ట్ కేసులను గుర్తించాలని సిబిఐని ఆదేశించింది. అలాగే, ఈ కేసుల్లో విచారణ జరిపేందుకు సిబిఐకి అవసరమైన అనుమతులను వెంటనే మంజూరు చేయాలని ఢిల్లీ, గుజరాత్ ప్రభుత్వాలకు స్పష్టం చేసింది. డిజిటల్ అరెస్ట్ బాధితులకు పరిహారం అందించే విషయంలో ఉదారంగా, ఆచరణాత్మక దృక్పథంతో వ్యవహరించాలని సుప్రీం కోర్టు సూచించింది. పరిహారం చెల్లింపుపై ఒక ఫ్రేమ్‌వర్క్ సిద్ధం చేయడానికి ఆర్‌బిఐ, టెలికాం శాఖ సంయుక్తంగా సమావేశం కావాలని ఆదేశించింది.

### బ్యాంకులపై ధర్మాసనం ఆగ్రహం

సైబర్ మోసాల నివారణలో బ్యాంకులు క్రియాశీలక పాత్ర పోషించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. 'కోట్లాది రూపాయల టర్నోవర్ ఉన్న వ్యాపార సంస్థల ఖాతాల్లో భారీ లావాదేవీలు జరిగితే అనుమానం రాకపోవచ్చు. కానీ కేవలం రూ.1520 వేల పెన్షన్ తీసుకునే వ్యక్తి ఖాతా నుంచి ఒక్కసారిగా రూ.50 లక్షలు లేదా కోటి రూపాయలు విత్‌డ్రా అవుతుంటే, మీ ఎఐ టూల్స్ ఎందుకు అలర్ట్ చేయడం లేదు?' అని సిజెఐ సూర్యకాంత్ ప్రశ్నించారు. ఈ కేసులో అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ అడ్వకేట్ ఎన్.ఎస్.నప్పినై తన వాదనలు వినిపిస్తూ, 'అనుమానాస్పద లావాదేవీలను గుర్తించడానికి బ్యాంకులు కృత్రిమ మేధ (ఏఐ)ని ఉపయోగించాలి' అని సూచించారు. కేవలం ఆర్‌బిఐ సర్క్యులర్లు జారీ చేస్తే సరిపోదని, నిబంధనలు పాటించని బ్యాంకులపై జరిమానాలు విధిస్తేనే ఫలితం ఉంటుందని ఆమె అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com